RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
LGTV
# లోకల్ గైడ్
ఎడిటర్: చిలకమర్రి రంరెడ్డి
ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

లోకల్ గైడ్ తెలంగాణ www.localguidenews.com
విలేకరులు కావలెను
సరికొత్త హంగులతో నూతన ఒరవడితో వెలువడుతున్న లోకల్ గైడ్ జాతీయ తెలుగు దినపత్రికలో పని చేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లా ఇన్చార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల ఆర్సీలు,మరియుమండలాల వారిగా రిపోర్టర్లు కావలెను.
ADVERTISEMENT మేనేజర్లు కావలెను అనుభవము ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును సంప్రదించండి
8977761499/9110308094

ప్రచురణ :, తెలంగాణ | సంపుటి 13, | సంచిక ,264 | పేజీలు -12 | సోమవారం - 19 - అక్టోంబర్ - 2026 | వెల రూ.2/-

## అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయండి: మోదీకి ఖర్గే లేఖ

- కొత్త బిల్లులపై చర్చ పెట్టాలని డిమాండ్
- గతంలో డీలిమిటేషన్ బిల్లు వీగిపోయిన వైనం ప్రస్తావన
- అఖిలపక్షం కోసం విజ్ఞప్తి చేయడం ఇది నాలుగోసారని వెల్లడి
- పార్లమెంట్ సమావేశాలు ప్రారోగ్ కాకపోవడంపై ఆందోళన




కొత్త బిల్లులు, కీలక ప్రతిపాదనలపై చర్చించేందుకు తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభ ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఈ ప్రతిపాదనలను పార్లమెంటులో ప్రవేశపెట్టడానికి ముందే వాటిపై సమగ్రంగా చర్చించాల్సిన అవసరం

## ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపర్లే కావాలి.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

- ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణను రద్దు చేయాలని తీర్మానం
- ఎన్నికల అవకతవకలపై రాష్ట్రపతికి ఫిర్యాదుకు నిర్ణయం
- కాంగ్రెస్, టీవీకే పార్టీలది ద్వంద్వ వైఖరి అంటూ డీఎంకే విమర్శలు




డీఎంకే పార్టీ కేంద్ర ఎన్నికల సంఘంపై, ఎన్నికల ప్రక్రియపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే పదవి నుంచి తొలగించాలని, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం) స్థానంలో తిరిగి బ్యాలెట్ పేపర్ల విధానాన్ని ప్రవేశపెట్టాలని ఆ పార్టీ ఎంపీలు డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పూర్తిగా రద్దు చేయాలని కూడా పట్టుబట్టారు.ఈరోజు ఉదయం 11 గంటలకు చెన్నైలోని పార్టీ ప్రధాన కార్యాలయం

## ప్రశాంత్‌భూషణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలి



- బంగ్లాదేశ్ తరహాలో మన దేశంలో కూడా అరాచకం సృష్టించి 'పాలన మార్పు' చేస్తామంటూ బహిరంగంగా ప్రకటించిన న్యాయవాది ప్రశాంత్‌భూషణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావ డిమాండ్ చేశారు.
- 'ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేకనే రాహుల్ గాంధీ దేశ వ్యతిరేక శక్తులతో చేతులు కలిపారు.
- ఓవైపు రాజ్యాంగ పుస్తకం చేతపట్టుకొని.. మరోవైపు రాజ్యాంగబద్ధ సంస్థలను నిర్వీర్యం చేసే కుట్ర చేస్తున్నారు.

బంగ్లాదేశ్ తరహాలో మన దేశంలో కూడా అరాచకం సృష్టించి 'పాలన మార్పు' చేస్తామంటూ బహిరంగంగా ప్రకటించిన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు డిమాండ్ చేశారు. 'ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా గెలవలేకనే మిగతా 2లో

## కరెంట్, నీళ్లు పొదుపుగా వాడాలి

- విద్యుత్, నీటిని పొదుపుగా వినియోగించాలని ప్రజలకు విజ్ఞప్తి
- రాష్ట్రంలో 20,000 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- గతంలో చలిగా ఉండే అక్టోబర్‌లోనూ ఇప్పుడు ఎండల తీవ్రత
- వాతావరణ మార్పుల వల్లే ఈ పరిస్థితి నెలకొందన్న భట్టి
- రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు.
- మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.
- శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు.
- రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ సుమారు 20,000 మెగావాట్లకు చేరుకుందని, పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావంతో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిందని వివరించారు.

### ఎల్ నినో ప్రభావంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆందోళన




రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా మారిన నేపథ్యంలో, ప్రజలు విద్యుత్తు, నీటిని అత్యంత పొదుపుగా వినియోగించుకోవాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విజ్ఞప్తి చేశారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా సహజ వనరులను బాధ్యతాయుతంగా వినియోగించు కోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన స్పష్టం చేశారు.శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన 'బతుకమ్మ యంగ్ ఫిల్మ్ మేకర్స్ అవార్డ్స్' ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్రంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ మిగతా 2లో

## ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయి



- ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు
- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని డిమాండ్

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టిక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మిగతా 2లో

## చంద్రబాబు ఆదేశాలతోనే పోలీసులు కాల్పులు జరిపారు

### వైసీపీ అభ్యర్థులు ఒంటరిగా వెళ్తే కొడుతున్నారు

- ఇష్టారాజ్యంగా కూటమి
- మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకుంటున్న ఘటనలపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.
- నామినేషన్ల కేంద్రం వద్దకు వైసీపీ అభ్యర్థులు ఒంటరిగా వెళ్తే కొడుతున్నారని ఆయన ఆరోపించారు.



మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సందర్భంగా చోటు చేసుకుంటున్న ఘటనలపై వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నామినేషన్ల కేంద్రం వద్దకు వైసీపీ అభ్యర్థులు ఒంటరిగా వెళ్తే కొడుతున్నారని మిగతా 2లో

## తెలంగాణ నీళ్లను తరలించే కుట్ర..



చంద్రబాబు ప్లాన్‌కు రేవంత్ సహకారం
నువ్వు మోటార్లు నడిపి ఉంటే వరంగల్‌కు కరువు ఎక్కడిది.. రేవంత్ రెడ్డిపై హరీశ్ రావు ఫైర్
తెలంగాణలో కరవు పరిస్థితులకు ప్రభుత్వమే కారణమని ఆరోపణ
దేవాదులలో 10 మోటార్లకు మూడు మాత్రమే నడుస్తున్నాయని విమర్శ

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తీవ్ర విమర్శలు చేశారు. మిగతా 2లో

## పక్క రాష్ట్రాల గూండాలతో టీడీపీ శ్రేణులపై గొడ్డలి పార్టీ దాడులు

### ఓటమి భయంతోనే దాడులు

- జగన్ పై మంత్రి సవిత ఫైర్
- వివేకా హత్య కేసులో వేళ్లన్నీ తాడేపల్లి ప్యాలెస్ వైపే...
- ఈడీ దాడులతో జగన్ లో భయాందోళనలు
- వీధి రౌడీలా పెట్రేగిన ఎంపీ మిధున్ రెడ్డి
- గొడ్డలి పార్టీ దౌర్జన్యాలపై ఈసీకి ఫిర్యాదు చేశాం
- వైసీపీ పని క్లోజ్
- పులివెందుల సహా స్థానిక ఎన్నికల్లో కూటమి క్లీన్ స్వీప్

'స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమి ఖాయమని తెలిసి జగన్,



గొడ్డలి పార్టీ నాయకులు దాడులకు తెగబడుతున్నారు. పక్కరాష్ట్రాల నుంచి గూండాలను తీసుకొచ్చి, టీడీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులకు తెగబడుతున్నారు. ఎంపీ మిధున్ రెడ్డి వీధి రౌడీలా వ్యవహరించారు. మిగతా 2లో

## నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!



- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మిగతా 2లో

## స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం

### స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు

- చంద్రబాబుతో మధ్యప్రదేశ్ సీఎం సమావేశం... జాతీయ రాజకీయాలపై చర్చ
- స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం అని సీఎం చంద్రబాబు అన్నారు.
- మున్సిపల్ ఎన్నికల వేళ కూటమి నేతలతో సీఎం సమావేశమయ్యారు.
- ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు సమన్వయంతో వెళ్లాలని సూచించారు
- నామినేషన్లకు కూటమి నేతలు అభ్యర్థులతో కలిసి వెళ్లాలని చెప్పారు.
- శుక్రవారం జరిగిన ఘటనల దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.
- అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని అన్నారు.
- స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు సమిష్టిగా కృషి చేయాలని ఆదేశించారు.
- ఇదిలా ఉంటే స్థానిక ఎన్నికల టికెట్ల కేటాయింపులో చాలా మంది అభ్యర్థులు,కార్యకర్తలు నిరాశ చెందుతున్నారు.



స్థానిక ఎన్నికల్లో కూటమి ఐక్యతే కీలకం అని సీఎం చంద్రబాబు అన్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ కూటమి నేతలతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు మిగతా 2లో

## 'ప్రభుత్వం, పోలీసులు, ఎన్నికల సంఘం కుమ్మక్కు'



- పోలీసుల కళ్లెదుటే టీడీపీ గూండాల దాడులు, రౌడీయిజం
- ఎన్నికల అధికారుల చేతుల్లోంచి నామినేషన్ పత్రాలు లాక్కెళ్తున్న వైనం
- వైఎస్సార్సీపీ అభ్యర్థులపై దాడులు చేస్తున్నా పోలీసుల చోద్యం
- వీడియో ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఎన్నికల సంఘం
- అరాచకాలను ఆధారాలతో సహా చూపించిన సుధాకర్ బాబు

తాడేపల్లి: పోలీసులు కళ్లెదుటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై టీడీపీ గూండాలు దాడులు చేసి మిగతా 2లో

RNI NO. APBIL/2013/50718

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్

ద్విభాషా దినపత్రిక




# బతుకమ్మ ఆడపడుచులకు చీరల కానుక.. గుడిపూడి తిరుమల రావు ఆప్యాయత!

**గేట్ కారేపల్లిలో బతుకమ్మ ఆడిన మహిళలకు చీరల పంపిణీ చేసిన కాంగ్రెస్ నాయకుడు తిరుమల రావు**



**కారేపల్లి, అక్టోబర్ 18 (లోకల్ గైడ్ న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ సందర్భంగా సింగరేణి మండలం గేట్ కారేపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుడు గుడిపూడి తిరుమల రావు బతుకమ్మ ఆడిన ఆడపడుచులందరికీ చీరలు పంపిణీ చేశారు. పండుగ వేళ మహిళలకు చీరలు అందజేసి వారిలో ఆనందోత్సాహాలు నింపారు. ఈ సందర్భంగా గుడిపూడి తిరుమల రావు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు, సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. మహిళలు సంప్రదాయబద్ధంగా బతుకమ్మ వేడుకలను ఆనందంగా జరుపుకోవడం తెలంగాణ సంస్కృతికి నిదర్శనమన్నారు. బతుకమ్మ ఆడిన ఆడపడుచులకు చీరలు అందజేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. బతుకమ్మ తల్లి ఆశీస్సులతో ప్రతి కుటుంబం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. గ్రామ ప్రజలందరికీ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కందుల సామేలు, కాంగ్రెస్ నాయకులు చెరుకూరి రామారావు, వరికొల్లు వీరభద్రం, షేక్ హాజిమియా, చెరుకూరి కృష్ణమూర్తి, నూకల మోహనరావు, కంటగాని లింగయ్య, సాయిన్నీ బసవయ్య, సపావత్ అప్పయ్య, వీరయ్య, సామినేని తిరుపతిరావు, కాకటి పృథ్వీ, కంటగాని కిషోర్, మర్రి సాయి, చందనూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కారేపల్లిలో ఎల్‌నినోపై అలర్ట్.. పొదుపు చర్యలకు సర్పంచుల సిద్ధం! రంజిత్ కుమార్

**నీరు, విద్యుత్ వృథాకు అడ్డుకట్ట వేయండి.. తోటి సర్పంచులకు కారేపల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్ కుమార్ పిలుపు**




**కారేపల్లి, అక్టోబర్ 18 (లోకల్ గైడ్ న్యూస్):** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని కారేపల్లి మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నీరు, విద్యుత్ పొదుపు చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని కారేపల్లి మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు భూక్యా రంజిత్ కుమార్ తోటి సర్పంచులకు పిలుపునిచ్చారు. రానున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు గ్రామస్థాయిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కారేపల్లి మండలంలోని గ్రామాల్లో తాగునీటి వృథాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. నీటిని అవసరాలకు అనుగుణంగా పొదుపుగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటి ట్యాంకులు నిండిన వెంటనే పంపులను నిలిపివేసేలా పంచాయతీ సిబ్బందికి ఆదేశాలు ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రతి నీటి చుక్కను సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఎండ తీవ్రత దృష్ట్యా విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో అవసరం లేని సమయాల్లో వీధి దీపాలను ఆపివేయాలని, విద్యుత్ పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీల పరిధిలో విద్యుత్ వృథా కాకుండా సిబ్బంది పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. కారేపల్లి మండలంలోని రైతులు ఎల్‌నినో ప్రభావంపై అవగాహన కలిగి ఉండాలని భూక్యా రంజిత్ కుమార్ సూచించారు. వర్షపాతం, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలను ఎంచుకునేలా రైతులకు వ్యవసాయ శాఖ సహకారంతో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రభుత్వం సూచిస్తున్న పొదుపు చర్యలను కారేపల్లి మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీలో అమలు చేయాలని, ప్రజలు, రైతులు, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. నీటి కొరత, విద్యుత్ వృథా వంటి సమస్యలను నివారించేందుకు సర్పంచులందరూ బాధ్యతగా వ్యవహరిస్తూ తమ గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని భూక్యా రంజిత్ కుమార్ కోరారు.

# ఇంటిపై తాటిపత్రి కప్పించి, క్వింటా బియ్యం, ఆర్థిక సాయం అందజేసిన మండల అధ్యక్షులు సమ్మిగౌడ్



**లోకల్ గైడ్ అక్టోబర్ 18 మహబూబాబాద్ :** మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం లో దశదిన ఖర్మ కు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సమ్మిగౌడ్ ఆర్థిక సహాయం.. నాన్న మరణించిన కొన్ని సంవత్సరాలకు అమ్మ మృతి.. కన్నీటి సంద్రంలో ఇద్దరు కుమార్తెలుఇంటి పరిస్థితి చూసి తక్షణ సాయం.. ఇంటిపై తాటిపత్రి కప్పించి, క్వింటా బియ్యం, ఆర్థిక సాయం అందజేసిన మండల అధ్యక్షులు బలహీన వర్గాలకు మండల కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుంది – మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ తల్లిదండ్రులను కోల్పోయి.. అనాథలుగా మారిన కుమార్తెలు కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన జనగాం కవిత భర్త యాకయ్య మరణించిన కొద్ది సంవత్సరాలకే కవిత కూడా అనారోగ్య కారణాలతో అక్టోబర్ 17న మృతిచెందారు. వరుసగా తల్లిదండ్రులను కోల్పోవడంతో వారి కుమార్తెలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఆ కుటుంబం తీవ్ర పేదరికంలో ఉందని, పిల్లలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,చేసే ఇద్దరు ఆడపిల్లలు చిన్నవాళ్లు అవ్వడం తో కన్నతల్లి దశదిన ఖర్మ కూడా చేసే పరిస్థితి లేదు అని గ్రామ మాజీ సర్పంచ్ యాకన్న యాదవ్, గ్రామ పార్టీ అధ్యక్షులు మర్రి వెంకట్రావు మండల పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా ..ఇద్దరు ఆడపిల్లల తల్లి మరణవార్త విని వారి ఇంటికి వెళ్లి కుటుంబ పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. కన్నవారిని కోల్పోయిన పిల్లల దీనస్థితి, నివాసానికి సరైన సౌకర్యాలు లేకపోవడం ఆయనను కలచివేసింది..ఆ కుటుంబం నివసిస్తున్న ఇంటి పరిస్థితిని చూసిన సమ్మయ్య గౌడ్ తక్షణమే స్పందించారు. ఇంటిపై తాటిపత్రి కప్పించే ఏర్పాట్లు చేయించడంతో పాటు, అర క్వింటా బియ్యం, ఆర్థిక సాయం అందించారు. కష్టకాలంలో ఆ కుటుంబానికి అండగా నిలిచి, పిల్లలు ఒంటరివారమనే భావనకు లోనుకాకుండా ధైర్యం చెప్పారు.ఈ సందర్భంగా బాలికతో మాట్లాడిన సమ్మయ్య గౌడ్.. తనకు సాధ్యమైన సహాయం అందిస్తూ తల్లిదండ్రులను కోల్పోయిన ఆ ఆడబిడ్డలకు అండగా ఉంటానని,పెద్ద కూతురు పెళ్లి అవ్వగా,చిన్న బిడ్డ పెళ్లికి కూడా భవిష్యత్ లో సహాయం చేస్తానని భరోసా కల్పించారు. “కష్టాలు వచ్చాయని చదువును మధ్యలో ఆపవద్దు.. నువ్వు చదువుకోవాలి.. నీ భవిష్యత్తుకు నేను అండగా ఉంటాను” అంటూ బాలికలో ధైర్యాన్ని నింపారు.. ఆపదలో ఉన్న కుటుంబానికి సాయం అందించడమే కాకుండా, చదువు మానేసిన బాలిక భవిష్యత్తుపై బాధ్యతతో స్పందించిన సమ్మయ్య గౌడ్ తీరును స్థానికులు అభినందించారు. కన్నవారిని కోల్పోయిన ఆ ఇద్దరు కుమార్తెల జీవితాల్లో ఈ సహాయం దశదిన ఖర్మ కార్యక్రమానికి చాలా సహాయం అవుతుందని,పిలిచిన వెంటనే వచ్చి సహయం చేసిన మండల అధ్యక్షులు సమ్మిగౌడ్ గ్రామస్థులు అభినందించారు.. ఈ కార్యక్రమంలో వెంకటగిరి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మర్రి వెంకట్రావు, మాజీ సర్పంచ్ సుజాత యాకన్న, మాజీ ప్రజాప్రతినిధి మారం మోహన్ రెడ్డి, యూత్ అధ్యక్షుడు పోల్సాని విక్రమ్, ఇంటికన్నె గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజులపాటి మల్లయ్య, ఇంటికన్నె యూత్ అధ్యక్షుడు వర్ధంతి రంజిత్, కాంగ్రెస్ పార్టీ యువకులు జగదీష్, బానోతు అమిలాల్, అంబాల శరత్, జనగాం సాయికుమార్, పందుల రాజు, మల్లూరి రాజు, అశోక్, సీనియర్ నాయకులు రాంపల్లి వెంకన్న, నల్లవాసప్పలయ్య, మిట్టకడుపుల యాకయ్య, కత్రి కిషన్ తదితరులు పాల్గొన్నారు.'

# 'ఎల్‌నినో' ముప్పు.. ప్రభుత్వం సిద్ధమేనా, ప్రజలు సిద్ధమేనా

**వర్షాభావం నుంచి భూగర్భజలాల క్షీణత వరకు..**

**జలభద్రతకు సమగ్ర కార్యాచరణ ఎప్పుడు**

**నీటి పొదుపు నినాదం కాదు.. విధానం కావాలి**




నీరు ప్రకృతి ప్రసాదించిన అపురూప వనరు. జీవనానికి, వ్యవసాయానికి, పారిశ్రామిక అభివృద్ధికి, ప్రజారోగ్యానికి అదే ఆధారం. అయినా అందుబాటులో ఉన్న జలవనరులను విచక్షణారహితంగా వినియోగించడం, వర్షపు నీటిని ఒడిసిపట్టుకోలేకపోవడం, చెరువులు, కుంటలు, కాలువలను నిర్లక్ష్యం చేయడం వల్ల జలభద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది. వాతావరణ మార్పులు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వర్షపాతంలో అస్థిరత ఈ సమస్యను మరింత తీవ్రం చేస్తున్నాయి. ఎల్‌నినో ప్రభావంపై వెలువడుతున్న హెచ్చరికలు తెలంగాణతోపాటు దేశంలోని పలు ప్రాంతాలు అప్రమత్తం కావాల్సిన అవసరాన్ని గుర్తుచేస్తున్నాయి. ఇది కేవలం వర్షాభావానికి సంబంధించిన సమస్య కాదు. నీటి లభ్యత, వినియోగం, నిల్వ, పంపిణీ, పునర్వినియోగం వంటి అంశాలతో ముడిపడిన సమగ్ర సవాలు.

మేఘాలు వెనక్కి.. ముందస్తు సన్నద్ధత ఎక్కడ

పసిఫిక్ మహాసముద్రంలోని భూమధ్యరేఖ ప్రాంత జలాలు సాధారణం కంటే వేడెక్కే వాతావరణ పరిస్థితిని ఎల్‌నినో అంటారు. ఇది ప్రపంచ వాతావరణ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. భారత రుతుపవనాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ, ప్రతి ఎల్‌నినో సంవత్సరంలోనూ దేశమంతటా ఒకే విధమైన వర్షాభావం ఏర్పడుతుందని భావించరాదు. ఇతర సముద్ర, వాతావరణ పరిస్థితులు కూడా వర్షపాతాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల శాస్త్రీయ అంచనాలను పరిగణనలోకి తీసుకుంటూనే, ప్రాంతాలవారీగా నీటి అవసరాలు, నిల్వలు, ప్రమాదాలను అంచనా వేసి కార్యాచరణ రూపొందించాలి.తెలంగాణలో వర్షపాతం తగ్గితే వ్యవసాయం, తాగునీటి సరఫరా, భూగర్భజలాలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది. ముఖ్యంగా బోరుబావులపై ఆధారపడే రైతులు, పరిమిత జలవనరులున్న గ్రామాలు, వేగంగా విస్తరిస్తున్న పట్టణాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉంది. అధిక ఉష్ణోగ్రతలతో ఆవిరీభవనం పెరిగితే నేలలో తేమ తగ్గి పంటలకు నీటి అవసరం పెరుగుతుంది. అయితే సంక్షోభానికి ఎల్‌నినో ఒక్కటే కారణమని చెప్పడం సరికాదు. జలవనరుల నిర్వహణలోని లోపాలు, భూగర్భజలాల అధిక వినియోగం, నీటి వృథా కూడా సమస్యను తీవ్రతరం చేస్తాయి.

కరవు హెచ్చరికలు.. గణాంకాలకే పరిమితం కావద్దు

వర్షపాత లోటు, జలాశయాల నిల్వలు, భూగర్భజలాల మట్టాలు, తాగునీటి అవసరాలు, పంటల పరిస్థితిపై తాజా గణాంకాలను ప్రభుత్వం నిరంతరం సమీక్షించాలి. జిల్లాలు, మండలాలవారీగా ప్రమాద స్థాయిని గుర్తించి కార్యాచరణ సిద్ధం చేయాలి. గత నివేదికల్లో పేర్కొన్న జిల్లాలు, మండలాల సంఖ్యలను ప్రస్తుత పరిస్థితికి యథాతథంగా వర్తింపజేయడం తగదు. సంబంధిత శాఖల తాజా సమాచారంతోనే సంక్షోభ తీవ్రతను నిర్ధారించాలి. ముఖ్యమంత్రి స్థాయి నుంచి గ్రామస్థాయి అధికారి వరకు సమీక్షలు జరగడం అవసరమే. కానీ సమావేశాలు నిర్వహించడం, ఆదేశాలు జారీ చేయడం మాత్రమే సమర్థ పాలనకు కొలమానం కాదు. క్షేత్రస్థాయిలో తాగునీటి సరఫరా మెరుగుపడిందా? ఎండిపోతున్న బోరుబావులకు ప్రత్యామ్నాయాలు సిద్ధమయ్యాయా? రైతులకు అవసరమైన సహాయం అందుతోందా? పశుగ్రాసం కొరతను ఎదుర్కొనే ఏర్పాట్లు జరిగాయా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఉండాలి. నీటి కొరత ఏర్పడిన తర్వాత ట్యాంకర్ల కోసం పరుగులు తీయడం కంటే, ముందుగానే ప్రత్యామ్నాయ సరఫరా మార్గాలను సిద్ధం చేయడం మెరుగైన పాలనకు నిదర్శనం.

ప్రభుత్వం రంగంలోకి దిగింది.. అమలు తీరుపైనే అసలు పరీక్ష

రాష్ట్రంలో ఎల్‌నినో ముప్పును దృష్టిలో ఉంచుకొని తాగునీరు, సాగునీరు, విద్యుత్, వ్యవసాయ రంగాలపై ముందస్తు సమీక్షలు నిర్వహించడం సానుకూల పరిణామం. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి అధికారులను అప్రమత్తం చేసి, గ్రామస్థాయి నుంచి ప్రజలకు అవగాహన కల్పించాలని, చేతికొచ్చిన పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు అందిన సమాచారం సూచిస్తోంది. పంచాయతీరాజ్ మంత్రి దనసరి అనసూయ సీతక్క గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో తాగునీటి కొరత, ఉపాధి సమస్యలు, పశుగ్రాసం లభ్యతపై దృష్టి సారించడం కూడా ప్రాధాన్యమైన అంశం. ఉపాధి హామీ పథకాన్ని కేవలం కూలి కల్పనకే పరిమితం చేయకుండా, చెరువుల పునరుద్ధరణ, నీటి నిల్వ నిర్మాణాలు, నేల సంరక్షణ వంటి పనులతో అనుసంధానిస్తే ద్వంద్వ ప్రయోజనం కలుగుతుంది. ఒకవైపు గ్రామీణ కుటుంబాలకు ఆదాయం లభిస్తే, మరోవైపు భవిష్యత్తులో నీటి భద్రతకు అవసరమైన ఆస్తులు ఏర్పడతాయి. అయితే ప్రకటించిన పనులు ఎంతమందికి అందాయి? వేతనాలు సకాలంలో చెల్లిస్తున్నారా? నిర్మించిన జల సంరక్షణ వ్యవస్థలు వాస్తవంగా పనిచేస్తున్నాయా? అనే వివరాలు కూడా వెల్లడించాలి. హైదరాబాద్ మహానగరంలో నీటి వినియోగాన్ని తగ్గించడం, శుద్ధి చేసిన మురుగునీటిని ఇతర అవసరాలకు మళ్లించడం, అదనపు సరఫరా మార్గాలను సిద్ధం చేయడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. నిర్మాణ రంగం, పరిశ్రమలు, పార్కుల నిర్వహణలో శుద్ధి చేసిన నీటిని వినియోగించడం ద్వారా తాగునీటిపై ఒత్తిడి తగ్గించవచ్చు. అయితే ప్రకటించిన లక్ష్య తేదీలు, ఫిల్లింగ్ స్టేషన్ల సంఖ్య, సరఫరా సామర్థ్యం, నీటి నాణ్యత వంటి అంశాలపై క్రమం తప్పకుండా నివేదికలు విడుదల చేయాలి. ప్రకటనకు, వాస్తవ అమలుకు మధ్య అంతరం ఉండకూడదు.

భూగర్భజలాలు.. బోరు ఎండితే మరో బోరు పరిష్కారం కాదు

తెలంగాణలో వ్యవసాయానికి భూగర్భజలాలు కీలక ఆధారం. భూమిలోకి ఇంకే నీటి పరిమాణం కంటే ఎక్కువగా నీటిని తోడితే భూగర్భజల మట్టాలు పడిపోతాయి. ఒక బోరు ఎండిపోతే మరో బోరు వేయడం తాత్కాలిక ఉపశమనం మాత్రమే. అదే విధానం కొనసాగితే పెట్టుబడి నష్టాలు పెరగడమే కాకుండా, నీటి లభ్యత మరింత అనిశ్చితంగా మారుతుంది. ప్రతి జిల్లా, మండలంలో భూగర్భజలాల మట్టాలు ఎలా మారుతున్నాయి? అధిక వినియోగ ఒత్తిడిని ఎదుర్కొంటున్న ప్రాంతాలేవి? వర్షాకాలం తర్వాత నీటి మట్టాలు ఎంత మేరకు పెరుగుతున్నాయి? ఎక్కడ బోర్లు తరచుగా ఎండిపోతున్నాయి? ఈ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. చెక్‌డ్యామ్‌లు, పెర్కొలేషన్ ట్యాంకులు, కాంటూర్ కందకాలు, చెరువుల పునరుద్ధరణ, వర్షపు నీటి సంరక్షణ వంటి చర్యలను స్థానిక భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా చేపట్టాలి. నిర్మాణాల సంఖ్యను చూపించడం కాకుండా, వాటి వల్ల భూగర్భజలాల పునర్భరణ ఎంత మెరుగుపడిందో అంచనా వేయాలి.

వ్యవసాయంలో నీటి పొదుపు.. రైతుకు భరోసా కల్పించాలి

వ్యవసాయ రంగంలో నీటి వినియోగ సామర్థ్యాన్ని పెంచకుండా జలసంక్షోభాన్ని అధిగమించడం కష్టం. బిందు, తుంపర సేద్యం వంటి పద్ధతులను తగిన పంటలకు ప్రోత్సహించాలి. నేలలో తేమను నిల్వ చేసే పద్ధతులు, పంటల అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా, వర్షాధార వ్యవసాయానికి అనువైన ప్రణాళికలను అమలు చేయాలి. అయితే నీటిని ఆదా చేయాలన్న బాధ్యతను రైతులపై మాత్రమే మోపడం న్యాయం కాదు. పంటల మార్పిడికి ప్రోత్సాహకాలు, మార్కెట్ భరోసా, సాంకేతిక సలహాలు, ఆర్థిక సహాయం అందించాలి. రైతు ఆదాయానికి భద్రత కల్పించకుండా అధిక నీటి అవసరమున్న పంటల నుంచి మారాలని చెప్పడం ఆచరణలో ఫలించదు. వ్యవసాయ విధానాలు, విద్యుత్ సరఫరా, సాగునీటి నిర్వహణ పరస్పరం అనుసంధానమై ఉండాలి.

చెరువుల సంరక్షణ.. వర్షపు నీటిని ఒడిసిపట్టుకోవాలి

చెరువులు, కుంటలు, కాలువలు గ్రామీణ జలభద్రతకు కీలకం. పట్టణ విస్తరణ, ఆక్రమణలు, కాలుష్యం, నీటి ప్రవాహ మార్గాల మూసివేత వల్ల అనేక ప్రాంతాల్లో జలవనరుల సామర్థ్యం దెబ్బతింటోంది. చెరువుల పూడికతీతతోనే సమస్య పరిష్కారం కాదు. వాటిలోకి నీరు చేరే కాలువలు, వాగులు, సహజ ప్రవాహ మార్గాలను కూడా పునరుద్ధరించాలి. ఆక్రమణలను అరికట్టాలి. పనుల నాణ్యత, ఖర్చు, ఫలితాలపై పారదర్శక పర్యవేక్షణ ఉండాలి. పట్టణాల్లో ప్రతి భవనానికి వర్తించే నిబంధనల మేరకు వర్షపు నీటి సంరక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేయాలి. నిర్మాణ అనుమతుల సమయంలోనే కాకుండా, భవనం వినియోగంలోకి వచ్చిన తర్వాత కూడా వాటి పనితీరును తనిఖీ చేయాలి. నీరు భూమిలోకి ఇంకే ప్రాంతాలను పూర్తిగా కాంక్రీటుతో కప్పివేయకుండా పట్టణ ప్రణాళికల్లో జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షం పడినప్పుడు నీరు రోడ్లపై ప్రవహించి వృథా కావడం, మరోవైపు వేసవిలో తాగునీటి కోసం ట్యాంకర్లపై ఆధారపడటం నగరాల ప్రణాళికలోని లోపాలను సూచిస్తోంది.

శుద్ధి చేసిన నీరు.. తాగునీటికి ప్రత్యామ్నాయ వనరు

పట్టణాలు, పరిశ్రమల నుంచి వెలువడే మురుగునీటిని శుద్ధి చేసి, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా నిర్మాణ పనులు, పార్కులు, పరిశ్రమలు, ల్యాండ్‌స్కేపింగ్ వంటి అవసరాలకు వినియోగించవచ్చు. దీనివల్ల తాగునీటి వనరులపై ఒత్తిడి తగ్గుతుంది. శుద్ధి చేసిన నీటిని అందించే వ్యవస్థలను విస్తరించడంతోపాటు, దాని నాణ్యతను క్రమం తప్పకుండా పరీక్షించాలి. వినియోగదారులకు నీటి నాణ్యత, ధర, సరఫరా వివరాలు పారదర్శకంగా అందుబాటులో ఉండాలి. హైదరాబాద్‌లో శుద్ధి చేసిన నీటిని నిర్మాణ రంగానికి సరఫరా చేసే గ్రీన్ ట్యాంకర్ వంటి వ్యవస్థలు సమర్థంగా పనిచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చు. అయితే ఈ విధానం పేరుకే పరిమితం కాకూడదు. ఎన్ని శుద్ధి కేంద్రాలు పనిచేస్తున్నాయి? వాటి సామర్థ్యం ఎంత? రోజుకు ఎంత నీటిని పునర్వినియోగంలోకి తెస్తున్నారు? ఎంతమంది వినియోగదారులు ఈ సేవలను పొందుతున్నారు? అనే వివరాలను వెల్లడించాలి. తాగునీటిని అనవసరంగా నిర్మాణ పనులకు వినియోగించడాన్ని నియంత్రించాలి. అదే సమయంలో పైప్‌లైన్ల లీకేజీలు, అక్రమ మోటారు కనెక్షన్లు, పంపిణీలో అసమానతలను అరికట్టాలి.

గ్రామీణ జీవనోపాధి, పశుగ్రాసంపై ప్రత్యేక దృష్టి

కరవు ప్రభావం మొదటగా గ్రామీణ కుటుంబాల జీవనోపాధిపై పడుతుంది. సాగు దెబ్బతింటే రైతుల ఆదాయం తగ్గుతుంది. పశుగ్రాసం, తాగునీటి కొరత ఏర్పడితే పశుపోషణ కూడా సంక్షోభంలో పడుతుంది. పశువులను తక్కువ ధరలకు విక్రయించాల్సిన పరిస్థితి రాకుండా ముందుగానే గ్రాస నిల్వలు, నీటి సరఫరా మార్గాలు, అవసరమైన చోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేయాలి. వ్యవసాయ పనులు తగ్గిన సమయంలో ఉపాధి హామీ పథకం గ్రామీణ పేదలకు రక్షణగా నిలవాలి. పనులు సకాలంలో కల్పించడం, వేతనాలు ఆలస్యం కాకుండా చెల్లించడం ముఖ్యం. గిరిజన ప్రాంతాలు, వర్షాధార గ్రామాలు, నీటి కొరత అధికంగా ఉండే ప్రాంతాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. తాగునీటి సమస్య ప్రజారోగ్యంపై చూపే ప్రభావాన్ని కూడా విస్మరించకూడదు. నీటి నాణ్యత పరీక్షలు, కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులపై అవగాహన, అత్యవసర వైద్య సన్నద్ధత కరవు ప్రణాళికలో భాగం కావాలి.

ప్రభుత్వానికి సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలు

నీటి సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో ప్రభుత్వాల బాధ్యత కీలకం. ప్రకటనలు, సమీక్షలతో సరిపెట్టకుండా స్పష్టమైన లక్ష్యాలు, గడువులు, నిధులు, బాధ్యతలతో కూడిన కార్యాచరణను అమలు చేయాలి.

– జిల్లాలు, మండలాలవారీగా ప్రస్తుత వర్షపాత లోటు, భూగర్భజలాల పరిస్థితి ఏమిటి?– తాగునీటి కొరత ఎదురయ్యే గ్రామాలు, పట్టణాలకు ప్రత్యామ్నా య సరఫరా ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయా? – చెరువుల ఆక్రమణలు, కాలుష్యం, కాలువల మూసివేతను అరికట్టేందుకు తీసుకున్న చర్యలేమిటి? – వర్షపు నీటి సంరక్షణ, భూగర్భజలాల పునర్భరణ పనులతో సాధించిన ఫలితాలేమిటి? – శుద్ధి చేసిన మురుగునీటి పునర్వినియోగం ఎంత మేరకు జరుగుతోంది?– జల సంరక్షణకు కేటాయించిన నిధులు ఎంత? వాటి ఖర్చుతో సాధించిన ఫలితాలేమిటి? – కరవు ప్రభావిత ప్రాంతాల్లో రైతులు, కూలీలు, పశుపోషకులకు అందుతున్న సహాయం ఏమిటి? – నీటి నాణ్యత పరీక్షల ఫలితాలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారా?ఈ ప్రశ్నలకు గణాంకాలతో కూడిన సమాధానాలు ఇవ్వాలి. ప్రజలకు సమాచారం అందుబాటులో ఉండటం, పనుల పురోగతిపై పర్యవేక్షణ జరగడం, లోపాలకు బాధ్యత నిర్ణయించడం సమర్థ నీటి పాలనకు పునాది కావాలి.

ప్రకటనలు కాదు.. ఫలితాలే ప్రామాణికం

ప్రభుత్వం ముందస్తుగా సమీక్షలు నిర్వహించడం, నీటి పొదుపుపై అవగాహన కల్పించడం, శుద్ధి చేసిన నీటి వినియోగాన్ని పెంచడం వంటి చర్యలు అవసరమైనవే. కానీ వీటిని తాత్కాలిక అత్యవసర చర్యలుగా మాత్రమే చూడకూడదు. ప్రతి ఇంట్లో వర్షపు నీటి సంరక్షణ, ప్రతి పట్టణంలో జలవనరుల రక్షణ, ప్రతి పరిశ్రమలో నీటి పునర్వినియోగం, ప్రతి గ్రామంలో భూగర్భజలాల పునర్భరణ దీర్ఘకాలిక విధానంలో భాగం కావాలి.కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో కరవు పరిస్థితులపై వెలువడుతున్న నివేదికలను పరిశీలిస్తూ, తెలంగాణ కూడా అవసరమైతే కేంద్ర సహాయం కోసం వాస్తవ గణాంకాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. అయితే ఇతర రాష్ట్రాలు ప్రకటించిన నిధుల అభ్యర్థనలను యథాతథంగా అనుసరించడం పరిష్కారం కాదు. రాష్ట్రంలో నష్టం అంచనా, అర్హత ప్రమాణాలు, అవసరమైన నిధులు, సహాయక చర్యలను సంబంధిత మార్గదర్శకాల ప్రకారం నిర్ధారించాలి. మీడియా కూడా అధికారుల ప్రకటనలను ప్రచురించడంతో తన బాధ్యత ముగిసిందని భావించకూడదు. ఎన్ని శుద్ధి కేంద్రాలు పనిచేస్తున్నాయి? నీటి సరఫరా లక్ష్యాలు నెరవేరాయా? ఉపాధి హామీ ఎంతమందికి అందింది? చెరువుల పునరుద్ధరణతో ఎంత నిల్వ సామర్థ్యం పెరిగింది? ప్రజల నీటి వినియోగం తగ్గిందా? వంటి అంశాలను నెలవారీగా పరిశీలించాలి. గణాంకాలు, క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రజల అనుభవాలను కలిపి నివేదించినప్పుడే పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది.

ముగింపు: నీటి పొదుపు నినాదం కాదు.. జీవన విధానం కావాలి

ఎల్‌నినో ప్రకృతి వాతావరణ వ్యవస్థలో భాగం. దాని ప్రభావాన్ని పూర్తిగా నియంత్రించడం మన చేతుల్లో లేదు. కానీ దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించుకోవడం మాత్రం సాధ్యమే. వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భజలాలను పునర్భరించడం, నీటి వృథాను అరికట్టడం, శుద్ధి చేసిన నీటిని పునర్వినియోగించడం, రైతులకు ప్రత్యామ్నాయ సాగు పద్ధతుల్లో సహకరించడం మనం చేయగలిగిన పనులే.

ప్రభుత్వాలు సమర్థమైన విధానాలను అమలు చేయాలి. స్థానిక సంస్థలు జలవనరులను పరిరక్షించాలి. పరిశ్రమలు నీటి పునర్వినియోగాన్ని పెంచాలి. రైతులకు ఆర్థిక, సాంకేతిక భరోసా కల్పించాలి. ప్రజలు రోజువారీ జీవితంలో నీటిని పొదుపుగా వినియోగించాలి. ప్రతి చుక్కను సంరక్షించడం, ప్రతి జలవనరును కాపాడటం, ప్రతి రూపాయి ఖర్చుకు ఫలితాన్ని నిర్ధారించడం పాలనలో భాగం కావాలి.నీటి సంక్షోభం వచ్చిన తర్వాత స్పందించడం పరిపాలన. సంక్షోభం రాకముందే సిద్ధపడటం సమర్థ పాలన. తెలంగాణకు ఇప్పుడు కావాల్సింది ప్రకటనల హడావుడి కాదు.. శాస్త్రీయ అంచనాలు, సమన్వయంతో కూడిన కార్యాచరణ, నిరంతర పర్యవేక్షణ, పారదర్శకత, ప్రజల భాగస్వామ్యం. మేఘాలు ఎప్పుడు కురుస్తాయో మనం నిర్ణయించలేం. కానీ కురిసిన ప్రతి చుక్కను ఎంత సమర్థంగా నిల్వ చేసుకుంటామో, అందుబాటులో ఉన్న నీటిని ఎంత బాధ్యతగా వినియోగిస్తామో మాత్రం మన నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. రేపటి దాహాన్ని నేటి నిర్లక్ష్యంతో ఆహ్వానించకూడదు. నీటిని కాపాడటం అంటే భవిష్యత్తును కాపాడటం.

వనం రామకృష్ణ,
మేడ్చల్ జిల్లా ప్రతినిధి,
లోకల్ గైడ్ తెలుగు న్యూస్ పేపర్ మరియు మీడియా.

# మెడికవర్ హాస్పిటల్ వరంగల్ మోటోభారత్ ఆధ్వర్యంలో వరల్డ్ ట్రామా డే బైక్ రైడ్

**రోడ్డు భద్రతపై అవగాహన..**

**ప్రమాదాల నివారణే లక్ష్యంగా 150 బైక్‌లతో ర్యాలీ**

**వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి, అక్టోబర్(లోకల్ గైడ్ న్యూస్) :** వరంగల్ లో,రోడ్డు భద్రత, బాధ్యతాయుతమైన డ్రైవింగ్, రోడ్డు ప్రమాదాల నివారణ, అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్య చికిత్స ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ మోటోభారత్ వరంగల్ సంయుక్తంగా వరల్డ్ ట్రామా డే సందర్భంగా బైక్ రైడ్ నిర్వహించాయి అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 బైక్‌లు పాల్గొని, రోడ్డు ప్రమాదాలను నివారించడంతో పాటు ప్రాణనష్టాన్ని తగ్గించాలనే సందేశాన్ని ప్రజలకు అందించారని తెలిపారు.ఈ సందర్భంగా మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు ట్రామా (ప్రమాదాల కారణంగా సంభవించే తీవ్రమైన గాయాలు) గురించి అవగాహన కలిగి ఉండటం, రోడ్డు ప్రమాదాలను నివారించడం, ప్రమాద బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించడం వంటి అంశాల ప్రాముఖ్యతను






వివరించారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, హెల్మెట్ ధరించడం, అతివేగం మరియు నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండటం, బాధ్యతాయుతంగా వాహనాలు నడపడం ద్వారా తీవ్రమైన గాయాలు, ప్రాణనష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ దినేష్, ఎమర్జెన్సీ మెడిసిన్ వైద్యులు డాక్టర్ వరుణ్, ఆర్థోపెడిక్స్ వైద్యులు డాక్టర్ దయాసాగర్ రెడ్డి, గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు పాల్గొని ప్రసంగించారు. ట్రామా వల్ల మానవ జీవితం పై పడే ప్రభావం, ప్రమాదాల కారణంగా ఎదురయ్యే తీవ్రమైన గాయాలు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు, ప్రమాద బాధితులకు సకాలంలో చికిత్స అందించడం వంటి అంశాలపై వారు అవగాహన కల్పించారు.ప్రమాదాలను నివారించడంతో పాటు అత్యవసర వైద్య సేవలు సకాలంలో అందుబాటులో ఉండటం ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ మార్కెటింగ్ హెడ్ హరినాథ్ గుప్తా మాట్లాడుతూ, రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వైద్య సంస్థలు, సామాజిక సంస్థలు కలిసి పనిచేయడం ఎంతో అవసరమని పేర్కొన్నారు.ఇలాంటి కార్యక్రమాలు ప్రజల్లో బాధ్యతాయుతమైన రహదారి ప్రవర్తనను ప్రోత్సహించడంతో పాటు ప్రమాదాల నివారణకు దోహదపడతాయని తెలిపారు. బైక్ రైడ్‌ను క్రమశిక్షణతో, సమన్వయంతో విజయవంతంగా నిర్వహించిన మోటోభారత్ వరంగల్ బృందాన్ని నిర్వాహకులు అభినందించారు.బైకర్ల బృందం ప్రదర్శించిన క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన రైడింగ్ విధానాలు కార్యక్రమ విజయానికి తోడ్పడ్డాయి. సుమారు 150 బైక్‌ల భాగస్వామ్యం రోడ్డు భద్రతపై బైకింగ్ కమ్యూనిటీకి ఉన్న నిబద్ధతను చాటిచెప్పింది. రోడ్డు భద్రత అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ కార్యక్రమం మరోసారి స్పష్టం చేసింది. ఇటువంటి అవగాహన కార్యక్రమాల ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడం, బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌ను ప్రోత్సహించడం, అత్యవసర సమయాల్లో సకాలంలో వైద్య సహాయం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడటమే లక్ష్యంగా మెడికవర్ హాస్పిటల్స్, వరంగల్ ముందుకు సాగుతోంది. ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, హెల్మెట్ ధరించాలని, నిర్లక్ష్యపు డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని, రోడ్డు ప్రమాదాల వల్ల సంభవించే ప్రాణనష్టాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రజలకు తెలియజేశారు.'

RNI NO. APBIL/2013/50718 LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy

లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక




## గీతంలో వ్యాపార ఆవిష్కరణ, సుస్థిర సమాజంపై అంతర్జాతీయ సదస్సు

-డిసెంబర్ 10-11 తేదీలలో బీఐఎస్ఎస్-2026 సదస్సు

-ప్రముఖ వక్తలుగా హయా అజ్జన్, డాక్టర్ అంగప్ప గుణశేఖరన్



**పఠాన్ చేరు, అక్టోబర్ 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, స్కూల్ ఆఫ్ బిజినెస్ కు చెందిన సెంటర్ ఫర్ బిజినెస్ గ్రోత్ (సీబీజీ) రెండవ అంతర్జాతీయ వ్యాపార ఆవిష్కరణ, సుస్థిర సమాజం సదస్సు (బీఐఎస్ఎస్-2026) ను డిసెంబర్ 10-11, 2026 తేదీలలో నిర్వహించనుంది. 'మానవ-యంత్ర అనుసంధానం ద్వారా వ్యాపార శ్రేష్ఠత: మానవ అంతర్దృష్టి, యంత్ర మేధస్సు' అనే ఇతివృత్తంతో జరిగే ఈ సదస్సులో ప్రముఖ విద్యావేత్తలు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు పాల్గొననున్నారు. అమెరికాలోని ఎలోన్ విశ్వవిద్యాలయం, మార్తా అండ్ స్పెన్సర్ లవ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్, మేనేజ్ మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్ ప్రొఫెసర్ హయా అజ్జన్, పెన్ స్టేట్ హారిస్ బర్గ్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ సప్లై చెయిన్ మేనేజ్ మెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అంగప్ప గుణశేఖరన్ కీలకోపన్యాసాలు చేయనున్నారు. ఈ సదస్సు బాధ్యతాయుత మైన కృత్రిమ మేధస్సు స్వీకరణ, ఆవిష్కరణ, ఉత్పాదకత, సుస్థిరత, సమ్మిళితత్వం, దీర్ఘకాలిక వ్యాపార వృద్ధిపై చర్చలకు ప్రపంచ వేదికగా నిలుస్తుంది. కీలకోపన్యాసాలు, పరిశోధనా పత్రాల సమర్పణలు, పోస్టర్ ప్రదర్శనలు, ప్యానెల్ చర్చలు, యూజీ, పీజీ విద్యార్థుల కోసం ప్రత్యేక వర్ధమాన పండితుల వేదిక ఉంటాయి. ఎంపిక చేసిన పత్రాలు ఐజేపీఎం, ఐజేపీఎంబీ వంటి స్కోపస్-ఇండెక్స్డ్ జర్నల్స్ లో ప్రచురణకు పరిగణించబడతాయి. ఉత్తమ పత్రాలకు పురస్కారాలు అందజేస్తారు. సదస్సును డాక్టర్ అజయ్ కుమార్, డాక్టర్ ఆర్.వీరబాబు నిర్వహిస్తున్నారు. వివరాలకు 88266 99667, 99665 78892 లేదా ఎఱంం2026ఏస్త్రఋఎ.అఅ ను సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

## పుల్లెంల పంచాయతీ కార్యదర్శి అంజయ్య రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరం

జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి లోకల్ గైడ్ :** చండూరు మండలం, పుల్లెంల పంచాయతీ కార్యదర్శి శ్రీపతి అంజయ్య రోడ్డు ప్రమాదంలో మరణించడం బాధాకరమని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అన్నారు. శనివారం విధులు ముగించుకుని నల్గొండకు వస్తున్న శ్రీపతి అంజయ్య ఎస్ఎల్ బిసి సమీపంలోని నల్గొండ మెడికల్ కళాశాల వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి వెళ్లి అంజయ్య పార్థివ దేహాన్ని సందర్శించారు. ప్రమాదానికి గల కారణాలను జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంజయ్య కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. జిల్లా కలెక్టర్ వెంట డిపిఒ, చండూర్ ఎంపీడీవో తదితరులు ఉన్నారు.

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ.

మహిళలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలి.

తెలంగాణ శాసనమండలి చైర్మన్‌గుత్తా సుఖేందర్ రెడ్డి



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ :** సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రజలకు, ముఖ్యంగా ఆడపడుచులందరికీ తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు, ఆడపడుచుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ మన రాష్ట్రానికి ప్రత్యేక గుర్తింపును తీసుకువచ్చిందని తెలిపారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజించే గొప్ప సంప్రదాయం తెలంగాణ బతుకమ్మ పండుగ ప్రత్యేకత అని పేర్కొన్నారు. తొమ్మిది రోజుల పాటు మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగ తెలంగాణ ప్రజల ఐక్యతకు, సోదరభావానికి నిదర్శనమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పండుగ ప్రజలను ఏకతాటిపైకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పిన ఘనత బతుకమ్మ పండుగకు దక్కుతుందని తెలిపారు. బతుకమ్మ పండుగ కేవలం ఒక వేడుక మాత్రమే కాదని, తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ప్రకృతితో మనకున్న అనుబంధానికి ప్రతీక అని పేర్కొన్నారు. మన పండుగలు, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. బతుకమ్మ పండుగ ద్వారా మహిళల మధ్య ప్రేమానురాగాలు, కుటుంబాల మధ్య అనుబంధాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో సుఖశాంతులు, సిరిసంపదలు వెల్లివిరియాలని, మహిళలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు.

## రాష్ట్ర ప్రజలందరికీ సద్దుల బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ :** పూలను దైవంగా భావించి పూజించే ఏకైక సంస్కృతి తెలంగాణ సొంతమని రాష్ట్ర రోడ్లు భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆత్మగౌరవానికి,సంస్కృతి వైభవానికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ మన అస్తిత్వానికి,మన తెలంగాణ జీవనశైలికి నిలువుటద్దం లాంటిదని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో పండుగలు ఉన్నప్పటికీ,రంగు రంగుల పూలను పేర్చి, గౌరమ్మను కొలిచే ఈ అద్భుతమైన వేడుక మన నేల గొప్పతనాన్ని ప్రపంచానికి చాటుతోందన్నారు. పూలను బతుకమ్మ రూపంలో పూజించడం ద్వారా మన పూర్వీకులు ప్రకృతితో మమేకమైన జీవన విధానాన్ని మనకు అందించారని, ఈ సాంప్రదాయాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, అష్టఐశ్వర్యాలతో వర్ధిల్లుతూ అంగరంగవైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు జరుపుకోవాలని మంత్రి ఆకాంక్షించారు.

## ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం...

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

రాష్ట్రంలో రూ. 2,500 కోట్లతో ఆలయాల అభివృద్ధి, గోదావరి పుష్కరాల పరివాహక ప్రాంతాల భక్తి క్షేత్రాలకు రూ. 2,000 కోట్లు

భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రూ. 276 కోట్లు, బాసర సరస్వతీ అమ్మవారి ఆలయానికి రూ. 354 కోట్లు మంజూరు

రూ. 90 వేల కోట్లతో రాష్ట్రవ్యాప్తంగా ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణం

రూ. 44 కోట్లతో ఎన్కూర్ నుండి నాచారం వరకు అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని అనుసంధానం చేస్తూ నిర్మిస్తున్న రోడ్డు అభివృద్ధికి భూమి పూజ చేసిన డిప్యూటీ సీఎం



**ఖమ్మం/ ఎన్కూరు, అక్టోబర్- 18: లోకల్ గైడ్ :** ఆలయాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర డిప్యూటీ సీఎం. ఆర్థిక, విద్యుత్, ప్రణాళికా శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం డిప్యూటీ సీఎం, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, సీపీ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ లతో కలిసి ఏన్కురు నుండి నాచారం వరకు బీటీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ, ఆపదమొక్కులవాడు, అడిగిన కోరికలు తీర్చే అద్భుత వెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి భవిష్యత్తులో లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున, వారి రవాణా సౌకర్యార్థం బీటీ రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. ఈ రహదారి నిర్మాణంతో భక్తుల రాకపోకలతో పాటు స్థానికంగా హోటళ్లు, వ్యాపారాలు పెరిగి ఆదాయ వనరులు పెంపొందుతాయని తెలిపారు. ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న ప్రముఖ దేవాలయాల అభివృద్ధికి దాదాపు రూ. 2,500 కోట్లు వెచ్చిస్తోందన్నారు. గోదావరి పుష్కరాల నాటికి నదీ పరివాహక ప్రాంతంలోని ఆలయాల అభివృద్ధి కోసం రూ. 2,000 కోట్లు ఖర్చు చేయనున్నామని అన్నారు. చారిత్రక భద్రాచల దేవస్థాన సమగ్ర అభివృద్ధికి రూ. 276 కోట్లు కేటాయించి నిధులు మంజూరు చేశామని, పిల్లల అక్షరాభ్యాస క్షేత్రమైన బాసర దేవాలయ అభివృద్ధికి రూ. 354 కోట్లు కేటాయించామన్నారు. తెలంగాణలో కోటి 15 లక్షల కుటుంబాలు వుండగా , అందులో కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు ప్రతి మనిషికి 6 కేజీల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వం అని డిప్యూటీ సీఎం అన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందిస్తున్నామన్నారు. రాష్ట్రంలో 71 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేస్తున్నామన్నారు. గృహ వినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తూ, 53 లక్షల కుటుంబాలకు కరెంట్ బిల్లుల భారం తగ్గించామని డిప్యూటీ సీఎం అన్నారు. డ్వాక్రా సంఘాలకు వడ్డీ లేని రుణాల పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచి, ఏటా రూ. 20 కోట్లు బ్యాంక్ లింకేజీ ద్వారా రుణాలు అందిస్తు, 5 సంవత్సరాల్లో లక్ష కోట్ల రూపాయల లక్ష్యంగా పెట్టుకున్నాం. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించామని, దీనికోసం ప్రభుత్వం ఇప్పటికే రూ. 10 వేల కోట్లు ఆర్టీసీకి చెల్లించిందన్నారు. ప్రతి ఇంటికి రూ. 5 లక్షల ఆర్థిక సాయంతో మొదటి విడతలో 4.5 లక్షల ఇళ్లు, రెండవ విడత తో మొత్తంగా 8 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాన్ని చేపడుతున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయం వేడివేడి అల్పాహారం ఇడ్లీ, పూరీ, ఉప్మా, పాలు/రాగి జావ అందిస్తున్నామన్నారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో పోటీపడేలా ప్రతి నియోజకవర్గానికి రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను నిర్మిస్తున్నామన్నారు. సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల వర్షభావ పరిస్థితులు ఏర్పడి భూగర్భ జలాలు తగ్గుముఖం పడుతున్నాయని, వచ్చే ఏడాది జూలై వరకు నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉన్నందున, ప్రజలు, రైతులు ప్రతి నీటి చుక్కను పొదుపుగా వాడుకోవాలని డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు. నీటి సంరక్షణపై గ్రామీణ ప్రాంతాల్లో కళా బృందాలు, అధికారుల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. వచ్చే నెల నవంబర్ 19న ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా తెలంగాణలో పుట్టిన ప్రతి కుటుంబానికి ధీమానిచ్చేలా ఇందిరమ్మ భీమా పథకం ను ప్రారంభించబోతున్నామని డిప్యూటీ సీఎం గారు అన్నారు. ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం శ్రమిస్తుందని, ప్రజలందరికీ దసరా, నవరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతున్నదని తెలిపారు. గత ప్రభుత్వం భారీగా అప్పులు మిగిల్చినప్పటికీ, కష్టకాలంలో కూడా ఆర్థిక సర్దుబాటు చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనేక హామీలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత కరెంట్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీ వంటి అనేక పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున పేద ప్రజలకు ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అందిస్తున్నామని తెలిపారు. త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఖమ్మం, వరంగల్, నల్గొండ పట్టభద్రులు నవంబర్ 6వ తేదీ లోపు తమ ఓట్లను విధిగా నమోదు చేసుకోవాలని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కంటే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేయడం జరుగుతోందని, ప్రజలంతా ఈ ప్రభుత్వాన్ని ఆదరించాలని ఎంపీ కోరారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, ప్రాంత అభివృద్ధిలో రహదారుల నిర్మాణం అత్యంత కీలకమని, రహదారులు మెరుగైతే అన్ని రకాల అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతాయని అన్నారు. మారుమూల గ్రామాల వరకు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ సునీల్ దత్ మాట్లాడుతూ, ఏ ప్రాంతంలోనైనా రోడ్డు వసతి మెరుగైతే అన్ని రకాల అభివృద్ధి పనులు వేగవంతమవుతాయన్నారు. ఇది పోలీసింగ్ సేవల నిర్వహణకు, శాంతిభద్రతల పరిరక్షణకు, బందోబస్తు చర్యలకు ఎంతో సహాయపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ, ప్రాంత ప్రజలందరికీ అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండాలని, పెద్దఎత్తున అభివృద్ధి చేయాలని జిల్లా వాసిగా, అన్ని విషయాలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడిగా ఈ ప్రాంత అభివృద్ధి కోసం డిప్యూటీ సీఎం కృషి చేస్తున్నారన్నారు. గుడికి రోడ్లు వేయాలని, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరగానే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా రూ. 43 కోట్లు మంజూరు చేసి, ఏన్కూరు నుంచి నాచారం మీదుగా వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు నిధులు కేటాయించిన ఘనత రాష్ట్ర ఉప ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. ఏన్కూరులో తెలంగాణ పబ్లిక్ స్కూల్, ఐటిఐ, గోడౌన్ల మంజూరుతో పాటు ఈ ప్రాంతానికి కావలసిన రోడ్లను కూడా ప్రభుత్వం మంజూరు చేసిందని ఎమ్మెల్యే తెలిపారు. నాచారం నుండి జూలూరుపాడు వరకు రోడ్డు మంజూరు చేయాలని, ఈ రోడ్డు నిర్మాణం ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఖమ్మం జిల్లాలోని దాదాపు 10 మండలాలకు లింక్ కలుగుతుందని, 7 నుండి 8 కిలోమీటర్ల మేర ఈ రోడ్డు ఎంతగానో ఉపయోగపడుతుందని, రోడ్డు మంజూరుకు డిప్యూటీ సీఎం కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాలకు రూ. 3.38 కోట్ల బ్యాంక్ లింకేజీ ఋణ చెక్కును డిప్యూటీ సీఎం అందజేశారు. అంతకుముందు డిప్యూటీ సీఎం అద్భుత వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, టీజీఎన్పిడిసీఎల్ డైరెక్టర్ మోహన్ రావు, సిఈ సురేందర్, ఎస్ఈ శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఈ యుగంధర్ రావు, పిఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, స్థానిక సర్పంచ్ అజ్మీరా సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు



## నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు.

మహిళల సాంస్కృతిక వైభవానికి ప్రతీక బతుకమ్మ .

జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ .



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి. లోకల్ గైడ్ :** నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆయన సతీమణి పూజా పవార్, పోలీస్ కుటుంబ సభ్యులు, మహిళా పోలీస్ సిబ్బంది, ఇతర అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. రంగురంగుల పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ మహిళలు సంప్రదాయబద్ధంగా ఆడిపాడుతూ పండుగ సందడిని నింపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ, పూలను పూజిస్తూ, మహిళల ఐక్యతను చాటిచెప్పే గొప్ప పండుగ బతుకమ్మ అని తెలిపారు. తరతరాలుగా వస్తున్న తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని భావితరాలకు అందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఐక్యతను, ఆత్మీయతను, సోదరభావాన్ని పెంపొందిస్తుందని, కుటుంబ సభ్యులందరినీ ఒకచోట చేర్చి ఆనందాన్ని పంచుతుందని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, ప్రకృతిని పూజించడం మన తెలంగాణ సంప్రదాయంలోని విశిష్టత అని వివరించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, ఆచారాలను కాపాడుకుంటూ భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పోలీసు శాఖలో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ప్రజల భద్రత కోసం నిరంతరం శ్రమిస్తూ, అనేక సందర్భాల్లో పండుగలు, కుటుంబ వేడుకలకు దూరంగా ఉండాల్సి వస్తుందని తెలిపారు. పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యుల త్యాగాలు, సహకారం ఎంతో విలువైనవని, వారి మద్దతుతోనే పోలీసులు మరింత అంకితభావంతో విధులు నిర్వహించగలుగుతున్నారని అన్నారు. పోలీసు కుటుంబ సభ్యులందరూ ఇలాంటి వేడుకల్లో కలిసిమెలిసి పాల్గొనడం ద్వారా పరస్పర ఆత్మీయత, ఐక్యత మరింత బలపడతాయని పేర్కొన్నారు. పండుగలు మన జీవితాల్లో సంతోషాన్ని నింపడమే కాకుండా, మన సంస్కృతి పట్ల గౌరవాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగుతూ, సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలందరికీ బతుకమ్మ పండుగ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలని జిల్లా ఎస్పీ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ బతుకమ్మ సంబరాలల్లో అడిషనల్ ఎస్పి రమేష్, ఎస్పి డిఎస్పీ మల్లా రెడ్డి, ఉమెన్ పోలీస్ స్టేషన్ సీఐ మంజుల,మహిళా ఎస్.ఐలు శ్రావణి, అఫ్రీన్, మమత,సీఐ నాగరాజు, ఆర్. ఐ లు సంతోష్, సూరపు నాయుడు, కళ్యాణ్ రాజ్,మహిళా సిబ్బంది,పోలీసు కుటుంబ సభ్యుల మధ్య ఆనందోత్సాహాలను నింపగా, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటిచెప్పాయి. సంప్రదాయబద్ధమైన పాటలు, ఆటలతో వేడుకలు ఉత్సాహంగా సాగాయి.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సారయ్య కి అస్వస్థత



హనుమకొండ జిల్లా ప్రతినిధి, అక్టోబర్18(లోకల్ గైడ్ న్యూస్) : మాజీ కార్పొరేటర్ తూర్పటి సులోచన భర్త, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సారయ్య గుండెపోటుకు గురయ్యారు. ప్రస్తుతం ఆయన హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుస్తున్న వర్ధన్నపేట ఎమ్మెల్యే, కేఆర్ నాగరాజు హైదరాబాదు నుండి వెంటనే వచ్చి హన్మకొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు కేఆర్ దిలీప్ రాజ్ తో కలిసి ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. సారయ్య ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న ఎమ్మెల్యే వైద్యులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి సాధారణ జీవితాన్ని కొనసాగించాలని మనసారా కోరుకున్నారు. వారి వెంట రాష్ట్ర లీగల్ సెల్ వైస్ చైర్మన్ నిమ్మాని శేఖర్ రావు, డివిజన్ అధ్యక్షులు సయ్యద్ ఇంతియాజ్, జిల్లా ఎస్సీ సెల్ చైర్మెన్ సిలువేరు శ్రీనివాస్, స్టాలిన్,శంకర్, రవి, కుమార్ రాజేష్,మహేష్, సుధీర్, జానీ, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పూలను పూజించే తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ

తెలంగాణ ఆడబిడ్డలందరికీ సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు

-టిపిసిసి ఉపాధ్యక్షులు..గాలి అనిల్ కుమార్




**పఠాన్ చేరు, అక్టోబర్ 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** పూలను పూజించి, ప్రకృతిని ఆరాధించి, పసుపు ముద్దను గౌరమ్మగా భావించి నిండు మనస్సుతో కొలిచే నిండైన వేడుక మన బతుకమ్మ పండుగ అని టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ అన్నారు. సద్దుల బతుకమ్మ పండుగ సందర్భంగా ఆయన తెలంగాణ ఆడబిడ్డలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆత్మగౌరవానికి, సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. తొమ్మిది రోజుల పాటు ఆడబిడ్డలు ఎంతో భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో బతుకమ్మను పేర్చి, పాటలు పాడుతూ జరుపుకునే వేడుక ప్రపంచంలోనే ప్రత్యేకమైనదని కొనియాడారు. ప్రకృతిలో లభించే రకరకాల పూలతో బతుకమ్మను అందంగా పేర్చి, గౌరమ్మను ఆరాధించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలనే సందేశం ఈ పండుగలో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగకు ప్రపంచ స్థాయి గుర్తింపు వచ్చిందని, ప్రభుత్వం అధికారిక పండుగగా నిర్వహిస్తుండడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ సద్దుల బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రజలందరి జీవితాలలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు తీసుకురావాలని, ఆడబిడ్డలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆ గౌరమ్మను కోరుకుంటున్నట్లు గాలి అనిల్ కుమార్ తెలిపారు.

# శుభం సువర్ణ మహోత్సవ్ లో బంపర్ ఆఫర్లు.. బంగారం కొంటే అంతే బరువు వెండి ఫ్రీ

-రోజూ10 వేల వరకు బహుమతులు..ఆఫర్ 20 అక్టోబర్ వరకే




**శేరిలింగంపల్లి, అక్టోబర్ 18 (లోకల్ గైడ్ ప్రతినిధి కృష్ణ):** తారానగర్ శుభం జ్యువెలర్స్ లో శుభం సువర్ణ మహోత్సవ్ పేరుతో గోల్డెన్ ఆఫర్లు ప్రకటించింది యాజమాన్యం. ఈ మహోత్సవ్ లో భాగంగా బంగారం కొనుగోలు చేసే వినియోగదారులకు అదిరిపోయే ఆఫర్ అందిస్తున్నారు. ఎంత బరువు బంగారం కొంటే అంతే బరువు వెండిని పూర్తిగా ఉచితంగా ఇవ్వనున్నారు. అలాగే వెండి కొనుగోలుపై ప్రతి రూ.4వేల కొనుగోలుపై రూ.100 తగ్గింపు లభిస్తుంది. దీంతో పాటు ప్రతిరోజూ రూ.10వేల వరకు విలువ చేసే అద్భుతమైన బహుమతులు గెలుచుకునే అవకాశం కూడా ఉంది. "నేటి బంగారం, వెండి ధరలు" 24 క్యారెట్ల స్వచ్ఛమైన బంగారం - గ్రాముకు రూ.14,609 22 క్యారెట్ల (91.6) బంగారం - గ్రాముకు రూ.13,53092.5 వెండి – గ్రాముకు రూ.215 ఈ బంగారు అవకాశాన్ని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. ఈ ఆఫర్ 2026 అక్టోబర్ 20 వరకు మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం ఈ ఫోన్ నెంబర్ లను సంప్రదించండి: 04023033820, 7569304604, 9390100584, 9100600600. షోరూమ్ చిరునామా: https://maps.app.goo.gl/s1TLKAnwTrT7CH5u9

# హిందూ విరాట్ యూత్ దుర్గామాత మండపం వద్ద కుంకుమార్చన



**లోకల్ గైడ్( 18అక్టోబర్ కామారెడ్డి ప్రతినిధి ) :** కామారెడ్డి జిల్లా సదాశివ నగర్ మండలం భూంపల్లి గ్రామంలో హిందూ విరాట్ యూత్ ఆధ్వర్యంలో దుర్గ మాత మండపం వద్ద కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. దుర్గాదేవి నవరాత్రులల్లో మహిళలు కుంకుమార్చన ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా వేద పురోహితుడు ప్రభు మాట్లాడుతూ ప్రతిరోజు హిందూవిరాట్ యూత్ ఆధ్వర్యంలో ఉదయం సాయంత్రం. ప్రత్యేక పూజలతో పాటు మాలాదారులు . కంకణదారులతో ప్రత్యేక గణపతి పూజ. నవగ్రహ పూజ. పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్నారు ఇందులో భాగంగా కౌమారీ పూజలు. ప్రత్యేక దీపాలంకరణ. శ్రీ లక్ష్మీ సమేత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలతో పాటు కుంకుమ పూజ కార్యక్రమం నిర్వహించారు మంగళ హారతి. మహా నైవేద్యం అన్నప్రసాద వితరణ చేశారు పిల్లాపాపలను పాడిపంటలు చల్లగా చూడమ్మా అంటూ దుర్గమ్మ తల్లిని వేడుకున్నారు. గైని పద్మ. గైని లావణ్య. సుంకరి నవనిత. గైని రంజిత. సుంకరి రాజమణి. గైని వనమాల. సుంకరి సప్న గైని అనసూయ. సుంకరి సాయవ్వ. గైని అమల సుంకరి సుగుణ గైని రసజ్ఞ సుంకరి రాణి. గైని లావణ్య. సుంకరి లక్ష్మి.మేకల సువాసిని. సుంకరి గౌతమి. గైని శాంత. తదితరులు పాల్గొన్నారు

# దాచారం ఈదులకంటిపల్లె 5వ వార్డులో ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ..**

**ఆటపాటలతో సందడి చేసిన మహిళలు**



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 18 (లోకల్ గైడ్ ప్రతినిధి) :** దాచారం: రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలం దాచారం గ్రామంలోని ఈదులకంటిపల్లె 5వ వార్డులో సద్దుల బతుకమ్మ ఉత్సవాలను మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, ఒకచోట చేర్చి ఉత్సవాలను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి, అందంగా అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి ఆటపాటలతో సందడి చేశారు. తెలంగాణ జానపద గీతాలను ఆలపిస్తూ, కోలాటాలు ఆడుతూ పండుగ సంబరాల్లో మునిగిపోయారు. వివిధ రకాల పూలతో పేర్చిన బతుకమ్మలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చిన్నారులు సైతం ఈ వేడుకల్లో పాల్గొని ఆనందోత్సాహాలతో గడిపారు. గ్రామంలోని మహిళలంతా ఒకచోట చేరి బతుకమ్మ సంబరాలు జరుపుకోవడంతో వార్డులో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ దివ్యాంగుల ఫోరం రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ మారవేణి చంద్రశేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, సంస్కృతి సంప్రదాయాల వైభవానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే వివిధ రకాల పూలను పూజిస్తూ ప్రకృతిని ఆరాధించడం ఈ పండుగ ప్రత్యేకత అని తెలిపారు. బతుకమ్మ వేడుకలు మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు, తెలంగాణ సంప్రదాయాలను భావితరాలకు పరిచయం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి పండుగలను సంప్రదాయబద్ధంగా నిర్వహించడం ద్వారా మన సంస్కృతి, వారసత్వాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. సద్దుల బతుకమ్మ వేడుకలు గ్రామంలో సంతోషం, ఐకమత్యం, ఆధ్యాత్మిక భావనలనుపెంపొందించాయనితెలిపారు.ఈదులకంటిపల్లె 5వ వార్డులో నిర్వహించిన సద్దుల బతుకమ్మ ఉత్సవాలు మహిళల ఆటపాటలు, పూల బతుకమ్మల అందాలతో పండుగ శోభను సంతరించుకున్నాయి. తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా వేడుకలు ఘనంగా జరిగాయి.--- మారవేణి చంద్రశేఖర్ యాదవ్ వర్కింగ్ ప్రెసిడెంట్, విశ్వవిద్యాలయ దివ్యాంగుల ఫోరం

# చింతల్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ, దాండియా వేడుకలు

**తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ప్రాధాన్యం.. ఆటపాటలతో సందడి చేసిన మహిళలు**



**కుత్బుల్లాపూర్ అక్టోబర్ 18 (లోకల్ గైడ్ ప్రతినిధి) :** చింతల్ పద్మశాలి సంఘం (రిజి. నం. 16/2016) ఆధ్వర్యంలో బతుకమ్మ, దాండియా వేడుకలను శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. సాయిబాబా నగర్, రోడ్ నంబర్ 3, పద్మనగర్ ఫేజ్-2లోని శివకుమార్ ఇంటి సమీపంలో జరిగిన ఈ వేడుకల్లో సంఘ సభ్యులు, మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని నిర్వహించిన ఈ కార్యక్రమం సందడిగా సాగింది.ఈ సందర్భంగా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, వాటి చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆటపాటలతో సందడి చేశారు. అనంతరం డీజే సంగీతం మధ్య దాండియా నృత్యాలు చేస్తూ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి సంఘ సభ్యులు పాల్గొనడంతో కార్యక్రమ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు పద్మశాలి సమాజంలో ఐక్యతను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ వేడుకలను నిర్వహించినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలు సభ్యుల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడంతో పాటు మహిళలు తమ సంప్రదాయాలను ఆనందంగా జరుపుకునేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.వేడుకలకు హాజరైన వారికి నిర్వాహకుల ఆధ్వర్యంలో అల్పాహారం, శీతల పానీయాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన సంఘ సభ్యులకు, సహకరించిన ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతల్ పద్మశాలి సంఘం గౌరవ అధ్యక్షుడు పి. సత్యనారాయణ, అధ్యక్షుడు ఎస్. ఆంజనేయులు, ఖజానాదారు ఎన్. గణేష్, ప్రధాన కార్యదర్శి సంతోష్‌తో పాటు సంఘ సభ్యులు, మహిళలు, యువతులు, కాలనీవాసులు పాల్గొన్నారు. సమగ్ర వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా ముగిశాయి.

# దసరా ఉత్సవాల కమిటీ కరపత్రం విడుదల

**అదిలాబాద్ లోకల్ గైడ్ :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో స్థానిక జిల్లా కలెక్టర్ క్యాంప్ ఆఫీసు నందు దుర్గా దేవి నవరాత్రుల సందర్భంగా అష్టమి తిథి ననుసరించి సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 20 వ తేదీన కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించబోయే దసరా పండుగ కరపత్రాలను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వేద పండితులు ఉప్పల సంతోష్ శర్మ వేద పఠనము మధ్యన విడుదల చేయడం జరిగింది ఈ కార్యక్రమం నందు సమితి అధ్యక్షులు వారికి అమ్మవారి చండీ యాగ ప్రసాదాన్ని అందించడం జరిగింది ఈ కార్యక్రమంలో సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షు, ప్రధాన కార్యదర్శులు ప్రమోద్ కుమార్ ఖత్రి, రేణికుంట రవీందర్, గౌరవ అధ్యక్షులు కందుల రవీందర్ మహిపాల్, ఊరాడే సుభాష్, విజయ్, రాజు తదితరులు పాల్గొన్నారు

# కంచర్ల జెన్నారెడ్డిని పరామర్శించిన తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి.



**నల్లగొండ ఉమ్మడి జిల్లా ప్రతినిధి . లోకల్ గైడ్ :** ఉరుమడ్ల గ్రామానికి చెందిన తన స్నేహితుడు, బంధువు కంచర్ల జెన్నారెడ్డి ని తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నేడు వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఇటీవల గుండె సంబంధిత సమస్యతో చికిత్స పొందిన కంచర్ల జెన్నారెడ్డి కి వైద్యులు హార్ట్ స్టెంట్ అమర్చిన విషయం తెలుసుకున్న గుత్తా సుఖేందర్ రెడ్డి స్వయంగా వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జెన్నారెడ్డి తో ఆప్యాయంగా మాట్లాడి, ఆయన ఆరోగ్య పరిస్థితి, చికిత్స అనంతరం తీసుకుంటున్న జాగ్రత్తల గురించి ఆరా తీశారు.

# అర్హులకు పెన్షన్లు వెంటనే ఇవ్వాలి!

**ఎన్నికల హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం: సీపీఎం నేత నాగేశ్వరరావు**



**కారేపల్లి, అక్టోబర్ 18 (లోకల్ గైడ్ న్యూస్):** చేయూత పథకం కింద అర్హులుగా గుర్తించిన వృద్ధులు, వితంతువులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు కొత్త పెన్షన్లు వెంటనే మంజూరు చేసి, ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం కారేపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుపై ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. కొత్త పెన్షన్ల కోసం పలుమార్లు దరఖాస్తులు స్వీకరించి, సర్వేలు నిర్వహించి అర్హులను గుర్తించినప్పటికీ మంజూరు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. ఆగస్టు 15 నాటికి పెన్షన్లు ఇస్తామని ప్రకటించి, అనంతరం దసరా వరకు వాయిదా వేసినా ఇప్పటికీ లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల హామీ మేరకు వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు నెలకు రూ.4,000, వికలాంగులకు రూ.6,000 పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. అర్హులుగా ఎంపికైన వారందరికీ వెంటనే పెన్షన్లు మంజూరు చేసి ఆర్థిక చేయూత అందించాలని కోరారు. అలాగే ఇందిరమ్మ ఇళ్లు, కల్యాణలక్ష్మి పథకం కింద తులం బంగారం, భూమిలేని పేదలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఏడాదికి రూ.12,000, మహిళలకు నెలకు రూ.2,500 అందించే హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం ద్వారా ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కొండబోయిన నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

# దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి

**బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి,**

**మాజీ ఉపసర్పంచ్ నీరుడు శేఖర్ ముదిరాజ్**



**గండిపేట, అక్టోబర్ 18 (లోకల్ గైడ్):** దుర్గామాత అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. ఆదివారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని కిస్మత్‌పూర్ 122వ డివిజన్‌లో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలను ఆయన, కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. అనంతరం వివిధ మండపాల్లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. దసరా నవరాత్రుల సందర్భంగా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని పెంపొందించడంతో పాటు ఐక్యతను బలోపేతం చేస్తాయని వారు పేర్కొన్నారు. దుర్గామాత ఆశీస్సులతో కిస్మత్‌పూర్ 122వ డివిజన్‌తో పాటు బండ్లగూడ జాగీర్ ప్రాంత ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మహేష్ యాదవ్, శేఖర్ ముదిరాజ్, గోపి గౌడ్, పవన్ సాయి, గణేష్, హర్షవర్ధన్ రెడ్డి, సందీప్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న**

**బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**

**పురాతన రహదారి పునరుద్ధరణతో ఆలయ స్థలానికి**

**ఇబ్బంది కలగకుండా చూడాలి: కమిటీ సభ్యుల వినతి**

**ఆలయానికి ఎకరం భూమి కేటాయింపునకు కృషి చేస్తా: కార్తీక్ రెడ్డి హామీ**



**రాజేంద్రనగర్, అక్టోబర్ 18 లోకల్ గైడ్ :** శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సుభిక్షంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆకాంక్షించారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ ఆలయంలో ప్రధాన అర్చకులు తాళ్లపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు కార్తీక్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించారు.

"ఆలయ అభివృద్ధికి సహకరిస్తా"

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, భవిష్యత్తులో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై కార్తీక్ రెడ్డి ఆలయ కమిటీ సభ్యులతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

"పురాతన రహదారి పనులతో ఆలయ స్థలంపై ఆందోళన...

బుద్వేల్ నుంచి రాజేంద్రనగర్ వరకు ఉన్న పురాతన రహదారి పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఆలయ స్థలంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రహదారి పనుల వల్ల ఆలయ ప్రాంగణంలోని స్థలం కోల్పోయే అవకాశం ఉందని ఆలయ కమిటీ సభ్యులు కార్తీక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దేవాలయానికి ఎలాంటి నష్టం కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా సంబంధిత వర్సిటీ అధికారులతో చర్చించి ఆలయానికి ఒక ఎకరం భూమి కేటాయించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

"ఎకరం భూమి కేటాయింపునకు కృషి చేస్తా!

ఆలయ కమిటీ సభ్యుల విజ్ఞప్తిపై స్పందించిన కార్తీక్ రెడ్డి, సంబంధిత వర్సిటీ అధికారులతో మాట్లాడి ఆలయానికి ఒక ఎకరం భూమి కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# ఘనంగా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు.

నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న బిజెపి నాయకులు అందెల శ్రీరాములు.





**మహేశ్వరం, ( లోకల్ గైడ్) :** మహేశ్వరం నియోజకవర్గం లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఎంతో ఘనంగా జరుగుతున్నాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా జల్‌పల్లి జై భవానీ యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు శనివారం బిజెపి అందెల శ్రీరాములు, మౌనిక సుంకర జల్‌పల్లిలో దుర్గా మాతను ప్రత్యేక పూజ వారు పాల్గొని ఆ జగన్మాత ఆశీర్వాదం తీసుకన్నారు. ఈ సందర్భంగా మౌనిక సుంకర మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాలు ప్రతి సారి ఘనంగా నిర్వహిస్తున్న జై భవాని సభ్యులను ఎంతగాన్నో అభినందించారు. ఇలాంటి నవరాత్రి ఉత్సవాల ద్వారా యువతకు ధర్మంపైన భక్తి, అవాహన, క్రమశిక్షణ అలవడుతుందన్నారు. అక్కడికి వచ్చిన యువతకు ధర్మబోధ చేశారు.ఈ కార్యక్రమంలో జల్‌పల్లి జైభవాని యూత్ సభ్యులు విశ్వనాధ్, జామ రాజు, వై. శివకుమార్, శ్రీనివాస్ , గౌరిగె శ్రీకాంత్, శ్రీకాంత్ గాడ్, శివ గౌడ్, నాగరాజ్ ,కార్తీక్ మరియు అధిక సంఖ్యలో గ్రామ మహిళ లు, యువత పాల్గొన్నారు.

# జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించడం జరిగింది





**లోకల్ గైడ్( 18అక్టోబర్ కామారెడ్డి ప్రతినిధి ) :** కామారెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఐ=ణూ, వైద్య మరియు ఆరోగ్య శాఖ, ట్రెజరీ శాఖలు బతుకమ్మలు పెద్ద ఎత్తున తీసుకొచ్చి మహిళలు బతుకమ్మ ఆడడం జరిగింది. ×ఎజూ మహిళా సమాఖ్య సభ్యులు కూడా పెద్ద ఎత్తున బతుకమ్మలు ఆకర్షియంగా తయారు చేసి బతుకమ్మ ఆడడం అయినది. జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు ఈ నెల 14 నుండి 18 అక్టోబర్ వరకు 4 రోజుల పాటు వివిధ శాఖల మహిళ ఉద్యోగులు ప్రతి రోజు కలెక్టర్ కార్యాలయంలో బతుకమ్మ ఆడడం జరిగింది. 15 అక్టోబర్ తేదీన లింగంపేట మండలంలోని నాగన్న బావి వద్ద కూడా జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు పెద్ద ఎత్తున బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించడం అయినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ శ్రీ ఆశిష్ సాంగ్వన్ గారు హాజరు కాగా అదన కలెక్టర్ శ్రీ గిరి గారు ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ రవి తేజ గారు టూరిజం స్పోర్ట్స్ అధికారి వెంకట్ గౌడ్ గారు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్ గారు డి ఆర్ డి ఓ దామోదర్ అదనపు డిఆర్డిఓ విజయలక్ష్మి గారు పాల్గొనడం అయినది. గత నాలుగు రోజులుగా శాఖల వారీగా ప్రదర్శించిన బతుకమ్మలలో ఉత్తమ బతుకమ్మలు గుర్తించి జిల్లా కలెక్టర్ గారి ద్వారా ప్రతిభ పురస్కారాలు అందజేయడం అయినది. మొదటి బహుమతి ట్రెజరీ శాఖకు అందజేయడం జరిగింది రెండవ బహుమతి ఎస్సీ ఎస్టీ బీసీ వెల్ఫేర్ శాఖకులకు మూడో బహుమతి మెప్మా వారికి మరియు కన్సోలేషన్ బహుమతులు జిల్లా పంచాయతీ కార్యాలయము మరియు డిఆర్డిఏ వారికి అందజేయడం జరిగింది. మండల సమాఖ్యలు ప్రదర్శించిన పథకంలో ఉత్తమ బతుకమ్మ ప్రదర్శనగా బిక్నూర్ మండల సమైక్యవారికి మొదటి బహుమతి దోమకొండ మండల సమైక్యవారికి రెండవ బహుమతి బీబీపేట మండల సమైక్య వారికి మూడో బహుమతి ప్రధానం చేయడమైనది. తాడువాయి, రాజంపేట, కామారెడ్డి, సదాశివనగర్, గాంధారి, మాచారెడ్డి, రామారెడ్డి మండలాల నుండి బతుకమ్మ లు తీసుకొని వచ్చి మహిళా సమాఖ్య సభ్యులు ఉత్సాహంగా పాల్గొనడం అయినది. శ్రీనిధి శాఖ నుండి ఉద్యోగులు కూడా ఉత్సాహంగా బతుకమ్మ ను తయారుచేసి పాల్గొనడం అయినది.

# అమ్మవారి ఆశీస్సులతో ప్రజలంతా సుభిక్షంగా ఉండాలి

**కట్టమైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న**

**బిఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ పట్లోళ్ల కార్తీక్ రెడ్డి**

**పురాతన రహదారి పునరుద్ధరణతో ఆలయ స్థలానికి ఇబ్బంది కలగకుండా చూడాలి: కమిటీ సభ్యుల వినతి.**

**ఎకరం భూమి కేటాయింపునకు కృషి చేస్తానని కార్తీక్ రెడ్డి హామీ.**





**రాజేంద్రనగర్, ( లోకల్ గైడ్ ):** శ్రీమహాలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో సుభిక్షంగా ఉండాలని బీఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి పట్లోళ్ల కార్తీక్ రెడ్డి ఆకాంక్షించారు. బుద్వేల్ టీచర్స్ కాలనీలోని శ్రీశ్రీశ్రీ కట్టమైసమ్మ ఆలయంలో ప్రధాన అర్చకులు తాళ్ళపాక సత్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో వైభవోపేతంగా జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు కార్తీక్ రెడ్డి అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించారు.

ఆలయ అభివృద్ధికి సహకరిస్తా.

ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి,భవిష్యత్తులో భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై కార్తీక్ రెడ్డి ఆలయ కమిటీ ప్రతినిధులతో చర్చించారు. ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు.ఆలయాల అభివృద్ధికి మరింత ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పురాతన రహదారి పనులతో ఆలయ స్థలంపై ఆందోళన. బుద్వేల్ నుంచి రాజేంద్రనగర్ వరకు ఉన్న పురాతన రహదారి పునరుద్ధరణకు అధికారులు చర్యలు చేపడుతున్న నేపథ్యంలో ఆలయ స్థలం అంశం తెరపైకి వచ్చింది.రహదారి పనులు ఆలయ ప్రాంగణం మీదుగా జరిగితే దేవాలయానికి సంబంధించిన స్థలం కోల్పోవాల్సి వస్తుందని ఆలయ కమిటీ సభ్యులు కార్తీక్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.ఆలయానికి నష్టం కలగకుండా చూడటంతో పాటు,వర్సిటీ అధికారులతో మాట్లాడి దేవాలయానికి ఒక ఎకరం భూమి కేటాయించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు.

ఎకరం భూమి కేటాయింపునకు కృషి చేస్తా.

కమిటీ సభ్యుల విజ్ఞప్తిపై స్పందించిన కార్తీక్ రెడ్డి. సంబంధిత వర్సిటీ అధికారులతో చర్చించి ఆలయానికి ఒక ఎకరం భూమి కేటాయించేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఆలయ కమిటీ సభ్యులు,బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఎం.వి.ఎం. క్రికెట్ టీమ్ కు జెర్సీలు అందజేసిన లయన్ రవికుమార్ గౌడ్



**నారాయణపేట అక్టోబర్ 18:నారాయణపేట :** ఎం.వి.ఎం. క్రికెట్ టీమ్, బాపునగర్ కు క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా క్రీడా దుస్తులు జెర్సీ లనుఆదివారం లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణపేట 320గా అధ్యక్షులు, వారియ ర్స్ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ లయన్ రవికుమార్ గౌడ్ అందజేశారు.లయన్ రవికుమార్ గౌడ్ గతంలో కూడా ఎంతోమంది క్రీడాకారులను ప్రోత్సహించ దంతో పాటు, అనేక సేవా కార్యక్రమాల్లో ముందుండి తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నా రు. వివిధ గ్రామాల్లో క్రీడాకా రులకు క్రీడా దుస్తులు అందించడం, బోర్ల ఏర్పా టుకు సహకరించడం, దేవా లయాలకు విరాళాలు అందించడం వంటి అనేక కార్యక్రమాల ద్వారా సమాజ సేవలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదిం చుకున్నారు.క్రీడాకారులను ప్రోత్సహిస్తూ, యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తూ, అవసరమైన వారికి అండగా నిలుస్తున్న లయ న్ రవికుమార్ గౌడ్ సేవా భావం ఎంతో అభినంద నీయం ఆయన అందిస్తున్న సహాయ సహకారాలు మరెందరికో స్ఫూర్తిదాయ కం అని లయన్ రవికు మార్ గౌడ్ కు జట్టు సభ్యులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# ఫోన్ చూస్తే అంత ప్రమాదమా?



మా పాప వయసు ఒక సంవత్సరం. ఆరోగ్యంగా ఉంది. వ్యాక్సిన్ వేయించడానికి హాస్పిటల్‌కి వెళ్లినప్పుడు పిల్లలకు ఫోన్ ఇవ్వడం, టీవీ చూపించడం చేయొద్దని పీడియాట్రీషియన్ చెప్పారు. మా పాప ఇప్పుడిప్పుడే ఫోన్ చూస్తున్నది. ఫోన్ చూస్తే మరీ అంత ప్రమాదమా? దయచేసి సలహా ఇవ్వగలరు? ఇది మంచి ప్రశ్న. ఒకటి నుంచి మూడు సంవత్సరాల వయసులోపు పిల్లల్లో భాష బాగా అభివృద్ధి చెందుతుంది. చుట్టుపక్కల వాళ్లు మాట్లాడే మాటలు వింటూ పిల్లలు భాషను నేర్చుకుంటారు. పిల్లలు ఎన్నిసార్లు మాట్లాడటానికి ఎక్స్‌పోజ్ అయితే అంత మంచిది. దురదృష్టవశాత్తు ఈ తరం పిల్లలు వాళ్ల వయసు ఉన్న చిన్నారులతో కలిసి ఉండే సమయం తగ్గిపోతున్నది. ఫోన్, టీవీకి పరిమితమయ్యే పిల్లల్లో అర్థం చేసుకునే శక్తి తగ్గుపోతుంది. విన్న మాటలను ఏ సందర్భంలో ఎలా మాట్లాడాలన్నా గ్రహింపు శక్తిని కోల్పోతారు. సామాజిక అవగాహన పొందలేరు. అందువల్ల పిల్లల ప్రవర్తనలో విపరీత ధోరణి పెరుగుతుంది. కొందరిలో ఇది ఆటిజానికి దారితీయొచ్చు. మీ పీడియాట్రీషియన్ హెచ్చరించినట్టు.. దయచేసి పిల్లలకు ఫోన్, టీవీ అలవాటు చేయకండి. అది వ్యసనంగా మారుతుంది. చుట్టుపక్కల ఉన్న మనుషులతో మాట్లాడుతూ మాటలు నేర్చుకోవడానికి దూరమవుతారు. కాబట్టి, ఒకటి నుంచి మూడు సంవత్సరాల లోపు పిల్లలు శారీరకంగా, మానసికంగా, సాంఘికంగా ఎదిగేటువంటి ప్రత్యేకమైన స్థితిలో ఉండాలి. వాళ్లు నడవడం, పరుగెత్తడం చేయాలి. సమాజంలో అందరినీ పరిశీలిస్తూ ఉండాలి. ఇతరుల మాటలు, భాషను వినడం వల్ల సమాజాన్ని అర్థం చేసుకుంటారు. ఫోన్, ట్యాబ్, టీవీకి అలవాటైతే అలాంటి అవకాశాన్ని కోల్పోతారు. కాబట్టి వైద్యులు చెప్పిన సలహా పాటించండి. మీకు తెలిసిన వాళ్లకు చెప్పండి. టీవీ, ఫోన్ చూడొద్దని చెప్పి, మీరు చూస్తూ ఉంటే.. పిల్లలు మీ మాటలు అంగీకరించరు, ఆచరించరు. కాబట్టి పెద్దలు కూడా స్వీయ నియంత్రణ పాటించాలి.

# బ్యాక్టీరియా, వైరస్ ఇన్‌ఫెక్షన్లకు పనిచేసే సహజసిద్ధమైన పదార్థాలు.. రోజూ తీసుకుంటే ఎంతో మేలు..



బ్యాక్టీరియా లేదా వైరస్ ఇన్‌ఫెక్షన్లు వచ్చినప్పుడు మనకు భిన్న రకాల రోగాలు వస్తాయి. చాలా మందికి ఈ ఇన్‌ఫెక్షన్లతో ముందుగా జ్వరం వస్తుంది. అది తీవ్రతరం అయ్యాక మనం చికిత్స తీసుకుంటాం. డాక్టర్లు మనకు బ్యాక్టీరియా అయితే యాంటీ బయాటిక్స్, వైరస్ ఇన్‌ఫెక్షన్ అయితే యాంటీ వైరల్ మందులను ఇస్తారు. దీని వల్ల ఇన్‌ఫెక్షన్ తగ్గిపోతుంది. సూక్ష్మ క్రిములను తట్టుకునే శక్తి మనకు లభిస్తుంది. అయితే ఈ ఇన్‌ఫెక్షన్లు వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కానీ ఇన్‌ఫెక్షన్ ఏదైనా సరే మన ఇంట్లోనే ఉండే కొన్ని పదార్థాలు సహజసిద్ధమైన యాంటీ బయాటిక్స్, యాంటీ వైరల్ మందులుగా పనిచేస్తాయి. కనుక ఇన్‌ఫెక్షన్ వచ్చిన వారు డాక్టర్ ఇచ్చిన మందులతోపాటు ఆయా పదార్థాలను తీసుకోవాలి. దీని వల్ల ఇన్‌ఫెక్షన్ నుంచి త్వరగా బయట పడవచ్చు. జ్వరం కూడా త్వరగా తగ్గిపోతుంది. రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారు.

**అల్లం..**

అల్లాన్ని మనం తరచూ వంటల్లో వేస్తుంటాం. దీని వల్ల వంటకాలకు చక్కని రుచి, వాసన వస్తాయి. అయితే అల్లం సహజసిద్ధమైన యాంటీ బయాటిక్, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. అలాగే ఇందులో యాంటీ ఇన్ ఫ్లామేటరీ గుణాలు కూడా ఉంటాయి. కనుక ఇది ఒక్కటే అనేక ఇన్‌ఫెక్షన్లకు మందుగా పనిచేస్తుంది. అల్లంలో జింజరాల్, టర్పెనాయిడ్స్, షోగోల్స్, జెరుమ్‌బోన్, జింజరోన్ అనే సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. అలాగే శక్తివంతమైన ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ఇవన్నీ ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తాయి. బ్యాక్టీరియా, వైరస్‌లపై పోరాటం చేస్తాయి. కనుక అల్లం రసంను రోజూ తీసుకుంటే ఎంతగానో ఫలితం ఉంటుంది. దీన్ని రోజుకు 2 సార్లు భోజనానికి ముందు ఒక టీస్పూన్ మోతాదులో తాగాలి. దీని వల్ల అన్ని రకాల ఇన్‌ఫెక్షన్లు తగ్గిపోతాయి. ముఖ్యంగా బ్యాక్టీరియా, వైరస్ ఇన్‌ఫెక్షన్‌ల వల్ల వచ్చే జ్వరం తగ్గుతుంది. అల్లం రసం తాగకపోయినా నేరుగా చిన్న అల్లం ముక్కను తీసుకుని నోట్లో వేసుకుని బాగా నమిలి మింగాలి. ఇలా రోజుకు రెండు సార్లు చేస్తున్నా కూడా ఉపయోగం ఉంటుంది.

ఉల్లిపాయలు..

ఉల్లిపాయలను కూడా మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. ఉల్లిపాయలు లేకుండా అసలు కూరలను చేయరు. ఉల్లిపాయల్లో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. వీటిల్లో సల్ఫర్ సమ్మేళనాలు అధికంగా ఉంటాయి. ఈ సమ్మేళనాలను సిస్టీన్ సల్ఫాక్సైడ్స్ అని పిలుస్తారు. అలాగే ఉల్లిపాయల్లో శక్తివంతమైన ఫ్లేవనాయిడ్స్ కూడా ఉంటాయి. ఇవన్నీ యాంటీ బయాటిక్, యాంటీ వైరల్ గుణాలను కలిగి ఉంటాయి. కనుక రోగాలను తగ్గిస్తాయి. రోజూ భోజనంలో పచ్చి ఉల్లిపాయలను రెండు పూటలా తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది. ఉల్లిపాయల్లో ఫైటో న్యూట్రియెంట్స్ సైతం అధికంగా ఉంటాయి. ఇవి ఇన్‌ఫెక్షన్లపై నేరుగా పోరాటం చేస్తాయి. వ్యాధులను తగ్గేలా చేస్తాయి. కనుక బ్యాక్టీరియా, వైరస్ ఇన్ఫెక్షన్లు ఉన్నవారు ఉల్లిపాయలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. వ్యాధులను త్వరగా తగ్గించుకోవచ్చు.

వెల్లుల్లి, తేనె, పసుపు..

ఉల్లిపాయల్లాగే వెల్లుల్లి కూడా మనకు ఎంతో మేలు చేస్తుంది. దీన్ని కూడా మనం రోజూ వంటల్లో వేస్తుంటాం. ఇది వంటలకు చక్కని రుచి, వాసనను అందిస్తుంది. వెల్లుల్లిలో ఆల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది బ్యాక్టీరియా, వైరస్‌లపై పోరాటం చేస్తుంది. ఇన్ఫెక్షన్లను తగ్గిస్తుంది. రోజూ ఉదయం పరగడుపునే రెండు పచ్చి వెల్లుల్లి రెబ్బలను తింటుంటే ఉపయోగం ఉంటుంది. వీటిని నేరుగా తినవచ్చు. లేదా కాస్త వేయించి కూడా తినవచ్చు. అలాగే తేనె కూడా ఇన్‌ఫెక్షన్లను తగ్గిస్తుంది. ఇందులో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగాలను నయం చేస్తాయి. శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోజూ రెండు పూటలా ఒక టీస్పూన్ మోతాదులో తేనెను తీసుకుంటుంటే ఎంతగానో ఉపయోగం ఉంటుంది. అలాగే ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంలో పసుపు కూడా అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ రాత్రి పూట ఒక గ్లాస్ గోరు వెచ్చని పాలలో కొద్దిగా పసుపు కలిపి తాగుతుంటే ఇన్‌ఫెక్షన్లను తగ్గించుకోవచ్చు. ఇలా ఆయా వంటింటి పదార్థాలు ఇన్‌ఫెక్షన్లను తగ్గించడంలో, రోగ నిరోధక శక్తిని పెంచడంలో అద్భుతంగా పనిచేస్తాయి.

# లక్షల్లో వేతనాలు.. ఉంటే చాలు ఈ స్కిల్!




నేడు కృత్రిమ మేథ (ఏఐ) వాయు వేగంతో విస్తరిస్తోంది. ప్రతిరోజూ ఏదో ఒక సరికొత్త ఏఐ టూల్ పుట్టుకొస్తోంది. ప్రతి ఒక్క పనికి ఏఐ చాట్‌బాట్స్ అందుబాటులోకి వస్తున్నాయి. ఇవి చాలా తేలిగ్గా, తక్కువ వ్యయంతో అధిక సమర్థతతో పనిచేస్తున్నాయి. నలుగురు చేయాల్సిన పని ఒక్కరితోనే పూర్తవుతోంది. దీంతో ఇప్పుడు ప్రతి ఒక్క వృత్తిలో సమర్థత పెంపులో ఏఐ నైపుణ్యం అత్యంత ఆవశ్యకంగా మారుతోంది. ఏఐ వృత్తి పరంగా, వ్యక్తిగతంగా పని విధానాలను సమూలంగా మార్చివేస్తోంది. పని ప్రదేశాన్నే కాదు జీవన విధానాలనే మార్చివేస్తున్న కృత్రిమ మేథ నైపుణ్యం.. తాజా సర్వేల్లో టాప్ స్కిల్‌గా నిలుస్తోంది. ఏఐ స్కిల్ ఉన్న నిపుణుల కోసం కంపెనీలు అన్వేషణ సాగిస్తున్నాయి. కృత్రిమ మేథపై పట్టున్న వారికి లక్షల్లో వేతనాలు ఇచ్చేందుకు కూడా వెనుకాడటంలేదు. అందుకే ఇప్పుడు కెరీర్ పరంగా ఏఐ కీలక నైపుణ్యంగా మారింది.

**మరింత విస్తరణ దిశగా**

మైక్రోసాఫ్ట్, మెటా, గూగుల్, ఓపెన్ ఏఐ వంటి పెద్ద టెక్ కంపెనీలు డేటా కేంద్రాలు, ఏఐ మౌలిక వసతులపై బిలియన్ల డాలర్లు వెచ్చిస్తున్నాయి. ఇది రాబోయే రోజుల్లో ఏఐ రంగం మరింతగా విస్తరిస్తుందనేందుకు నిదర్శనమని పేర్కొంటున్నారు. ఇంతటి భారీ స్థాయిలో ఏఐపై పెట్టుబడులు పెడుతున్న కంపెనీలు.. వీటి నిర్వహణకు అవసరమైన మానవ వనరుల నియామకాలు అదే స్థాయిలో చేపట్టనున్నట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. అంటే భవిష్యత్తులో జాబ్ మార్కెట్‌లో కృత్రిమ మేథ కీలకమైన నైపుణ్యంగా మారనుంది.

**తాజా నివేదిక అంచనాలు**

ద వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 'ద ఫ్యూచర్ ఆఫ్ జాబ్ రిపోర్ట్-2025' ప్రకారం.. అన్ని రంగాలను డిజిటల్ టెక్నాలజీ కమ్మేయనుంది. 2030 నాటికల్లా తమ వ్యాపారాలు పూర్తిగా డిజిటల్‌గా మారతాయని భావిస్తున్నట్లు 60 శాతం మంది పేర్కొనడం విశేషం. అత్యాధునిక సాంకేతికత ముఖ్యంగా ఏఐ అండ్ ఇన్ఫర్మేషన్ ప్రాసెసింగ్ 86 శాతం, రోబోటిక్స్ అండ్ ఆటోమేషన్ 58 శాతం, ఎనర్జీ జనరేషన్, స్టోరేజ్ అండ్ డిస్ట్రిబ్యూషన్ 41 శాతం డిజిటల్ మార్పులకు కారణం కానున్నాయి. డిజిటల్ టెక్నాలజీ విస్తరణతో ఏఐ, బిగ్‌డేటా, నెట్‌వర్క్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ నైపుణ్యాలకు భారీ డిమాండ్ ఏర్పడనుందని ఈ నివేదిక అంచనావేసింది. డిజిటల్ టెక్నాలజీ విస్తరణతో.. ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ స్పెషలిస్ట్‌లు, బిగ్ డేటా స్పెషలిస్ట్‌లు, ఫిన్‌టెక్ ఇంజనీర్స్, సాఫ్ట్‌వేర్ అండ్ అప్లికేషన్ డవలపర్స్, అటానమస్ అండ్ ఈవీ స్పెషలిస్ట్‌లు తదితర ఉద్యోగాలకు డిమాండ్ నెలకొంటుందని తాజా పేర్కొంది. మరోవైపు క్లరికల్, సెక్రటేరియల్ ఉద్యోగాలు భారీగా తగ్గనున్నాయి. ముఖ్యంగా క్యాషియర్స్, టికెట్ క్లర్క్స్, డేటా ఎంట్రీ క్లర్క్స్, బ్యాంక్ టెల్లార్ కొలువుల్లో కోతపడనుంది. అత్యంత వేగంగా డిమాండ్ పెరుగుతున్న నైపుణ్యాల్లో ఏఐ అండ్ బిగ్ డేటా టాప్‌లో ఉన్నట్లు ఈ నివేదిక స్పష్టం చేసింది. ఆ తర్వాతి స్థానాల్లో నెట్‌వర్క్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ, టెక్నాలజీ లిటరసీ నిలిచాయి. ఈ మూడు టెక్ నైపుణ్యాలతోపాటు 2025%-%2030 మధ్యకాలంలో సృజనాత్మక ఆలోచన (క్రియేటివ్ థింకింగ్) ఒత్తిళ్లను తట్టుకొనే సామర్థ్యం (రెజిలియెన్స్), సరళత్వం-చురుకుదనం (ఫ్లెక్సిబిలిటీ అండ్ ఎజిలిటీ), కుతూహలం (క్యూరియాసిటీ), జీవితాంతం నేర్చుకోవాలి అనే అభిలాష ఉన్న వారికి కంపెనీలు నియామకాల్లో ప్రాధాన్యం ఇవ్వనున్నాయి.

నిపుణుల కొరత

ఏఐ నిపుణుడిగా మారాలంటే.. ఐఐటీల్లో చదవాలి, టాప్ యూనివర్సిటీల నుంచి సర్టిఫికెట్‌లు ఉండాలి అనేది అపోహ మాత్రమే అంటున్నారు నిపుణులు. ఓ వైపు ఏఐ నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతుంటే.. మరోవైపు ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా నిపుణులు అందుబాటులో లేరని నివేదికలు పేర్కొంటున్నాయి. దీంతో మానవ వనరుల నైపుణ్యాలు, కంపెనీల అవసరాల మధ్య తీవ్ర అంతరం నెలకొంది. ఏఐ నిపుణుల కొరత తీర్చేందుకు పెద్ద ఎత్తున అప్‌స్కిల్లింగ్ చేపట్టాలని సూచిస్తున్నారు. ఏఐ రంగంలో ప్రవేశించాలనుకునే వారు వ్యక్తిగతంగా స్వీయ అసెస్‌మెంట్ చేసుకోవాలి. జాబ్ మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా తమలో నైపుణ్యాలు లేకుంటే వాటిని మెరుగుపరచుకునే దిశగా ప్రయత్నం చేయాలి. మొదట యూట్యూబ్ తదితర ఆన్‌లైన్ మార్గాల ద్వారా ప్రాథమిక అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత బేసిక్ ఆన్‌లైన్ షార్ట్‌టర్మ్ కోర్సుల ద్వారా ప్రాథమిక అంశాలు నేర్చుకోవచ్చు. స్వయం, ఎన్‌పీటీఈఎల్ తదితర మార్గాల ద్వారా ఐఐటీలు వంటి ప్రముఖ ఇన్‌స్టిట్యూట్స్ అందిస్తున్న ఉచిత కోర్సుల ద్వారా ఏఐపై పట్టు పెంచుకొని జాబ్ మార్కెట్‌లో అవకాశాల కోసం అన్వేషించొచ్చు!!

# రాత్రి పూట త్వరగా భోజనం చేయాలని చెబుతున్న సైంటిస్టులు.. ఎందుకో తెలిస్తే మీరు కూడా అలాగే చేస్తారు..



పూర్వం ప్రజలు రోజూ శారీరక శ్రమ చేసే వారు. ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను కలిగి ఉండేవారు. రోజూ బలవర్థకమైన ఆహారం తినేవారు. అంతేకాదు రాత్రి పూట త్వరగా భోజనం చేసేవారు. త్వరగా నిద్రించేవారు. ఉదయం త్వరగా నిద్రలేచేవారు. ఇలా అన్ని రకాలుగా వారు ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించేవారు. కనుకనే ఎన్నో ఏళ్ల పాటు వారు ఆరోగ్యంగా జీవించగలిగారు. అయితే అప్పట్లో ప్రజలు అంత ఆరోగ్యంగా ఉండడానికి కారణం పౌష్టికాహారం తీసుకోవడం మాత్రమే కాకుండా రాత్రి పూట త్వరగా భోజనం చేయడమే అని చెప్పవచ్చు. సైంటిస్టులు ఈ విషయంపై అధ్యయనాలు కూడా చేపట్టి వాస్తవమే అని తేల్చారు. ఈ క్రమంలోనే రాత్రి పూట త్వరగా భోజనం చేయాలని, దీని వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని సూచిస్తున్నారు.

**బరువు తగ్గేందుకు..**

రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల అనేక వ్యాధులు, అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవచ్చు. భోజనాన్ని కనీసం రాత్రి 7.30 గంటల లోపు ముగించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల శరీర మెటబాలిజం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలనుకునే వారు కచ్చితంగా రాత్రి పూట త్వరగా భోజనం చేయాలి. దీని వల్ల మనం తిన్న ఆహారం నుంచి వచ్చే శక్తిని ఖర్చు పెట్టేందుకు శరీరానికి తగిన సమయం లభిస్తుంది. దీంతో క్యాలరీలు సులభంగా ఖర్చవుతాయి. కొవ్వు కరిగి అధిక బరువు తగ్గుతారు. బరువు తగ్గాలని చూస్తున్నవారు తప్పనిసరిగా ఈ సూచనను పాటించాల్సి ఉంటుంది. రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల శరీరంలో కొవ్వు అధికంగా చేరకుండా చూసుకోవచ్చని సైంటిస్టుల అధ్యయనాల్లో తేలింది. దీని వల్ల ఊబకాయం బారిన పడకుండా ఉంటారు.

**క్యాన్సర్ రాకుండా..**

రాత్రి పూట త్వరగా భోజనం చేయడం వల్ల క్యాన్సర్ రాకుండా చూసుకోవచ్చని సైంటిస్టులు చెబుతున్నారు. రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే క్యాన్సర్లు వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయని అంటున్నారు. త్వరగా భోజనం ముగించే పురుషులకు 26 శాతం వరకు క్యాన్సర్ ముప్పు తగ్గుతుంది. అదే స్త్రీలకు అయితే 16 శాతం వరకు క్యాన్సర్ వచ్చే ముప్పు తగ్గుతుంది. రాత్రి త్వరగా భోజనం చేసి త్వరగా నిద్రించడం వల్ల ఉదయం త్వరగా నిద్రలేస్తారు. దీని వల్ల నిద్రలేమి ఉండదు. పైగా ఉదయం నిద్ర లేచిన వెంటనే యాక్టివ్‌గా ఉన్నట్లు ఫీలవుతారు. శరీరానికి శక్తి లభించినట్లు ఉత్సాహం వస్తుంది. రోజంతా శక్తి స్థాయిలు అధికంగా ఉంటాయి. యాక్టివ్‌గా పనిచేస్తారు. ఉత్సాహంగా ఉంటారు. బద్దకం పోతుంది.

**జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి..**

రాత్రి పూట త్వరగా భోజనం చేస్తే జీర్ణ వ్యవస్థకు కావల్సినంత విశ్రాంతి లభిస్తుంది. దీని వల్ల జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయగలుగుతుంది. జీర్ణ వ్యవస్థలో ఉండే అవయవాలు సులభంగా మరమ్మత్తులకు గురవుతాయి. దీని వల్ల జీర్ణ సమస్యలు తగ్గిపోతాయి. ముఖ్యంగా గ్యాస్, అసిడిటీ, మలబద్దకం, అజీర్తి తగ్గుతాయి. అలాగే రాత్రి త్వరగా భోజనం చేస్తే నిద్రించే సమయానికి ఆహారం సులభంగా జీర్ణం అవుతుంది. దీంతో నిద్ర చక్కగా పడుతుంది. రాత్రి పూట భోజనానికి, నిద్రకు మధ్య కనీసం 3 గంటల వ్యవధి ఉండాలని వైద్యులు చెబుతుంటారు. కనుక త్వరగా భోజనం చేయడం వల్ల నిద్రకు భంగం కలగదు. పైగా మరుసటి రోజు ఉదయం కూడా త్వరగా నిద్రలేస్తారు. ఇలా ఆరోగ్యకరమైన జీవనశైలి అలవడుతుంది. ఇక రాత్రి పూట త్వరగా భోజనం చేసేవారికి గుండె జబ్బులు వచ్చే అవకాశాలు సైతం చాలా తక్కువగా ఉంటాయని సైంటిస్టులు చేపట్టిన అధ్యయనాల్లో తేలింది. కనుక రాత్రి పూట త్వరగా భోజనం చేస్తుంటే ఎన్నో లాభాలను పొందవచ్చు.

లోకల్ గైడ్ – ద్విభాషా దినపత్రిక
www.localguidenews.com

జనరల్ న్యూస్

సోమవారం - 19 - అక్టోబర్ - 2026

# మౌని రాయ్ కొత్త లుక్ చూసాక గుండె గల్లంతే!



మౌని రాయ్ కొత్త లుక్ చూసాక గుండె గల్లంతే! అందాల నటి మౌనీ రాయ్ నిరంతరం తన ఇన్ స్టా పోస్టులతో యువహృదయాలను కొల్లగొడుతున్న సంగతి తెలిసిందే. తన తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌తో సోషల్ మీడియాలో మరోసారి హల్‌చల్ చేశారు. ౹ా స్టోరియన్..బిసో.. బిసోవ్ ఎక్స్ అనే క్యాప్షన్‌తో మౌని షేర్ చేసిన ఫోటో క్షణాల్లోనే వైరల్‌గా మారింది. ఆకర్షణీయమైన లుక్‌తో ఉన్న ఈ ఫోటోను చూసి అభిమానులు, నెటిజన్లు లైకులు, గుండె గుర్తు ఎమోజీలతో కామెంట్ సెక్షన్‌ను ముంచెత్తారు. ఈ పోస్ట్‌కు ఆమె తోటి సెలబ్రిటీల నుంచి కూడా విశేష స్పందన లభించింది. ప్రముఖ నటులు అర్జున్ బిజ్లానీ, అనుషా దండేకర్, అషీమా వర్ధన్, ప్రముఖ స్టైలిస్ట్ అనుసోరు వంటి పరిశ్రమ స్నేహితులు ఫైర్, హార్ట్ ఎమోజీలను పోస్ట్ చేస్తూ ఆమె స్టైలింగ్- అందాన్ని ప్రశంసించారు.





తోటి నటీనటులు, టెలివిజన్ ప్రముఖులు చూపిన ఈ ఆప్యాయత సోషల్ మీడియాలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మౌనీ రాయ్ అభిమానులు, ఫ్యాన్ పేజీలు ఆమెను ఎంతగానో అభినందిస్తూ కామెంట్లు చేశారు. చాలామంది -రాకుమారి (షెహజాదీ)-, -డిస్నీ ప్రిన్సెస్-.. -దివా- అని అభివర్ణించారు. మౌని కేశాలంకరణ, దుస్తుల ఎంపికను మెచ్చుకుంటూ నెటిజన్లు ఆమెను ఫ్యాషన్ ఐకాన్‌గా అభివర్ణించారు. ఈ పోస్ట్ తో మౌని రాయ్ కు ఉన్న అంతర్జాతీయ, ప్రాంతీయ ప్రజాదరణ మరోసారి నిరూపితమైంది. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన శుభాకాంక్షలతో పాటు, సొంత రాష్ట్రమైన పశ్చిమ బెంగాల్‌కు చెందిన అభిమానులు --సుభో శారదీయ-- అని బెంగాలీ పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ కామెంట్లు చేశారు. భాషలు, సరిహద్దులతో సంబంధం లేకుండా మౌనీకి ఉన్న క్రేజ్‌కు ఇది నిదర్శనంగా నిలిచింది. మొత్తానికి ఒక్క పోస్ట్‌తో సోషల్ మీడియా వేదికగా ఈ స్థాయి స్పందన రావడం మౌనీ రాయ్ డిజిటల్ ఇంపాక్ట్ కి, స్టార్ డమ్‌కు అద్దం పడుతోంది. వెండితెరపైనే కాకుండా, సోషల్ మీడియాలోనూ తన విలక్షణమైన స్టైల్‌తో మిలియన్ల మంది అభిమానులను ఆకట్టుకుంటూ ఇంటర్నెట్ సెన్సేషన్‌గా కొనసాగుతున్నారు.

మూడవ ప్రపంచ యుద్ధం మొదలైనా

# ‘వారణాసి’ ఆగదు!






మిడిల్ ఈస్ట్‌లో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా విదేశాల్లో షూటింగ్ ప్లాన్ చేసిన సినిమాలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. యూరప్ వెళ్లే విమానాలు ఎక్కువగా దుబాయ్ మీదుగానే వెళ్లాల్సి ఉండటం, అక్కడ విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో షూటింగ్స్ క్యాన్సిల్ చేసుకుంటున్నారు. ఎప్పుడు ఏ ప్రాంతం మీద బాంబులు జార విడుస్తారో తెలియని ఉద్రిక్తత పరిస్థుల నడుమ రిస్క్ తీసుకోవడానికి ఏ దర్శక, నిర్మాత సిద్ధంగా లేరు. కానీ దర్శశిఖరం రాజమౌళి మాత్రం మూడవ ప్రపంచం యుద్ధం మొదలైన సరే వెనక్కి తగ్గేలా కనిపించలేదు.మీ వార్ మీది..నా వార్ నాది అంటూ అమెరికా-ఇజ్రయెల్-ఇరాన్ దేశాల మధ్య యుద్ధాన్ని సైతం లెక్కచేయకుండా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పక్కా ప్రణాళికతో జక్కన్న అండ్ కో షూటింగ్ కి సిద్ధమవుతున్నారు. ఇటీవలే జార్జియాలో షెడ్యూల్ పూర్తి చేసుకున్న మహేష్ బాబు -రాజమౌళి బృందం, దుబాయ్ మీదుగా కాకుండా ఇతర ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా సురక్షితంగా భారత్‌కు చేరుకున్నారు. దీంతో అంటార్కిటికా షెడ్యూల్ విషయంలోనూ రాజమౌళి ఇదే వ్యూహాన్ని రచిస్తున్నారు. అంటార్కిటాకు చేరుకునేందకు చాలా రకాల మార్గాలున్నాయి.కానీ రాజమౌళి ఆ మార్గంలో కాకుండా కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారు. దీనిలో భాగంగా తొలుత నేరుగా దక్షిణ అమెరికాకు వెళ్లి, అక్కడి నుండి అంటార్కిటికా చేరుకోనున్నారు. మరి అంటార్కిటికాలో యుద్ధం వచ్చే అవకాశం లేదా? అంటే అందుకు అవకాశాలు చాలా తక్కువగా ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ ఎలాంటి యుద్ధ వాతావరణం లేదు. అందుకు కారణం అంటార్కిటికా ఒప్పందం. 1959లో జరిగిన అంతర్జాతీయ ఒప్పందం ప్రకారం, అంటార్కిటికాను కేవలం శాంతియుతమైన పనులకు , శాస్త్రీయ పరిశోధనలకు మాత్రమే ఉపయోగించాలి. అక్కడ సైనిక కార్యకలాపాలపై నిషేధం ఉంది. ఈ ఖండంలో ఎటువంటి సైనిక స్థావరాలను నిర్మించడం, ఆయుధాలను పరీక్షించడం లేదా సైనిక విన్యాసాలు చేయడం పూర్తిగా నిషేధం. ఏ ఒక్క దేశం కూడా అంటార్కిటికా మాదే అని సొంతం చేసుకోలేదు. ఇది ప్రపంచ దేశాల ఉమ్మడి ఆస్తిగా పరిగణించబడుతుంది. ఇక్కడ ఖనిజాల కోసం తవ్వకాలు జరపడం కూడా నిషేధించబడింది. కేవలం పర్యాటకం , పరిశోధనలకు మాత్రమే అనుమతి ఉంటుంది. షూటింగ్ అనుమతులు కూడా ఉండవు. కానీ రాజమౌళి తన ఇన్ ఫ్లూయెన్స్ తో -వారణాసి- షూటింగ్ అనుమతులు సంపాదించారు. దీంతో రాజమౌళి అండ్ కో ఎలాంటి ఇబ్బంది లేకుండా వారణాసి షూటింగ్ చేసుకోవచ్చు. అక్కడ వరకూ చేరడమే కాస్త సాహసంగా పరిగణించాలి.






# ‘కింగ్ 100’ టైటిల్ వెనక అసలు రహస్యం?




కింగ్ 100 టైటిల్ వెనక అసలు రహస్యం? అక్కినేని నాగార్జున 100వ చిత్రం -కింగ్ 100- శరవేగంగా చిత్రీకరణను పూర్తి చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఆర్. కార్తీక్ దర్శకత్వం వహిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రాన్ని అన్నపూర్ణా స్టూడియోస్ బ్యానర్‌పై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. అయితే నాగార్జున ఇలాంటి టైటిల్ నే ఎందుకు ఎంచుకున్నాడు? అంటూ చాలా కాలంగా చర్చ సాగుతోంది. ఈ సినిమాకు -కింగ్ 100- అనే శీర్షిక ఎందుకు పెట్టారో వివరిస్తూ కథలోని ఒక కీలకమైన సన్నివేశంలో అసలు కారణాన్ని చూపించబోతున్నారని ఇన్‌సైడ్ వర్గాల సమాచారం. నాగార్జున సినీ కెరీర్‌లోనే ఈ ప్రత్యేక అంశం కథకు ప్రధాన బలంగా నిలవనుందని.. ఇది అభిమానుల్లో అంచనాలను భారీగా పెంచుతుందని టాక్ వినిపిస్తోంది. ఇలాంటి టైటిల్ వెనక రహస్యం ఏమిటో తెలుసుకోవాలనుకునేవారికి ఇది సర్ ప్రైజింగ్ గా ఉండనుందని కూడా తెలుస్తోంది. ఈ చిత్రం కథాంశం ఒక సామాన్యుడి అసాధారణ ప్రయాణాన్ని ఆవిష్కరిస్తుంది. పేదరికం నుంచి స్వశక్తితో ఎదిగి, అత్యంత సంపన్నుడిగా మారి -ది కింగ్- అనే బిరుదును పొందిన ఒక వ్యక్తి చుట్టూ కథ తిరుగుతుంది. ఆగస్టు 29న అన్నపూర్ణా స్టూడియోస్ విడుదల చేసిన టీజర్ గ్లింప్స్ ప్రేక్షక లోకాన్ని గొప్పగా ఆకట్టుకుంది. కట్టల కొద్దీ నోట్లు, ఇటుకల్లా పేర్చిన బంగారు బిస్కట్లు, గుర్రపు పందెలు, శత్రువుల దండయాత్రల నడుమ రూ. 50,000 కోట్ల భారీ ఆర్థిక కుంభకోణం వెలుగుచూడటం.. దానితో తలెత్తే రాజకీయ ఉద్రిక్తతలు.. అల్లర్ల నేపథ్యం టీజర్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించాయి. ఈ విజువల్ గ్రాండియర్ వెనుక ఒక భావోద్వేగపూరితమైన ఉపకథ కూడా ఉంది. ఒకవైపు వేల కోట్ల స్కామ్- విధ్వంసం జరుగుతుండగా.. అదే గందరగోళంలో చిక్కుకున్న ఒక చిన్నపాటి పసిపాపను కాపాడాల్సిన కీలకమైన సన్నివేశం కథకు ప్రాణంగా నిలవనుంది. నాగార్జునతో పాటు టబు సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ ఈ సినిమాలో నటించడం అభిమానులకు ప్రత్యేకంగా మారింది. వీరితో పాటు ఐశ్వర్య రాజేష్, సుస్మితా భట్, అశోక్ సెల్వన్, రవీంద్ర విజయ్ వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపిస్తుండగా.. దేవిశ్రీ ప్రసాద్ అందిస్తున్న సంగీతం సినిమాకి అదనపు ఆకర్షణగా నిలవనుంది. ఇక ఈ ప్రతిష్టాత్మక చిత్రం 2026 డిసెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. బాక్సాఫీస్ వద్ద షారుఖ్ ఖాన్ నటించిన -కింగ్- సినిమాతో ఈ చిత్రం పోటీపడనుండటం విశేషం. దశాబ్దాల నాగార్జున సినీ ప్రయాణానికి చిహ్నంగా తెరకెక్కుతున్న ఈ 100వ చిత్రం అటు మాస్ యాక్షన్‌ను, ఇటు ఎమోషన్స్‌ను సమపాళ్ళలో అందిస్తూ వెండితెరపై కొత్త చరిత్ర సృష్టిస్తుందని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# కల్కి : రెండున్నర ఏళ్లకు గుడ్ న్యూస్



కల్కి : రెండున్నర ఏళ్లకు గుడ్ న్యూస్ ప్రభాస్, నాగ్ అశ్విన్ కాంబోలో వచ్చిన ‘కల్కి’ కమర్షియల్‌గా మంచి విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. సాంకేతిక పరంగా సినిమా మంచి స్పందన దక్కించుకుంది. అందుకే మొదటి పార్ట్ విడుదలైన రెండో రోజు నుంచే సీక్వెల్ గురించి ఎదురు చూపులు మొదలు అయ్యాయి. కల్కి మొదటి పార్ట్ అత్యంత ఆసక్తికరమైన పాయింట్ వద్ద పూర్తి అయిన విషయం తెల్సిందే. దేవుడి పుట్టుక రెండో పార్ట్‌లో ఉంటుంది. దేవుడి పుట్టిన తర్వాత జరిగే పరిణామాలు ఏంటి, మహాభారత ఘట్టాలతో కలిపి కల్కి 2 సినిమా ఉంటుందని మొదటి నుంచి చాలా మంది ఊహిస్తూ వస్తున్నారు. అయితే దర్శకుడు నాగ్ అశ్విన్ అంతకు మించే ఉంటుందని సన్నిహితుల వద్ద అంటున్నాడట. దాంతో కల్కి 2 పై అంచనాలు మరింతగా పెరిగాయి. సీక్వెల్ షూటింగ్ ఎప్పుడెప్పుడు ప్రారంభం అవుతుందా అని అంతా ఎదురు చూస్తున్నారు. కల్కి నుంచి దీపికా పదుకునే ఔట్... కల్కి సినిమాలో ముఖ్య పాత్రలో నటించిన దీపికా పదుకునే తప్పుకుందనే విషయం తెల్సిందే. ఆమె తప్పుకోవడంతో ఆ పాత్రను ఎవరు చేస్తారు అనేది ఆసక్తికరంగా మారింది. మొదటి పార్ట్ షూటింగ్ సమయంలోనే సెకండ్ పార్ట్ దాదాపు సగం షూట్ పూర్తి చేశారనే వార్తలు వచ్చాయి. దాంతో దీపికా పాత్ర విషయంలో దర్శకుడు నాగ్ అశ్విన్ ఏం చేస్తాడా అనే ఆసక్తి నెలకొంది. అమితాబ్ బచ్చన్ పాత్రకు సంబంధించిన షూటింగ్ దాదాపుగా పూర్తి చేశారని తెలుస్తోంది. బ్యాలెన్స్ ఏమైనా ఉంటే రెండు మూడు రోజులు ఆయనతో చేసే అవకాశాలు ఉన్నాయి. కమల్ హాసన్ సైతం ఈ పార్ట్ లో కీలక రోల్‌లో కనిపిస్తాడని అంటున్నారు. కనుక ఆయన పార్ట్ షూటింగ్ ఎంత వరకు అయింది అనేది తెలియాల్సి ఉంది. గత రెండేళ్లుగా ఎదురు చూస్తున్న కల్కి 2 షూటింగ్ ప్రారంభంకు సంబంధించిన కీలక అప్‌డేట్ అతి త్వరలో యూనిట్ సభ్యుల నుంచి రాబోతుందట. కల్కి 2 షూటింగ్ ప్రారంభం కోసం... ఇండస్ట్రీ వర్గాల నుంచి అందుతున్న విశ్వసనీయ సమాచారం ప్రకారం కల్కి 2 షూటింగ్‌ను నవంబర్‌లో ప్రారంభించబోతున్నారు. ప్రభాస్ ఫౌజీతో పాటు స్పిరిట్‌కు సంబంధించిన షూటింగ్స్ తో గత ఏడాది కాలంగా బిజీ బిజీగా ఉన్న కారణంగా కల్కి 2 కి డేట్లు ఇవ్వలేక పోయాడట. ఫైనల్‌గా వచ్చే నెల నుంచి డేట్లు ఇచ్చేందుకు ఓకే చెప్పాడట. దాంతో నాగ్ అశ్విన్ షూటింగ్ కోసం ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇంతకు ముందుతో పోల్చితే ఈసారి మరింత భారీగా కొన్ని సెట్స్ ను వేయాల్సి ఉందట. అందుకోసం ఏర్పాట్లు జరుగుతున్నట్లు చెబుతున్నారు. మొదటి పార్ట్‌కు వచ్చిన రెస్పాన్స్ నేపథ్యంలో కొన్ని కొత్త సీన్స్ సైతం యాడ్ చేసే ప్లాన్ ను దర్శకుడు నాగ్ అశ్విన్ చేస్తున్నాడు. మొత్తానికి కల్కి 2 షూటింగ్ ప్రారంభం కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి ఇదో పెద్ద గుడ్ న్యూస్‌గా చెప్పుకోవచ్చు.



# హీట్ పుట్టిస్తున్న ప్రభాస్ బ్యూటీ!



సీజన్ కి తగ్గట్టుగా ఫాలోవర్స్ ను పెంచుకోవడానికి అటు సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్నారు సెలబ్రిటీలు. ముఖ్యంగా అకౌంట్ ఉంటే చాలు తమ అందాలు ఆరబోస్తూ.. అటు దర్శక నిర్మాతల కంట్లో కూడా పడుతున్నారని చెప్పాలి. ఈ క్రమంలోనే ఎంతోమంది హీరోయిన్స్ సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ గ్లామర్ వలకబోస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు . పైగా పబ్లిక్ ఈవెంట్లలో, సినిమా ఫంక్షన్లలో సందడి చేసిన ఈ ముద్దుగుమ్మలు. అందుకు సంబంధించిన ఫోటోలను తాజాగా తమ ఇంస్టాగ్రామ్ ఖాతాల ద్వారా షేర్ చేస్తూ అభిమానులకు మంచి అందాల ట్రీట్ ఇస్తున్నారని చెప్పాలి. ఇదిలా ఉండగా తాజాగా ప్రభాస్ బ్యూటీగా పేరు దక్కించుకున్న రిద్ధీ కుమార్.. ఇంస్టాగ్రామ్ వేదికగా పంచుకున్న కొన్ని ఫోటోలు సోషల్ మీడియాలో మరింత వైరల్ గా మారుతున్నాయి. హెవీ ఎంబ్రాయిడరీ తో డిజైన్ చేసిన స్లీవ్ లెస్ లెహంగా ధరించిన ఈమె.. ముత్యాలతో అద్భుతంగా రూపొందించిన ఈ డ్రెస్. తన మేనిఛాయతో అందాలు ఒలకబోస్తూ ప్రేక్షకులను మరింత మెస్మరైజ్ చేస్తోంది. ముఖ్యంగా నెక్ ను గ్రీన్ కలర్ స్టోన్ చైన్ తో ఫుల్ ఫిల్ చేసింది. మొత్తానికైతే రిద్ధీ కుమార్ సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాని షేక్ చేస్తోంది అనడంలో సందేహం లేదు. తన అందాలతో ఉక్కిరిబిక్కిరి చేస్తూ సమ్మర్ వేళ మరింత హీట్ పుట్టిస్తుంది అని అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ఒక ఈవెంట్ కి హాజరైన ఈమె. అక్కడ వివిధ రంగాలలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి అవార్డులు అందుకున్న మహిళలను కలిసినందుకు తాను ఎంతో గర్వంగా ఫీల్ అవుతున్నాను అంటూ క్యాప్షన్ గా రాసుకొచ్చింది. ఇక ప్రస్తుతం రిద్ధీ కుమార్ షేర్ చేసిన ఈ ఫోటోలు, ఇచ్చిన క్యాప్షన్ సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. మహారాష్ట్రలోని షిర్డి సమీపంలో ఉన్న కోపర్గావ్ ప్రాంతంలో ఒక సైనిక కుటుంబంలో జన్మించింది. ఈమె తండ్రి భారత సైన్యంలో అధికారి కాగా, ఈమె పూణేలోని ఫెర్గ్యూసన్ కళాశాల నుండి తత్వశాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ అందుకుంది. సినిమాలోకి రాకముందు మోడల్ గా పనిచేసిన ఈమె.. పలు ఫ్యాషన్ షోలు , ప్రాంతీయ అందాల పోటీల్లో పాల్గొనింది. 2018లో రాజ్ తరుణ్ సరసన లవర్ అనే చిత్రం ద్వారా తెలుగు ప్రేక్షకులను పలకరించిన ఈమె.. ఆ తర్వాత విరాజ్ అశ్విని సరసన అనగనగా ఓ ప్రేమ కథలో కనిపించింది. ఇకపోతే ప్రసిద్ధ క్యాడ్బరీ డైరీ మిల్క్ యాడ్ లో కూడా కనిపించిన రిద్ధీ ఇటీవల ప్రభాస్ హీరోగా మారుతి దర్శకత్వంలో వచ్చిన ది రాజా సాబ్ సినిమాలో హీరోయిన్ గా నటించి ఆకట్టుకుంది. ఇందులో రిద్ధీ తో పాటు నిధి అగర్వాల్ , మాళవిక మోహనన్ కూడా నటించిన విషయం తెలిసిందే. అటు టెలివిజన్ సిరీస్ లలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది రిద్ధీ కుమార్.



# కోల్‌కతా తొక్కిసలాట - సీఎం సువేందు ఉన్నత స్థాయి సమీక్ష



కోల్‌కతా: కోల్‌కతాలోని చోర్‌బాగన్ దుర్గాపూజా మండపం వద్ద జరిగిన తొక్కిసలాటలో 19 మంది మరణించగా, 25 మంది గాయపడిన ఘటనపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి భవానీ భవన్‌లో ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి , హోం కార్యదర్శి, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌తో పాటు వివిధ శాఖల ప్రతినిధులు హాజరయ్యారు. అంతకుముందు, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ముఖ్యమంత్రి సువేందు అధికారితో కలిసి కోల్‌కతాలోని అపోలో ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన వెంటనే పరిస్థితిని సమీక్షించేందుకు ముఖ్యమంత్రి కలకత్తా మెడికల్ కాలేజ్ ఆస్పత్రికి చేరుకున్నారు. ఈ తొక్కిసలాటకు సంబంధించి చోర్‌బాగన్ దుర్గాపూజ కమిటీ నిర్వాహకులతో సహా ఏడుగురిని కోల్‌కతా పోలీసులు అరెస్టు చేశారు. గిరీష్ పార్క్ పోలీస్ స్టేషన్‌లో భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్) సెక్షన్లు 105, 110, 3(5) కింద సుమోటో కేసు నమోదైంది. విచారణ కోసం తొలుత 14 మందిని అదుపులోకి తీసుకున్నారు. సంఘటనా స్థలంలో ఉన్న ఏసీపీ ప్రాథమిక సమాచారం ప్రకారం, ఒక ప్రైవేట్ సెక్యూరిటీ ఏజెన్సీ చేసిన అనౌన్స్‌మెంట్, ఈలలు వేయడం వల్లే ఈ తొక్కిసలాట మొదలైందని ముఖ్యమంత్రి అధికారి మీడియాకు తెలిపారు. పూజా కమిటీ సభ్యులు, భద్రతా ఏజెన్సీ ప్రతినిధులను అదుపులోకి తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. బాధితుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారంతో పాటు కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఘటన తర్వాత పోలీసులు చోర్‌బాగన్ పండాల్‌లోకి సందర్శకుల ప్రవేశాన్ని నిలిపివేశారు. శాంతిభద్రతల దృష్ట్యా అక్టోబర్ 18 నుంచి 20 వరకు నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భారతీయ నాగరిక్ సురక్ష సంహిత సెక్షన్ 163 కింద నిషేధాజ్ఞలు విధించారు. ముందుజాగ్రత్త చర్యగా సురుచి సంఘ, చేత్లా అగ్రణి, తాలా ప్రత్యయ్ వంటి ప్రముఖ పూజా పండాల్‌లను కూడా మూసివేశారు.

### 'అధికారుల నిర్లక్ష్యమే కారణం'

ఈ ఘటనలో మరణించిన 26 ఏళ్ల నర్స్ శ్రీపర్ణ పొద్దార్ కుటుంబ సభ్యులు అధికారుల నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని ఆరోపించారు. మెరుగైన ఏర్పాట్లు చేసి ఉంటే ఈ ఘోరాన్ని నివారించవచ్చని మృతురాలి సోదరి రీపా దాస్ అన్నారు. కాగా ప్రభుత్వం బాధిత కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, ప్రభుత్వ ఉద్యోగం, అలాగే గాయపడిన వారికి రూ. 5 లక్షల సాయం ప్రకటించింది. మరోవైపు శనివారం సాయంత్రం చోర్‌బాగన్ మండపం వద్ద మృతి చెందిన 19 మంది పేర్లు, వయస్సు, చిరునామాలతో కూడిన పూర్తి జాబితాను పోలీసులు అధికారికంగా విడుదల చేశారు.కాగా కోల్‌కతా ఘటన దరిమిలా ఉత్తరప్రదేశ్ అంతటా ఉన్న పూజా మండపాల్లో ఫైర్ సేఫ్టీ, ఎంట్రీ-ఎగ్జిట్ పాయింట్లు, ఎమర్జెన్సీ దారులు, విద్యుత్ వ్యవస్థలపై క్షేత్రస్థాయి పరిశీలనలు జరపాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు.

# 2002 ఓటర్ల జాబితాలో పేరు లేకపోతే..



న్యూఢిల్లీ: ఢిల్లీ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో భాగంగా 2002 ఓటర్ల జాబితాతో తల్లిదండ్రుల పేర్లు సరిపోలకపోవడం లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉండటాన్ని గుర్తించిన దాదాపు 33.12 లక్షల కేసుల్లో 80 శాతానికి పైగా సమస్యలను పరిష్కరించినట్లు అధికారులు వెల్లడించారు. ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించిన, లేదా రికార్డులు సరిపోలని వారి వివరాలను ధృవీకరించేందుకు ఎన్నికల అధికారులు కృషి చేస్తున్నారు. ఢిల్లీ ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో)కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం, మొత్తం 33,12,919 కేసుల్లో దాదాపు 26 లక్షల కేసులను ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఈఆర్‌వో), సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులు (ఏఈఆర్‌వో) ఇప్పటికే పరిష్కరించారు. సంబంధిత ధృవీకరణ పత్రాలను సేకరించేందుకు బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వో) నేరుగా ఓటర్ల ఇళ్లను సందర్శిస్తున్నారు. ఆగస్టు 31న ప్రచురించిన ముసాయిదా జాబితా నుంచి 47 లక్షలకు పైగా ఓటర్ల పేర్లను తొలగించడంపై ఆందోళనలు వ్యక్తమైన నేపథ్యంలో ఈ దిద్దుబాటు ప్రక్రియను వేగవంతం చేశారు. ఒకవేళ ఎవరి పేరైనా ముసాయిదా జాబితాలో లేకపోతే, వారు నిబంధనల ప్రకారం ఫారం-6 సమర్పించి తుది జాబితాలో పేరు నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. ఓటర్ల సందేహాలు నివృత్తి చేయడానికి పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక శిబిరాలను కూడా ఏర్పాటు చేశారు. నోటీసులకు సంబంధించిన అన్ని కేసులను అక్టోబర్ 30 నాటికి పరిష్కరించి, డిసెంబర్ 4న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు.

# లోక్‌భవన్‌కు వైఎస్ జగన్.. గవర్నర్‌తో భేటీ..



తాడేపల్లి : స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో టీడీపీ గూండాలు సృష్టించిన అరాచకాలను గవర్నర్ అబ్దుల్ నజీర్ దృష్టికి తీసుకెళ్లారు వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. ఈ మేరకు ఆదివారం సాయంత్రం సమయంలో లోక్‌భవన్‌కు వెళ్లిన వైఎస్ జగన్.. గవర్నర్‌తో భేటీ అయ్యారు. మూడు రోజులుగా టీడీపీ గూండాలు చేస్తున్న అరాచకాలపై గవర్నర్‌కు వైఎస్ జగన్ ఫిర్యాదు చేశారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా టీడీపీ గూండాలు అడ్డుకున్న వైనాన్ని గవర్నర్‌కు వివరించారు. ఇప్పటికే రాష్ట్ర ఎస్‌ఈసీని కలిసి ఫిర్యాదు చేసిన వైఎస్ జగన్.. ఇదే అంశాన్ని గవర్నర్‌కు సైతం వివరించారు. కాగా, స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో మూడు రోజులుగా టీడీపీ గూండాలు అరాచకం సృష్టించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డకున్నారు. ఉమ్మడి కడప జిల్లాను రక్తసిక్తం చేసింది పచ్చముఠా. టీడీపీ గూండాల దాడి, కత్తిపోట్లతో వైఎస్సార్‌సీపీ నేతలకు గాయాలయ్యాయి. ఈ దాడులతో పాటు పులివెందులలో పోలీసుల కాల్పుల్లో ముగ్గురికి గాయాలయ్యాయి. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను అనేక చోట్ల నామినేషన్లు వేయకుండా టీడీపీ గూండాలు అడ్డుకున్నారు. పులివెందులలో 16 వార్డుల్లో, ప్రొద్దుటూరులో 19, కడపలో 54 వార్డులలో నామినేషన్లను అడ్డుకున్నారు. యర్రగుంట్ల, కమలాపురం, రాయచోటిలో చైర్మన్, కౌన్సిలర్ స్థానాలకు నామినేషన్లు పడకుండా టీడీపీ గూండాలు అరాచకం సృష్టించారు. రాజంపేట, బద్వేలులో చైర్మన్ అభ్యర్థులు నామినేషన్లు వేయగా, రాజంపేట, బద్వేలులో వార్డులకు నామినేషన్లు పడలేదు. దర్శిలో చైర్మన్ సహా 25 వార్డులకు నామినేషన్లు పడలేదు. అనంతపురం జిల్లా తాడిపత్రిలో 4 వార్డుల్లో నామినేషన్లను టీడీపీ గూండాలు తమ అరాచకంతో అడ్డుకున్నారు.

# ఎస్ఈసీని కలిసిన వైఎస్ జగన్

విజయవాడ: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాతో భేటీ అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో చోటు చేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై పునేఠాకు ఫిర్యాదు చేశారు. స్థానిక ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో విధ్వంస కాండ, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులపై యథేచ్ఛగా దాడులు, వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడం, నామినేషన్ పేపర్లు చింపివేయడం. లోక్‌సభ పక్షనేత పీవీ మిథున్‌రెడ్డిపై పుంగనూరులో హత్యాయత్నం, పులివెందులలో పోలీసులు గాలిలోకి కాల్పులు, బాష్పవాయు ప్రయోగం తదితర హింసాకాండలపై ఎన్నికల కమిషనర్‌కు వివరించారు.

# బతుకమ్మ.. శ్రమజీవుల జీవన గీతం!

తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వానికి, పర్యావరణ స్పృహకు సమున్నత ప్రతీక బతుకమ్మ పండుగ. తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా సాగే ఈ పూల పండుగ వెనుక కేవలం పౌరాణిక గాథలు, రాచరిక చరిత్రలు మాత్రమే లేవు.. ఈ నేలను నమ్ముకుని, చెమటోడ్చి, సమాజానికి జీవం పోస్తున్న దళిత, బహుజన శ్రమజీవుల సుదీర్ఘ సామాజిక చరిత్ర దాగి ఉంది. బతుకమ్మ అంటే కేవలం ఒక మతపరమైన పూజ కాదు.. అది శతాబ్దాలుగా అణచివేతకు, సామాజిక అసమానతలకు గురైనప్పటికీ, తమ శ్రమ ద్వారా ఈ మట్టిని సజీవంగా ఉంచిన మట్టి బిడ్డల జీవన వేదం. ఒక సామాజిక ఆత్మగౌరవ ఉత్సవం..

### పూల సేకరణ శ్రామికులదే!

బతుకమ్మ పండుగకు వాడే పూలను గమనిస్తే అవి దొరల గడీల తోటల్లోనో, ఖరీదైన గ్రీన్‌హౌస్‌లలోనో పెరిగేవి కావు.. ప్రకృతి సహజ సిద్ధంగా తెలంగాణ గడ్డపై ప్రసాదించిన తంగేడు, గునుగు, కట్ల, పొట్ల, గుమ్మడి, చామంతి, దోస పూలు. ఎండనక, వాననక పొలాల్లో, అడవుల్లో కష్టపడే దళిత, బహుజన బిడ్డలే ఈ పూలను ఏరి తెస్తారు. అణచివేతకు గురైన కులాల చేతుల మీదు గానే ఈ పూల సేకరణ, అమరిక జరుగుతుంది. శ్రమజీవుల స్పర్శతోనే ఆ పూలన్నీ కలిసి 'బతుకమ్మ'గా రూపాం తరం చేందుతాయి.

### బతుకమ్మకు ప్రాణం పోసేదెవరు?

బతుకమ్మను పేరుస్తారే తప్పా, దానికి ప్రాణం పోసేది శ్రమజీవుల సమిష్టి కృషే. వెదురు బుట్టలు అల్లే మేదరి కులం నుంచి, పూలు తెచ్చే ముదిరాజ్, యాదవ కులాలు, బతుకమ్మను పేర్చే మాదిగ, మాల, పద్మశాలి, గౌడ వంటి విభిన్న బహుజన కులాల శ్రమ ఇందులో ఇమిడి ఉంది. శ్రమ విభజన పేరుతో దూరంగా ఉంచబడిన కులాలన్నీ ఈ పండుగ సమయంలో తమ సృజనాత్మకతను, కళా త్మకతను బతుకమ్మ రూపంలో ప్రదర్శిస్తాయి.

### జానపద మూలాల్లోంచి పాటలు..

బతుకమ్మ పండుగలో పాడే పాటలన్నీ జానపద మూలాల నుంచి వచ్చినవే. పొలం పనులకు వెళ్లేటప్పుడు, నాట్లు వేసేటప్పుడు, కోతలు కోసేటప్పుడు శ్రమను మర్చి పోవడానికి దళిత, బహుజన మహిళలు పాడుకునే శ్రమ గీతాలే బతుకమ్మ పాటలుగా మారాయి.. ఈ పాటల్లో గ్రామీణ జీవితాలు, కష్టాలు, ఆకలి, కరువులు, దొరల గడీల పాలనలో అనుభవించిన వెట్టిచాకిరి వేదనలు, కుటుంబ బంధాలు ప్రతిబింబిస్తాయి. ఈ మౌఖిక సాహిత్యమే బతు కమ్మ పండుగను శతాబ్దాలుగా సజీవంగా ఉంచింది.



### శ్రమజీవికి అందుబాటులో ఉండే ఆహారం..

బతుకమ్మకు సమర్పించే తొమ్మిది రకాల నైవేద్యాలను (సద్దులను) పరిశీలిస్తే అవి పూర్తిగా సగటు గ్రామీణ శ్రమజీవికి అందుబాటులో ఉండే ఆహార పదార్థాలే.. అటుకులు, సత్తుపిండి (మొక్కజొన్నలు, జొన్నలు, పెసలతో చేసేది), నువ్వులు, పల్లీలు, బెల్లం వంటి పౌష్టికాహార పదార్థాలను నైవేద్యంగా పెడతారు. నిరంతరం పొలాల్లో శారీరక శ్రమ చేసే బహుజన ముత్తైదువులకు ఇవి తక్షణ శక్తినిచ్చే ఆహారం. తాము నిత్యం తినే నైవేద్యాన్నే ప్రకృతి మాతకు సమర్పించడం ఇక్కడి శ్రమ సంస్కృతికి అద్దం పడుతుంది.

### శ్రామిక మహిళల సామాజిక ఐక్యతా చిహ్నం!

తెలంగాణ చరిత్రలో దొరల, భూస్వాముల గడీల పాలన నడిచిన కాలంలో దళిత, వెనుకబడిన వర్గాల మహిళలపై సామాజికంగా ఎన్నో ఆంక్షలు ఉండేవి. దళిత మహిళలకు కనీస హక్కులు కూడా లేని ఆ కఠినమైన రోజుల్లో, బతు కమ్మ పండుగ నెపంతో ఊరిలోని మహిళలంతా చెరువు గట్టున లేదా మైదానంలో ఒకచోట చేరేవారు. కులాల ఆంక్షలను పక్కనబెట్టి అందరూ కలిసి గుండ్రంగా తిరు గుతూ చప్పట్లు కొడుతూ పాటలు పాడటం అనేది ఆనాటి శ్రమజీవన మహిళల సామాజిక ఐక్యతకు, ఒక రకమైన నిశ్శబ్ద నిరసనకు వేదికగా ఉపయోగపడింది.

### ప్రకృతి పూజకు నిర్వచనం..

బావులను, చెరువులను తవ్వి, వాటిని రక్షించేది మట్టిని నమ్ముకున్న బహుజన కులాలే (ముదిరాజ్, గంగపుత్ర, మాదిగ, మాల వంటి వర్గాలు). వర్షాలు పడి చెరువులు నిండిన తరుణంలో బతుకమ్మలను నీటిలో నిమజ్జనం చేస్తారు. తంగేడు, గునుగు పూలకు నీటిని శుద్ధి చేసే ఔషధ గుణాలు ఉన్నాయి. చెరువు నీరు కలుషితం కాకుం డా, రాబోయే రోజుల్లో తాగునీటికి, సాగునీటికి ఇబ్బంది లేకుండా చూసుకునే శాస్త్రీయ పర్యావరణ విజ్ఞానం ఈ శ్రమజీవుల అనుభవం నుంచే పుట్టింది.

### పల్లెలకు ధైర్యమిచ్చే పాటలే..

బతుకునివ్వమ్మా..బతుకమ్మా అంటూ.. ప్రకృతిని వేడు కొని శ్రమనే నమ్ముకున్న దళిత, బహుజన వర్గాలకు ఈ పండగ ఓ ఉత్సాహం. రెడీమేడ్ పాటలు, డీజే డ్యాన్సులు, ప్లాస్టిక్ పేపర్లతో మోడ్రన్‌గా బతుకమ్మను మార్చి అదో సరదా వేడుకలా మారిపోయిన సమాజానికి బతుకమ్మ అంటే... శ్రమజీవుల గుండెల భరోసా. ప్రకృతి మురిసిపోయే పూల పండగ అని గుర్తు చేస్తూ పల్లె పాటలతో బతుకమ్మను ఆరాధిస్తూ సాగాలి. ప్రకృతిని కొలుస్తూ మన బతుకమ్మ రేపటి భవిష్యత్తుకు చైతన్య స్ఫూర్తిని నింపేలా ఆరాధించాల్సిన అవసరం ఉంది.

# అఫ్గాన్ బాలికలపై తాలిబన్ల పంజా




కాబూల్: అఫ్గాన్‌లో తాలిబన్లు అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళలపై జరుగుతున్న ఆగడాల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. బాలికలతో పాటు మహిళలపై ఎన్నో కఠిన చట్టాలు తీసుకవచ్చి వారి మానవహక్కుల్ని తాలిబన్లు కాలరాస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు ఐక్యరాజ్యసమితి బాలల సంక్షేమ సంస్థ యునిసెఫ్ విడుదల చేసిన నివేదిక ఇప్పుడు ఆందోళన కలిగిస్తోంది. 2021లో తాలిబన్లు అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 26 లక్షల మందికి పైగా బాలికలు మాధ్యమిక విద్యకు దూరమయ్యారని ఐక్యరాజ్యసమితి బాలల సంక్షేమ సంస్థ యునిసెఫ్ వెల్లడించింది. ఐదేళ్లుగా తరగతి గదులకు దూరమైన బాలికలు విద్యతో పాటు మెరుగైన జీవితాన్ని నిర్మించుకునే అవకాశాలను కూడా కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. అఫ్ఘనిస్థాన్‌లో 2021 సెప్టెంబర్ నుంచి బాలికలు ఆరో తరగతి తర్వాత చదువుకోవడంపై నిషేధం అమల్లో ఉంది. 2022 డిసెంబర్ నుంచి మహిళలు విశ్వ విద్యాలయాల్లో ప్రవేశించడంపైనా ఆంక్షలు విధించారు. దీంతో బాలికలకు మాధ్యమిక, ఉన్నత విద్యా అవకాశాలు దాదాపుగా మూసుకుపోయాయి. ప్రపంచంలో బాలికలు, మహిళలకు ఈ స్థాయిలో విద్యను నిరాకరిస్తున్న ఏకైక దేశంగా అఫ్ఘనిస్థాన్ కొనసాగుతోందని యునిసెఫ్ పేర్కొంది. చదువుకు దూరం కావడంతో బాలికలు బాల్యవివాహాలు, బాలకార్మిక వ్యవస్థ, వేధింపులు, దోపిడీ, లింగ ఆధారిత హింస వంటి ప్రమాదాలను ఎదుర్కొనే అవకాశాలు పెరుగుతున్నాయని యునిసెఫ్ హెచ్చరించింది. ముఖ్యంగా పేదరికం, నిరాశ్రయత్వం వంటి పరిస్థితులు ఈ ముప్పులను మరింత తీవ్రం చేస్తున్నాయని తెలిపింది. పాఠశాల అనేది కేవలం విద్యను అందించే కేంద్రం మాత్రమే కాదని, బాలికలకు రక్షణ కల్పించే కీలక వ్యవస్థ అని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో యునిసెఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేథరిన్ రస్సెల్ మాట్లాడుతూ.. ఐదేళ్లు ఒక దేశ చరిత్రలో తక్కువ సమయమే అయినప్పటికీ, ఒక బాలిక జీవితంలో అది అత్యంత కీలకమైన దశ అని పేర్కొన్నారు. తరగతి గది బాలికలకు జ్ఞానాన్ని అందించడమే కాకుండా, తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛను, జీవితంలో ఎదిగే అవకాశాన్ని కల్పిస్తుందని తెలిపారు. పాఠశాలలు మూతపడటంతో బాలికలు విద్యతో పాటు బాల్యవివాహాలు, హింస, దోపిడీ నుంచి రక్షణ పొందే అవకాశాలను కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాలికల విద్యపై ఆంక్షలు అఫ్ఘనిస్థాన్ ఆర్థిక వ్యవస్థపైనా తీవ్ర ప్రభావం చూపుతున్నాయని యునిసెఫ్ వెల్లడించింది. 2030 నాటికి దేశం సుమారు 20 వేల మంది మహిళా ఉపాధ్యాయులను, 5,400 మంది మహిళా ఆరోగ్య కార్యకర్తలను కోల్పోయే ప్రమాదం ఉందని 2026 ఏప్రిల్‌లో విడుదల చేసిన విశ్లేషణలో అంచనా వేసింది. ప్రాథమిక విద్యలో మహిళా ఉపాధ్యాయుల సంఖ్య 2022లో దాదాపు 73 వేలుగా ఉండగా, 2024 నాటికి 66 వేలకు పడిపోయింది. ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ మహిళల ప్రాతినిధ్యం తగ్గుముఖం పట్టింది. మహిళల విద్య, ఉపాధిపై ఆంక్షల కారణంగా అఫ్ఘనిస్థాన్ ఏటా సుమారు 8.4 కోట్ల అమెరికన్ డాలర్ల ఆర్థిక ఉత్పత్తిని కోల్పోతోందని యునిసెఫ్ అంచనా వేసింది. ఆంక్షలు కొనసాగినకొద్దీ ఈ నష్టాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించింది. మహిళలకు విద్య, ఉపాధి అవకాశాలు తగ్గిపోవడం దేశ అభివృద్ధిని దీర్ఘకాలంలో దెబ్బతీస్తుందని విశ్లేషించింది. ఈ ఆంక్షల ప్రభావం భవిష్యత్తు తరాలపైనా పడే అవకాశం ఉందని యునిసెఫ్ తెలిపింది. విద్యకు దూరమైన మహిళలు తల్లులైనప్పుడు వారి పిల్లల్లో తక్కువ బరువుతో జన్మించడం, టీకాలు పూర్తిస్థాయిలో అందకపోవడం, ఎదుగుదల మందగించడం వంటి సమస్యల ముప్పు పెరగవచ్చని వివరించింది. ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న అఫ్ఘనిస్థాన్ ఆరోగ్య వ్యవస్థపై ఇది మరింత భారాన్ని మోపవచ్చని హెచ్చరించింది. 2023 నుంచి ఇరాన్, పాకిస్థాన్ నుంచి 27 లక్షల మందికి పైగా అఫ్ఘనిస్థాన్‌కు తిరిగి రాగా, వారిలో 60 శాతం మంది పిల్లలు, యువతేనని నివేదిక పేర్కొంది. విద్య అనేది బాలికల హక్కు మాత్రమే కాదు.. వారి ఆత్మగౌరవానికి, స్వావలంబనకు, భద్రమైన భవిష్యత్తుకు పునాది. అఫ్ఘన్ బాలికలకు విద్యా ద్వారాలు మూసుకుపోవడం వారి జీవితాలనే కాకుండా దేశ ఆర్థిక ప్రగతిని, రాబోయే తరాల ఆరోగ్యాన్ని సైతం ప్రభావితం చేసే ప్రమాదం ఉందని యునిసెఫ్ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

# సర్వీస్ రికార్డు.. ఇక డిజిటలైజేషన్

**పోస్టులో చేరిక మొదలు... పదవీ విరమణ వరకు వివరాలు ఆన్‌లైన్‌లో**
**బదిలీలు, పదోన్నతులు, సెలవులు, ఇతరాలన్నీ కంప్యూటరీకరణ**
**అన్ని ప్రభుత్వ శాఖల్లో ఈ-హెచ్‌ఆర్‌ఎంఎస్ అమలుకు ఉత్తర్వులు**
**మాన్యువల్ పద్ధతిలోని సేవా వ్యవహారాల్లో జాప్యానికి చెక్**



హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగుల సర్వీస్ రికార్డును డిజిటలైజేషన్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సర్వీసు రికార్డుల నమోదులో జాప్యానికి చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేసేందుకు ఉపక్రమించింది. ఉద్యోగిగా చేరిక మొదలు, సెలవులు, ఇంక్రిమెంట్లు, బదిలీలు, పదోన్నతులు, విధి నిర్వహణలో పొరపాట్లు, చట్టపరమైన చర్యలు, కేసులు, పదవీ విరమణ ఇలా అన్నింటినీ డిజిటల్ విధానంలోకి తీసుకురానుంది. తెలంగాణ ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం(టీఐఎఫ్ఎంఐఎస్)లో భాగమైన ఎలక్ట్రానిక్ మానవ వనరుల నిర్వహణ వ్యవస్థ (ఈ--హెచ్‌ఆర్‌ఎంఎస్)ను అన్ని ప్రభుత్వ శాఖల్లో అమలు చేయనుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు శనివారం జీవో 141 జారీ చేశారు. ప్రస్తుతం ఉద్యోగుల సర్వీస్ రికార్డులన్నీ మాన్యువల్ పద్ధతిలోనే నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో వివిధ సేవా సంబంధిత వ్యవహారాల పరిష్కారంలో జాప్యం జరుగుతోంది. ఏళ్లకుఏళ్లుగా సమాచారాన్ని అందులో ఎంట్రీ చేయడం లేదు. పదోన్నతులు, బదిలీల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పెండింగ్ వ్యవహారాలపై సమగ్ర పర్యవేక్షణ కూడా కొరవడుతోంది. ఈ సమస్యలకు పరిష్కారంగా అన్ని శాఖలకు ఒకే విధమైన సమీకృత డిజిటల్ వ్యవస్థను అందుబాటులోకి తెస్తోంది.

### ప్రతి ఉద్యోగికి డిజిటల్ సర్వీస్ రిజిస్టర్

ఈ--హెచ్‌ఆర్‌ఎంఎస్ ద్వారా ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ధ్రువీకరించిన డిజిటల్ సర్వీస్ రిజిస్టర్ నిర్వహిస్తారు. ఆయా అంశాలకు సంబంధించిన మాడ్యూళ్లు అందుబాటులోకి వచ్?చన మేరకు దరఖాస్తుల నమోదు, పరిశీలన, ఆమోదం, పరిష్కారం.. అన్నీ ఆన్‌లైన్ విధానంలోనే సాగుతాయి. దీంతో ఏ ఉద్యోగికి సంబంధించిన వ్యవహారం ఏ దశలో ఉందో తెలుసుకోవడంతోపాటు, పెండింగ్ కేసులను గుర్తించి వాటి పరిష్కారాన్ని పర్యవేక్షించే అవకాశం ఉంటుంది. అలాగే, పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతాయని ప్రభుత్వం భావిస్తోంది.

### అధికారులదే డేటా బాధ్యత

సచివాలయ శాఖలు, శాఖాధిపతుల కార్యాలయాలు, జిల్లా కార్యాలయాలు, డివిజినల్, కింది స్థాయి ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలో ఈ విధానాన్ని అమలు చేయాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఉద్యోగుల వివరాలను పూర్తిగా, ప్రామాణికంగా నమోదు చేసే బాధ్యత సంబంధిత పరిపాలనా శాఖలు, శాఖాధిపతులు, డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారుల(డీడీఓ)పై ఉంటుంది. అమలును వేగవంతం చేయడంతోపాటు, తమ పరిధిలోని కార్యాలయాల్లో ఈ విధానాన్ని పర్యవేక్షించాలని శాఖాధిపతులను ఆదేశించింది. జిల్లాల వారీగా ట్రెజరీ, పే అండ్ అకౌంట్స్ కార్యాలయాల నోడల్ అధికారులను నియమించారు. జిల్లాస్థాయిలో పరిష్కారం కాని సమస్యలను ఐఎఫ్ఎంఐఎస్ సహాయ కేంద్రం 7042420033 నంబర్‌కు తెలియజేయొచ్చు. ఈ ప్రక్రియ అమలును ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి సిక్తా పట్న?నయక్ పర్యవేక్షిస్తారు. డిజిటల్ విధానం అమలు చేస్తున్నప్పటికీ ఇప్పటికే ఉన్న సర్వీస్ నిబంధనలు, అధికారుల పరిధులు, అప్పగించిన అధికారాల్లో ఎలాంటి మార్పు ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## హైకోర్టులో వైఎస్సార్‌సీపీ హౌస్ మోషన్ పిటిషన్




తాడేపల్లి: పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తీవ్ర ఉత్కంఠకు దారితీసింది. పుంగనూరులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడంపై పార్టీ అధిష్టానం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో, అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలని, పోలీసు రక్షణ కల్పించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేసింది. ఈ వివాదంపై తిరుపతిలో రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల పోటీపై ఎట్టి పరిస్థితుల్లోనూ వెనక్కి తగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. అధికార పార్టీ అడ్డంకులు సృష్టించినా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల బరిలో నిలిచి తీరుతామని వెల్లడించారు. 'పుంగనూరు మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీ చేయడంపై వైఎస్సార్‌సీపీ ఎక్కడా రాజీ పడదు. ఇది మా అభ్యర్థుల హక్కు. నామినేషన్ల ప్రక్రియలో అక్రమాలను అడ్డుకోవడానికి, మా అభ్యర్థుల న్యాయమైన హక్కులను కాపాడటానికి ఎంతటి న్యాయ పోరాటానికైనా మేము సిద్ధం'అని ప్రకటించారు.ం

## ఏపీలో ఎమర్జెన్సీ రోజులు తలపిస్తున్నాయి: పెద్దిరెడ్డి



తిరుపతి: రాష్ట్రంలో ఎమర్జెన్సీ రోజులు తలపిస్తున్నాయని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మండిపడ్డారు. పోలీసులతో నామినేషన్లు అడ్డుకుంటున్నారని.. దేశంలో ఎక్కడ ఇలాంటి ఘటనలు జరగలేదని పెద్దిరెడ్డి అన్నారు. ఈ కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. నామినేషన్లు చివరి రోజు కూటమి ప్రభుత్వం కుట్రలకు తెరతీసింది. చివరి రోజు కావడంతో నామినేషన్లు వేయకుండా పోలీసులతో కూటమి సర్కార్ కట్టడి చేస్తోంది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి పోలీసులు నోటీసులు ఇచ్చారు. మారుతీ నగర్‌లో నోటీసులు ఇచ్చిన సదుం పోలీసులు.. ఇంటి నుంచి పుంగనూరుకు వెళ్ళొద్దంటూ నోటీసులో పేర్కొన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి కుడా పోలీసులు నోటీసులు ఇచ్చారు. మిథున్ రెడ్డి మాట్లాడుతూ.. నామినేషన్లు వేయడానికి క్లియరెన్స్ సర్టిఫికెట్ కోసం అప్లై చేసిన ప్రతి ఒక్కరిని కేసుల్లో ఇరికించారు. మా నాయకుడు వైఎస్ జగన్ నియోజకవర్గం పులివెందులలో కూడా నామినేషన్లు అడ్డుకుని దౌర్జన్యం చేస్తున్నారంటూ ఆయన మండిపడ్డారు. "పుంగనూరు నుంచి పులివెందుల వరకు ఇదే పరిస్థితి. టీడీపీకి సత్తా ఉంటే ఎన్నికల్లో పోటీ చేసి గెలవాలి.. ఇలాంటి అరాచకాలకు పాల్పడకూడదు. అధికారులు ఆలోచించుకోవాలి. ఎన్నికల అధికారులు విచారణ చేస్తే మీరే ఇబ్బందులు పడతారు, అధికారులు బలి కావద్దు. ఈ ప్రభుత్వం ఎల్లకాలం ఉండదు. టీడీపీ ప్రభుత్వానికి మిగిలింది ఒక రెండేళ్లు మాత్రమే. అధికారులను వాడుకుని.. గూండాలను తరలించి గొడవలు చేస్తున్నారు. ఈ ప్రభుత్వం పతనానికి నాంది మొదలయ్యింది" అని మిథున్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఇరాన్ కీలక నిర్ణయం.. రక్షణ మంత్రి నియామకం



టెహ్రాన్: పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్‌కు కలిగిన నష్టం గురించి ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అమెరికా, ఇజ్రాయెల్ జరిగిన సంయుక్త దాడిలో తొలిరోజే ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా ఖమేనీతో పాటు పలువురు అగ్రనేతలు మృతిచెందారు. వారిలో ఆ దేశ రక్షణమంత్రి సైతం ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆయన మరణించిన ఎనిమిది నెలల తర్వాత ఆ స్థానంలో ఇరాన్ రక్షణమంత్రిని నియమించింది. ఆ దేశ రక్షణమంత్రిగా మెహర్‌దాద్ అఖ్లాఘీని నియామకానికి ఈరోజు (ఆదివారం) జరిగిన విశ్వాస తీర్మానం ద్వారా ఆమోదం లభించింది. ప్రభుత్వ వెబ్‌సైట్ ప్రకారం మొత్తం 277 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా అఖ్లాఘీకి అనుకూలంగా 237 ఓట్లు వచ్చాయి. గతంలో రక్షణ మంత్రిగా పనిచేసిన అజీజ్ నాసిర్జాదే స్థానంలో అఖ్లాఘీ నియమితులయ్యారు. పార్లమెంట్‌లో ఓటింగ్‌కు ముందు అఖ్లాఘీ మాట్లాడుతూ, "నాకు పార్లమెంట్ విశ్వాస తీర్మానం ద్వారా ఆమోదం లభిస్తే, ఈ కీలకమైన సమయంలో రక్షణ మంత్రిత్వ శాఖ బాధ్యతలు నా చేతుల్లోకి వస్తాయి. ఇలాంటి పరిస్థితుల్లో దేశాన్ని రక్షించాలంటే ప్రస్తుత పరిస్థితులపై కచ్చితమైన అవగాహన ఉండాలి. పరిణామాల వెనుక ఉన్న తర్కాన్ని అర్థం చేసుకోవాలి. ప్రభావం చూపే ధోరణులను గుర్తించాలి. భవిష్యత్తులో ఎదురయ్యే వివిధ అవకాశాలు, పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి" అని అఖ్లాఘీ పేర్కొన్నారు. అఖ్లాఘీకి గతంలో సైనిక హోదా లేకపోయినప్పటికీ, ఆయనకు రక్షణ రంగంలో సుదీర్ఘ అనుభవం ఉంది. గత 42 ఏళ్లుగా ఇరాన్ రక్షణ మంత్రిత్వ శాఖలో పనిచేస్తున్నారు. అంతేకాకుండా, ప్రభుత్వ ఆధ్వర్యంలో ఆయుధాలను తయారు చేసే సంస్థ అయిన ఇరాన్ డిఫెన్స్ ఇండస్ట్రీస్ ఆర్గనైజేషన్‌కు 2013 నుంచి అధిపతిగా వ్యవహరిస్తున్నారు.

## భారత్ విమానాలపై.. పాక్ కీలక నిర్ణయం



ఇస్లామాబాద్: పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఆ దేశ గగనతలం మీదుగా భారత విమానాలు ప్రయాణించడంపై విధించిన నిషేధాన్ని మరో నెల రోజుల పాటు పొడిగించింది. ఈ నిషేధం 2026 నవంబర్ 24 వరకు అమలులో ఉండనున్నట్లు ప్రకటించింది. భారతదేశంలో రిజిస్టర్ అయిన విమానాలతో పాటు, భారతీయ విమానయాన సంస్థలకు చెందిన, ఆ సంస్థలు నిర్వహించే లేదా లీజుకు తీసుకున్న విమానాలకూ ఈ నిషేధం వర్తిస్తుంది. అదే విధంగా సైనిక విమానాలకు ఈ ఆంక్షలు వర్తిస్తాయని పేర్కొంది. పహల్గామ్ ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణి?ంచాయి.ఈ దాడిలో పాకిస్థాన్ ప్రమేయం ఉందని భారత్ ఆరోపించింది. అయితే, ఆ ఆరోపణలను పాకిస్థాన్ తిరస్కరించింది. ఈ ఘటన అనంతరం ఇరు దేశాల మధ్య దౌత్యపరమైన, సైనికపరమైన ఉద్రిక్తతలు తీవ్రంగా పెరిగాయి. ఈ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత విమానాలపై పాక్ తొలిసారిగా 2025 ఏప్రిల్ 23న ఈ ఆంక్షలను విధించింది. అప్పటి నుంచి భారత్, పాకిస్థాన్‌ల మధ్య కొనసాగుతున్న ఉద్రిక్త సంబంధాల నేపథ్యంలో పాకిస్థాన్ ఎప్పటికప్పుడు ఈ నిషేధాన్ని పొడిగిస్తూ వస్తోంది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య 2025 ఏప్రిల్‌లో పరస్పర గగనతల ఆంక్షలు ప్రారంభమయ్యాయి. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంలోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడి అనంతరం ఇరు దేశాలు ఒకదానికొకటి చెందిన విమానాలపై ఆంక్షలు విధించాయి. పాకిస్థాన్ తన గగనతలాన్ని భారత విమానాలకు మూసివేసిన నేపథ్యంలో, దానికి ప్రతిస్పందనగా భారత్ కూడా 2025 ఏప్రిల్ 30న పాకిస్థాన్ విమానయాన సంస్థలకు తన గగనతలాన్ని మూసివేసింది. భారత్, పాకిస్థాన్‌ల మధ్య కొనసాగుతున్న ఈ గగనతల ఆంక్షల ప్రభావం విమానయాన కార్యకలాపాలపై పడుతోంది. ముఖ్యంగా కొన్ని అంతర్జాతీయ విమానాలు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాల్లో, ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో విమానయాన సంస్థల కార్యకలాపాలపై ప్రభావం పడుతోంది.

# ప్రపంచంలో 64.5 కోట్లమందికి ఆకలి బాధ

### వృథా అయిన ఆహారం వందకోట్ల టన్నులు
### ప్రపంచ ఆర్థికవ్యవస్థకు రూ.90 లక్షల కోట్ల నష్టం
### ఐక్యరాజ్యసమితి ఎఫ్ఏవో 2025 నివేదిక వెల్లడి



అమరావతి: ఒకవైపు ఆకలి కేకలు.. మరోవైపు చెత్తలోకి గుట్టలుగుట్టలుగా పారబోస్తున్న ఆహారం.. ఇదీ ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న పరిస్థితి. ఐక్యరాజ్య సమితికి చెందిన ఆహార, వ్యవసాయ విభాగం (ఎఫ్ఏవో) 2025 సంవత్సరానికి సంబంధించిన లెక్కలతో విడుదల చేసిన తాజా నివేదిక ఈ అంశాన్ని మరోసారి ప్రముఖంగా ప్రస్తావించింది. ఆహారాన్ని వృథాచేయడం వల్ల పేదప్రజలు ఆకలితో అలమటిస్తుండటంతోపాటు ప్రపంచ ఆర్థికవ్యవస్థకు తీవ్రనష్టం కలిగిస్తోందని ఆ నివేదిక పేర్కొంది. ఆ నివేదికలోని ప్రధాన అంశాలు ఇవీ..

### ఆకలి కేకలు

' ప్రపంచవ్యాప్తంగా 2025లో 64.5 కోట్లమంది ఆకలితో బాధపడ్డారు. ప్రతి 13 మందిలో ఒకరికి ఆహారం దొరకలేదు.

' కోవిడ్ వ్యాప్తితో ఆకలి బాధితుల సంఖ్య విపరీతంగా పెరిగింది. 2019లో ప్రపంచంలో ఆకలి బాధితులు 61 కోట్లమంది ఉండేవారు.

' గత మూడేళ్లుగా ప్రపంచంలో ఆకలి బాధితుల సంఖ్య క్రమంగా తగ్గుముఖం పడుతోంది. 2022లో 8.6 శాతం ఉన్న ఆకలి బాధితుల సంఖ్య 2024లో 8.1 శాతానికి, 2025లో 7.8 శాతానికి తగ్గింది. కానీ కోవిడ్ వ్యాప్తికి ముందున్న స్థితికి ఇంకా చేరుకోలేదు.

' ఆఫ్రికా ఖండంలో ఆకలి బాధితులు ఎక్కువగా ఉన్నారు. ఆ ఖండంలో 30.9 కోట్లమంది పౌష్టికాహార లోపంతో బాధపడుతున్నారు. ప్రతి అయిదుగురిలో ఒకరు ఆకలి బాధితులే. ఆసియా ఖండంలో 29.2 కోట్లమంది, లాటిన్ అమెరికా దేశాలు, కరేబియన్ దీవుల్లో 3.2 కోట్లమంది కనీస ఆహారానికి నోచుకోవడం లేదు.

' 8 దేశాల్లో ఆకలి బాధ అత్యంత ఆందోళనకరంగా ఉంది. వాటిలో 7 దేశాలు ఆఫ్రికా ఖండంలోనే ఉన్నాయి. మొదటి స్థానంలో సోమాలియా ఉంది.

ఆహారం వృథా

' ప్రపంచవ్యాప్తంగా ఆహారం భారీగా వృథా అవుతోంది. 2025లో వందకోట్ల టన్నుల ఆహారం వృథా అయింది.

' ఆహార ఉత్పత్తుల్లో 13 శాతం దుకాణాలకు చేరడానికి ముందే.. స్టోరేజ్, రవాణా, ఫుడ్ ప్రాసెసింగ్ తదితర ప్రక్రియల్లో వృథా అవుతోంది. దీనివిలువ రూ.37.94 లక్షల కోట్లు కావడం విభ్రాంతి కలిగిస్తోంది.

' ఇక దుకాణాలు, రెస్టారెంట్లు, కుటుంబాలు ఐదో వంతు ఆహారాన్ని చెత్తబుట్టలో పారబోస్తున్నాయి. దీన్లో కుటుంబాల వాటా 60 శాతం కాగా రెస్టారెంట్లు, దుకాణాలు 28 శాతం, ఇతరత్రా 12 శాతం.

' ప్రపంచంలో ప్రతి వ్యక్తి ఏటా సగటున 132 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నారు. అందులో 79 కిలోల వృథా

### ఇంటివద్దే.

' ఆహార వృథాలో మాల్దీవులు మొదటి స్థానంలో, స్పెయిన్ చివరి స్థానంలో ఉన్నాయి. మాల్దీవుల్లో ప్రతి వ్యక్తి ఏటా సగటున 260 కిలోల ఆహారాన్ని వృథా చేస్తున్నారు. స్పెయిన్‌లో ప్రతి వ్యక్తి ఏటా సగటున 39 కిలోలను వృథా చేస్తున్నారు.

' వృథా చేస్తున్న ఆహారంతో ప్రపంచ ఆర్థికవ్యవస్థ ఏటా రూ.90 లక్షల కోట్లు నష్టపోతోంది.

' ప్రపంచంలో 28 శాతం సాగుభూమిలో పండిస్తున్న పంట వృథా అవుతోంది.

' ఆహార వృథా ప్రపంచంలో దాదాపు 8 శాతం కాలుష్యానికి కారణమవుతోంది.

# లాకప్ హత్యపై భేషైన తీర్పు!




ఎన్డీయే కూటమి ఏలుబడిలో ఆంధ్రప్రదేశ్ చిత్రహింసల కొలిమిగా మారిన నేపథ్యంలో మొన్న మే నెలలో పోలీసు యమకింకరుల చేతుల్లోబడి మాయమైన 25 ఏళ్ల యువకుడు గాదె సాయికృష్ణ అదృశ్యం కేసును సీబీఐకి అప్పగిస్తూ రాష్ట్ర హైకోర్టు శుక్రవారం ఇచ్చిన ఆదేశం హర్షించదగింది. దీంతోపాటు సాయికృష్ణ తల్లి విజయలక్ష్మికి నాలుగు వారాల్లోపు రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని కూడా ధర్మాసనం ఆదేశించింది. కాపుల మద్దతు పుష్కలంగా ఉన్నదని చెప్పుకునే జనసేనతో కలిసి ప్రభుత్వాన్ని నడుపుతూ అదే కులానికి చెందిన యువకుణ్ణి విజయవాడ కృష్ణలంక పోలీసులు లాకప్‌లో కొట్టి చంపి, బూడిద కూడా మిగలకుండా చేశారంటే వారి బరితెగింపు ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. తన కుమారుణ్ణి మొన్న మే నెల మొదటి వారంలో అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్లో తీవ్రంగా హింసిస్తున్నారని తెలిసి, రోజుల తరబడి తల్లి స్టేషన్ చుట్టూ తిరిగారు. పోలీసు అధికారుల కాళ్లావేళ్లా పడ్డారు. ఈ క్రమంలో ఒకరోజు సాయికృష్ణ ఆర్తనాదాలు వినబడి పరుగున వెనక్కివెళ్లి విలపించారు. అయినా వాళ్లు కనికరించలేదు. 'కనీసం బూడిదైనా ఇస్తే అంత్యక్రియలు చేసుకుంటాం...' అని అడిగినా జవాబిచ్చే దిక్కులేదు. చివరకు సీబీఐ దర్యాప్తు కోరుతూ ఆమె హైకోర్టును ఆశ్రయిస్తే... ఆ తల్లిని ఏమార్చటానికి కోర్టు వెలుపల ఎన్ని ప్రయత్నాలు జరిగాయో జనమంతా చూశారు. ఏపీ పోలీసులకేమైంది? కొట్టి చంపి, శవాన్ని మాయం చేసేంత అపరాధం ఆ యువకుడు ఏం చేశాడు? చట్టప్రకారం అరెస్టు చేసిన వారిని 24 గంటల్లో సమీప మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచాలి. కానీ బాబు ఏలుబడిలో ఇది సక్రమంగా అమలైంది లేదు. ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్తలపైనా, నాయకులపైనా అక్రమ కేసులు పెట్టిఅరెస్టు చేయడం, రోజుల తరబడి అక్రమ నిర్బంధంలో ఉంచటం, బెయిలొస్తే వేరే కేసులో తిరిగి నిర్బంధంలోకి తీసుకోవటం రివాజుగా మారింది. చివరకు కూటమి పాలన అవకతవకలపై పోస్టులు పెట్టే సాధారణ జనాన్ని కూడా వదలడం లేదు. వేలమందిగూండాలనూ, రౌడీలనూ వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుల ఇళ్లపై దాడులకు పంపడం, చేయాల్సిన విధ్వంసమంతా పూర్తయ్యాక పోలీసులు బాధితులనే అరెస్టుచేయడంబాబు తీసుకొచ్చిన దుష్ట సంప్రదాయం. ఈ వాతావరణమే పోలీసులకు ధైర్యాన్నిచ్చింది. తమను అడిగేవాడు లేడని విర్రవీగే స్థాయికి చేర్చింది. వాస్తవానికి పోలీసు ఆగడాలకు బలైంది సాయికృష్ణ మాత్రమే కాదు... వారి చిత్రహింసలకు తాళలేక తనువు చాలిస్తున్నానంటూ దళిత యువకుడు క్రాంతికుమార్ వీడియోలో ప్రకటించి మరీ ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందూ, ఆ తర్వాతా గంగమ్మ, తిరుపతమ్మ అనే మహిళల్ని సైతం లాకప్‌లో కొట్టి చంపినట్టు ఆరోపణలొచ్చాయి. మరో మహిళ కళావతి కూడా వీరి వేధింపులవల్లే ఆత్మహత్య చేసుకున్నదని కథనాలు వచ్చాయి. ఇలా పలువురు మరణించిన సందర్భాలున్న నేపథ్యంలో కేవలం సాయికృష్ణ అదృశ్యంపై సీబీఐ దర్యాప్తు చేస్తే సరిపోదు. మిగిలిన కేసుల్ని సైతం ఈ దర్యాప్తు పరిధిలోకి చేర్చాలి. అప్పుడు మాత్రమే ఈ ధోరణి కాస్తయినా తగ్గుతుంది. నారా వారి ఏలుబడి ముందూ మునుపూ కూడా ఇలాగే ఉంది. ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో నక్సలైట్లను అణచే పేరిట తెలంగాణ పల్లెల్లో యువకుల్ని మాయం చేయటం, ఎన్‌కౌంటర్లలో హతమార్చటం, చట్టబద్ధమైన ఉద్యమాలపై కత్తిగట్టి ప్రైవేటు ముఠాల్ని ప్రోత్సహించి హత్యలు చేయించటం ఆ కాలంలో నిత్యకృత్యం. ఈ ప్రతీకార వాతావరణంలోనే అలిపిరి దగ్గర చంద్రబాబుపై హత్యాయత్నం జరిగింది. చిత్రమేమంటే దీనివల్ల సానుభూతి వెల్లువెత్తుతుందని భ్రమించి ఎన్నికలకు పోతే జనం టీడీపీని మాత్రమే కాదు... జాతీయ స్థాయిలో టోకున ఎన్డీయే కూటమిని చిత్తుగా ఓడించారు. 'పీడకు పిశాచం తోడైనట్టు...' ఇప్పుడు కొడుకు చేతికందిరావటంతో ఆ అరాచకాలు మరిన్నిరెట్లు పెరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ఎంపీ గురుమూర్తి ఈ కేసుకు సంబంధించిదాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు గత నెలలో ఆందోళన వ్యక్తం చేసింది. సీబీఐ దర్యాప్తు వేగవంతంగా పూర్తయి దోషులకు కఠిన శిక్షలు పడితేనేఈ మాదిరి అరాచకాలు ఆగుతాయి.

# జెన్ జీ భాష.. క్షీణతా.. పరిణామమా?

భాష అన్నది ఒక నది. పుట్టిన చోట రాయిని రాయిని తాకుతూ, ఒంపులు తిరుగుతూ, ప్రతి తరం గట్టునా పాత ఇసుకను వదిలిపెడుతూ కొత్త ఇసుకను మోస్తూ, ప్రవహిస్తుంది. ఈ తరం పిల్లల నోళ్లలోని బ్రూ, వైబ్, 'లోకీ' రిజ్, సిగ్మా, ఫింగర్ హార్ట్, ఆరా.. ఇవన్నీ ఆ కొత్త ఇసుక రేణువులే.. పెద్దలకు ఇది అరాచకంలా, భాషా క్షీణతలా కనిపిస్తుంది. కానీ నిజంగా ఇది క్షీణతేనా, లేక నది తనకు తానే చెక్కుకుంటున్న కొత్త దారేనా? తాతలు మన తండ్రుల ఇంగ్లీషు కలగలిసిన తెలుగును చూసి భయపడ్డారు.. మన తండ్రులు మనం మాట్లాడే హైబ్రి డ్ తెలుగును చూసి అదే భయపడ్డారు. ఇప్పుడు మనం జెన్ జీ సంక్షిప్త పదాలను, ఎమోజీలను, మీమ్‌లను సంజ్ఞలను భాషగా కాకుండా భాషకు వచ్చిన జ్వరంగా చూస్తున్నాం. కానీ ప్రతి భయమూ తాత్కాలికం, మార్పు శాశ్వతం.

### సంజ్ఞలు, మీమ్‌లతో కమ్యూనికేషన్..

జెన్ జీ తన భావాలను వ్యక్తీకరించడానికి పొడవైన వ్యాసాలు, ప్రసంగాల కన్నా మీమ్‌లను, సంజ్ఞలను, స్లాంగ్‌ను ఒక శక్తివంతమైన సాధనంగా మార్చుకుంది. ఇందులో ఒక కొత్తదనం ఉంది. 'పీస్ సైన్' కేవలం చిహ్నం కాదు, అది ఒక వైఖరి. 'హార్ట్ హ్యాండ్స్' కేవలం ఫోటో పోజు కాదు, అది ఒక ఉద్యమం పట్ల మద్దతు, ఐక్యతకు సంకేతం. ఒక చిత్రం, ఒక సంజ్ఞ ద్వారా సమాచారాన్ని వేగంగా అందించడం. ఇది మెయిన్ క్యారెక్టర్ ఎనర్జీతో బతికే, డిజిటల్ యుగంలో పెరిగిన తరం జీవనశైలికి అనుగుణంగా ఏర్పడిన కొత్త వ్యాకరణం భాషా పరిణామం జీవ పరిణామం లాంటిది.

### అనుభవం కాదు.. వేగం ప్రధానం!

ఇక్కడే లోతైన వేదన దాగి ఉంది. పాత తరాల భాషా మార్పులు నెమ్మదిగా, జీవన అనుభవం నుంచి పుట్టేవి - వ్యవసాయం నుంచి పరిశ్రమకు, గ్రామం నుంచి పట్టణానికి జరిగిన ప్రయాణపు గుర్తులు అవి. కానీ నేటి మార్పు వేగం వేరు.. ఇది జీవితం నుంచి కాదు, తెరల నుంచి పుడుతోంది. ఒక సెకనులో పుట్టి, ఒక వారంలో ప్రపంచమంతా వ్యాపించి, ఒక నెలలో లివింగ్ రెంట్ ఫ్రీగా మనసుల్లో ఉండిపోయి, మరిచిపోయే పదాలు.. ఇందులో వేళ్లు లేవు, అనుభవపు లోతు లేదు, కేవలం వేగం ఉంది.

ఎమోజీలకే పరిమితమైన ఫీలింగ్స్!

భాష అంటే కేవలం పదాలు కావు.. ఆలోచించే విధానం. భాష



సంక్షిప్తమైనప్పుడు, ఆలోచన సంక్షిప్తమవుతుందేమో అనే భయం సహజం. నో క్యాప్ అంటే నిజం చెప్పడం, కానీ ఆ వెనుక ఉండే భావోద్వేగపు లోతు, వాక్యనిర్మాణపు సౌందర్యం కనుమరుగవుతున్నాయా? ఒక తరం తన బాధను, ప్రేమను, కోపాన్ని కేవలం ఒక ఎమోజీతో వ్యక్తం చేయడం మొదలుపెడితే, తన అంతరంగాన్ని లోతుగా తవ్వుకునే అలవాటును కోల్పోతుందేమో అని భయం కలుగుతుంది. ఎమోజీ కన్నీటిని, సంక్షిప్త పదం కవితను పూర్తిగా మోయలేదు. మనసు డెలులు కాకూడదంటే, మాటలు లోతును వదులుకోకూడదు.. సంక్షిప్తత అనేది ఎప్పుడూ లోతుకు శత్రువు కాదు. సంస్కృతంలో సూత్ర శైలి, జపాన్‌లో హైకు కవిత్వం - ఇవి కొన్ని పదాల్లో అనంతమైన అర్థాన్ని మోసిన ఉదాహరణలు..

### భాష ఓ ఆయుధం, గుర్తింపు!

ముందు తరాలలో భాషా మార్పు రేడియో, సినిమా, టీవీ, పత్రికలు మాధ్యమాల ద్వారా వచ్చేది. కానీ జెన్ జీ భాష అనేక మాధ్యమాల ద్వారా- ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, టిక్‌టాక్, డిస్కార్డ్, గేమింగ్ చాట్‌ల ద్వారా పుడుతోంది. ఇక్కడ ప్రతి యువకుడూ భాషను సృష్టించేవాడే, వ్యాప్తి చేసేవాడే, మార్చేవాడే, అందుకే ఈ మార్పు వేగం ఇంత ఎక్కువ, తీవ్రత ఇంత లోతు. ఈ తరం భాషను ఒక ఆయుధంగా, ఒక గుర్తింపుగా మలుచుకుంటోంది. పెద్దలకు అర్థం కాని భాష మాట్లాడటం ద్వారా వాళ్లు తమకంటూ ఒక ప్రత్యేక ప్రపంచాన్ని నిర్మించుకుంటున్నారు. వేగంగా మారే ప్రపంచంలో, తమ గుర్తింపును కాపాడుకోవడానికి వాళ్లు కనిపెట్టుకున్న కొత్త కవచం ఇది.

### ప్రధాన స్రవంతిలోకి జెన్ జీ భాష!

ఈ కవచం ఇప్పుడు వీధుల్లోకి, చట్టసభల్లోకి కూడా వచ్చింది. ఢిల్లీలో జరిగిన ఒక నిరసనలో పోలీసులు జెన్ జీ యువకులు ఉపయోగించిన సంజ్ఞలు, స్లాంగ్‌ను అర్థం చేసుకోలేకపోయారు. అదే సమయంలో లోక్‌సభలో 'ఫోమో', 'కుచ్చు- పుచ్చు' వంటి పదాలు ఎంపీల చర్చల్లో వినిపించాయి. ఇది తరాల మధ్య కమ్యూనికేషన్ గ్యాప్‌ను చూపి స్తూనే, ఈ భాష ప్రధాన స్రవంతిలోకి ఎంత వేగంగా ప్రవేశిస్తోందో కూడా చెబుతోంది. నిన్నటి వరకు వ్యక్తిగత చాట్‌లకే పరిమితమైన సంజ్ఞలు, ఈరోజు సామాజిక ఉద్యమాల, రాజకీయ చర్చల భాషగా మారుతున్నాయి. ఇది కేవలం ట్రెండ్ కాదు, ఒక తరం తన ప్రతిభను, ఆవేదనను, సామాజిక చైతన్యాన్ని వ్యక్తపరచడానికి ఎంచుకున్న వేదిక.

### మానవ తపనను మోస్తున్న జెన్ జీలు..

జెన్ జీ మాటల్లో గోట్ అంటే మేక కాదు, షీప్ అంటే గొర్రె కాదు. జెన్ జీ భాషలో అంకెలు, అక్షరాలు కూడా పదాలే, డబ్ల్యూ (విన్), మైండ్ యువర్ పి అండ్ క్యూ, 6,7 లాంటివి. ప్రతి అంకెకు అక్షరానికి కూడా విస్తృతమైన అర్థాలు ఉన్నాయి. జెన్ జీ మాటలు మానవ తపనను మోస్తున్నాయి - అర్థమవ్వాలని, అనుసంధానం కావాలని, ప్రేమించాలని, ప్రేమించబడాలని. మాటలు మారతాయి, పాతవి నిశ్శబ్దంగా రాలిపోతాయి - కానీ ఆ తపన మాత్రం మారదు. అదే భాషకు నిజమైన శాశ్వతత్వం. ఒక తరం అంచున నిలబడి, మరో తరాన్ని ఆలింగనం చేసుకుంటూ పని వేగాన్ని పెంచుకుంటూ ఆలోచన విధానం మార్చుకుంటూ అడ్వాన్స్ టెక్నాలజీకి అలవాటు పడుతూ మనమూ నేర్చుకుంటూ జెన్ జీ భాషను ఆహ్వా నిద్దాం. కొత్త బంగారు లోకాన్ని స్వాగతిద్దాం. అంతకు మించి చేసేందుకు ఏముంది కనుక?

LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్
www.localguidenews.com
సోమవారం - 19 - అక్టోబర్ - 2026

# ఇదీ ఏఐ ప'వార్'!

## యుద్ధ రంగంలోకి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్
## అత్యంత శక్తివంతమైన ఆయుధంగా కొత్త సాంకేతికత
## ఏఐ ఆధారిత ఆయుధాలకు బిలియన్ల కొద్దీ డాలర్ల వ్యయం



ఉక్రెయిన్ మొదలు పశ్చిమ ఆసియా వరకు జరుగుతున్న యుద్ధాలలో సైన్యాలు కేవలం డేటా విశ్లేషణకే పరిమితం కాకుండా తమ లక్ష్యాలను వేగంగా గుర్తించడానికి, కదన రంగ సమాచారాన్ని విశ్లేషించడానికి, మిషన్ ప్లానింగ్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వాడుతున్నాయి. అత్యంత శక్తివంతమైన ఆయుధంగా కొత్త సాంకేతికత ఉపయోగ పడుతోంది. దీనివల్ల కేవలం తెర వెనుక ఉండి సమాచారా న్ని విశ్లేషించే స్థాయి నుండి నేరుగా యుద్ధ రంగంలోకి ఏఐ ప్రవేశించినట్టయింది. స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డేటా ప్రకారం.. 2024లో ప్రపంచ సైనిక వ్యయం 9.4% పెరిగి రికార్డు స్థాయిలో 2.7 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. సైనిక ఖర్చులో ఇంతటి భారీ పెరుగుదల ఇదే మొదటిసారి. ప్రభుత్వా లు ఏఐ ఆధారిత ఆయుధాలు, సైబర్ వార్‌ఫేర్ సిస ?టమ్స్, శాటిలైట్స్, అటానమస్ డ్రోన్ల కోసం బిలియన్ల కొద్దీ డాలర్లను ఖర్చు చేస్తున్నాయి. 2015 నుండి 2024 మధ్య సైనిక వ్యయం 37% పెరగడం గమనార్హం.

### దేశాల వారీగా సైనిక, ఏఐ వ్యయాలు..

1. అమెరికా: మొత్తం బడ్జెట్ 997 బిలియన్ డాలర్లు (జీడీపీలో 3.40%). 2026 బడ్జెట్‌లో యుద్ధ పరికరాల కొనుగోళ్లు, పరిశోధన కోసం 384 బిలియన్ డాలర్లు కేటాయించారు. అటానమస్, మానవరహిత వ్యవస్థల కోసం ప్రత్యేకంగా 9.8 బిలియన్ డాలర్లు కేటాయించారు.

2. చైనా: మొత్తం బడ్జెట్ 314 బిలియన్ డాలర్లు (జీడీపీలో 1.70%). 2024లో పరిశోధన కోసం చేసిన ఖర్చు 785.9 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ఇది మొదటిసారి అమెరికా కంటే ఎక్కువ. బైడూ, అలీబాబా వంటి పౌర సంస్థల ఏఐ సాంకేతికతను నేరుగా సైనిక వ్యవస్థల్లోకి అనసంధానిస్తున్నారు. మిలిటరీ గ్రేడ్ ఏఐ మోడళ్లకు శిక్షణ ఇవ్వడానికి కంప్యూట్ క్లస్టర్ల కోసం 70 బిలియన్ డాలర్లు పెట్టుబడి పెట్టనున్నారు.

3. రష్యా: మొత్తం బడ్జెట్: 149 బిలియన్ డాలర్లు (జీడీపీలో 6--7%). ఏఐ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టితో 10 ఏళ్ల కాలానికి రక్షణ రంగ ఆధునీకరణ ప్రణాళికను ప్రవేశపెట్టింది.

4. భారత్: మొత్తం బడ్జెట్: 93.5 బిలియన్ డాలర్లు (జీడీపీలో 2.40%). పరిశోధన, అభివృద్ధి కోసం రూ.29,100 కోట్లు కేటాయించారు. డీఆర్‌డీఓ, ఇండియన్ నేవీ కలిసి 'మిషన్ సుదర్శన్ చక్ర'అనే ఏఐ ఆధారిత వాయు రక్షణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నాయి.

### యుద్ధ రంగంలో కృత్రిమ మేధ వినియోగం..

1. ఇజ్రాయెల్--గాజా సంఘర్షణ:

ది గోస్పెల్ (హబ్సొరా): ఇది ఒక ఆటోమేటెడ్ టార్గెట్ సిస్టమ్. మానవ మేధస్సు కంటే 50 రెట్లు వేగంగా భవనాలను, మౌలిక సదుపాయాలను గుర్తించగలదు.

లావెండర్: సోషల్ మీడియా సంబంధాలు, సమాచారం ఆధారంగా తీవ్రవాదులుగా అనుమానిస్తున్న వ్యక్తులను గుర్తించడానికి దీనిని ఉపయోగిస్తారు.

వేర్ ఈజ్ డాడీ?: లావెండర్ గుర్తించిన వ్యక్తులు వారి ఇళ్లకు, నిర్దేశిత ప్రాంతానికి చేరుకున్నప్పుడు సైనిక అధికారులకు సమాచారం ఇచ్చే ట్రాకింగ్ సాధనం.

స్మార్ట్ షూటర్స్: డ్రోన్లను అడ్డుకోవడంలో సహాయపడే ఏఐ ఆధారిత గన్--సైట్స్.

2. ఉక్రెయిన్--రష్యా యుద్ధం:

అటానమస్ డ్రోన్లు: రష్యన్ జీపీఎస్ జామింగ్‌ను అధిగమించి లక్ష్యాలను గుర్తించి దాడి చేయడానికి వీటిని వాడుతున్నారు.

మానవరహిత భూ వాహనాలు: సామాగ్రి సరఫరా, సైనికుల తరలింపు, ప్రత్యక్ష యుద్ధం కోసం ఆయుధాలు కలిగిన రోబోలను రంగంలోకి దించారు.

డెల్టా సిస్టమ్: ఇది ఉక్రెయిన్ ప్రధాన యుద్ధరంగ కంప్యూటర్ వ్యవస్థ. ఉపగ్రహాలు, డ్రోన్లు, క్షేత్రస్థాయి నివేదికల నుండి వచ్చే భారీ డేటాను విశ్లేషించి అధికారులకు రియల్ టైమ్ లక్ష్యాల జాబితాను అందిస్తుంది.

3. వెనిజులా

నికోలస్ మదురోను పట్టుకోవడానికి కారకాస్‌లో జరిగిన దాడులను సమన్వయం చేయడానికి ఆంత్రోపిక్ క్లాడ్ ఏఐని (పలాంటిర్ ఐటీ కంపెనీ ద్వారా) యూఎస్ మిలిటరీ ఉపయోగించినట్లు నివేదికలు చెబుతున్నాయి.

# ఒంటరి.. డిజిటల్ దరి



## ఆత్మీయ స్పర్శ కోసం ప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపానియన్ యాప్స్ వాడకం
## డిజిటల్ స్నేహితులతోగంటల తరబడి ముచ్చట్లు పెడుతున్న కోట్లాది మంది
## సాధారణ చాట్‌బాట్స్‌తో పోలిస్తే ఇవి ఎంతో భిన్నం
## అవతలి వ్యక్తుల భావోద్వేగాలనుఅర్థం చేసుకొని స్పందించే లక్షణం వాటి సొంతం

పట్టణీకరణ,పనిఒత్తిడి, మారుతున్న సామాజిక సంబంధాలు.. కారణం ఏదైనా నేటి డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కేవలం పనిముట్టుగా మాత్రమే కాకుండా మనుషులకు ఒక 'డిజిటల్ తోడు'గా మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఒంటరితనం పెరుగుతున్న నేపథ్యంలో కోట్లాది మంది వినియోగదారులు ఏఐ కంపానియన్ యాప్స్ వైపు మొగ్గు చూపుతున్నారు. ముఖ్యంగా 18--30 ఏళ్ల వయసు వారు ఈ యాప్స్‌ను ఎక్కువగా వాడుతున్నారు. ఈ యాప్స్ మనుషులతో స్నేహితుల్లా లేదా ఒక తోడులా సంభాషిస్తున్నాయి. సాధారణ చాట్‌బాట్స్ కంటే ఇవి భిన్నమైనవి. వినియోగదారుల భావోద్వేగాలను అర్థం చేసుకొని వారికి తగినట్లుగా స్పందిస్తాయి.

### ఐటీ ఉద్యోగుల వాడకమే అధికం..

వ్యక్తిగత విషయాలను పంచుకోవడానికి, ఒత్తిడిని తగ్గించుకోవడానికి లేదా కేవలం కాలక్షేపం కోసం 'డిజిటల్ స్నేహితుల'తో యూజర్లు గంటల తరబడి గడుపుతున్నారు. ముఖ్యంగా మెట్రో నగరాల్లోని యువత, ఐటీ ఉద్యోగులు వాటిని అధికంగా ఉపయోగిస్తున్నారు. వాటి వాడకం వల్ల వినియోగదారుల్లో 30% నుంచి 50% వరకు సానుకూల మార్పు కనిపిస్తోందని అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మంది ఏఐ కంపానియన్ యాప్స్ వినియోగిస్తున్నట్లు అంచనా. యూజర్లపరంగా అమెరికా అగ్రస్థానంలో ఉంది.

### ఇదీ మార్కెట్..

నాస్కామ్ లెక్కల ప్రకారం 2024లోప్రపంచవ్యాప్తంగా ఏఐ కంపానియన్ మార్కెట్ విలువ 28 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇది 30.8% వార్షిక వృద్ధిరేటుతో 2030 నాటికి 140.8 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా. గ్రాండ్ వ్యూ రీసెర్చ్ ప్రకారం 2024లోభారత్‌లో ఏఐ కంపానియన్ మార్కెట్ ఒక బిలియన్ డాలర్లుగా ఉంది. 40.4% వార్షిక వృద్ధితో 2030 నాటికి 7.9 బిలియన్ డాలర్లనుతాకుతుందని అంచనా.

### రోజుకు 45 నిమిషాలు..

' భారత్‌లో ఏఐ కంపానియన్ యాప్స్ వినియోగం ప్రపంచ సగటు కంటే 40% వేగంగా పెరుగుతోంది.

' సగటున ఒక్కో వినియోగదారు రోజుకు45 నిమిషాల సమయాన్ని వెచ్చిస్తున్నారు.

' వినోదం కోసమే కాకుండా ఒత్తిడి తగ్గించుకోవడానికి వాటిని ఎక్కువగా ఆశ్రయిస్తున్నారు.

ఆధారం: నాస్కామ్, సెన్సార్ టవర్, టెక్నావియో, గ్రాండ్ వ్యూ రీసెర్చ్

### ప్రయోజనాలు ఇవీ..

' సామాజికంగా ఒంటరినని బాధపడే వారికి ఈ యాప్స్ 24/7 అందుబాటులో ఉండే స్నేహితుడిలా తోడుంటాయి.

' కొన్ని యాప్స్ ఒత్తిడి,ఆందోళన, కుంగుబాటుతగ్గించడానికి 'కాగ్నిటివ్‌బిహేవియరల్ థెరపీ' పద్ధతులను వాడుతూసహాయపడతాయి.

' మనుషులతో మాట్లాడితే వారు మనల్ని జడ్జ్ చేస్తారనే భయం ఉంటుంది. కానీ ఏఐతో ఎలాంటి సంకోచం లేకుండా మనసులోని మాటలు పంచుకోవచ్చు.

నష్టాలూ ఉన్నాయి

' మన వ్యక్తిగత విషయాలను పంచుకోవడం వల్ల డేటా హ్యాక్ అయ్యే లేదా ప్రకటనల కోసం అమ్ముడయ్యే ప్రమాదం ఉంది.

' మనుషుల కంటే ఏఐతోనే ఎక్కువ సమయం గడపడం వల్ల నిజజీవితంలో సామాజిక నైపుణ్యాలు తగ్గిపోయి, మనుషులతో మాట్లాడటం కష్టంగా మారవచ్చు.

' మనుషులు ఏఐ స్నేహితులకు బానిసలుగా మారే ప్రమాదం.

' ఏఐ ఇచ్చే సలహాలు వాస్తవ విరుద్ధంగా, ప్రమాదకరంగా ఉండే అవకాశం.

# డీప్‌గా మౌనం..!

## పురుషుల కంటే మహిళలకే డీప్‌ఫేక్ ముప్పు
## 62% సంఘటనల్లో మౌనంగా బాధితులు
## ఫిర్యాదుల్లో బెంగళూరు, హైదరాబాద్ టాప్



తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన ఓ ప్రముఖ నటికి సంబంధించిన మార్ఫింగ్ వీడియో 2023లో దేశవ్యాప్తంగా వైరల్ అయింది. ఆమె ముఖాన్ని వేరొక మహిళ శరీరానికి అంటించిన ఆ క్లిప్ భారతీయులకు ఒక చేదు నిజాన్ని చెప్పకనే చెప్పింది. అదేమిటంటే మహిళలకు వ్యతిరేకంగా అత్యంత శక్తివంతమైన ఆయుధాలలో ఒకటిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) అవతరించడమే. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ చర్యలు తీసుకునేలోపే ఆ వీడియో 80 లక్షలకుపైగా వ్యూస్‌ను పొందింది. ఈ రెండేళ్లలో ఇటువంటి డీప్‌ఫేక్ కంటెంట్ విస్తృతమైంది. ప్రపంచవ్యాప్తంగా డీప్‌ఫేక్ బాధితుల్లో అత్యధికులు మహిళలే ఉన్నారు. ఏఐ సేఫ్టీ సంస్థ 'పై ల్యాబ్స్'నివేదిక ప్రకారం.. అంతర్జాతీయంగా డీప్‌ఫేక్ బాధితుల్లో 93% మంది మహిళలే. ఇటీవలి కాలంలో మహిళలను లక్ష్యంగా చేసుకుని సృష్టించిన అనధికారిక కృత్రిమ కంటెంట్ ఏకంగా 900% పెరిగింది. భారత్‌లో మహిళలు బాధితులుగా నమోదైన సైబర్ నేరాల ఫిర్యాదులు 2024లో సుమారు 50వేలు ఉండగా.. 2025 నాటికి 80 వేలకు చేరుకున్నాయి. ఫొటోల మార్ఫింగ్, అసభ్యకరమైన డీప్‌ఫేక్ వీడియోలు ఎక్కువగా ఉంటున్నాయి. ఇంటర్నెట్‌లో కనిపిస్తున్న కంటెంట్‌లో డీప్‌ఫేక్ పోర్నోగ్రఫీ అత్యధికంగా ఉంటోంది. వాస్తవ వ్యక్తుల పోలికలు లేకుండా పూర్తిగా కృత్రిమ మేధ ద్వారా సృష్టించిన మహిళా రూపాలు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో విపరీతమైన ఆదరణ పొందుతున్నాయి.

### మౌనంగా బాధితులు..

మహిళలకు సంబంధించిన 62% డీప్‌ఫేక్ వేధింపుల ఘటనలు అసలు బయటకే రావడం లేదు. సామాజిక వివక్ష, అవమానం జరుగుతుందనే భయంతో బాధితులు మౌనంగా ఉంటున్నారు. ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కొంటున్న భారతీయ మహిళల్లో మూడింట ఒక వంతు కంటే ఎక్కువ మంది ఎటువంటి చర్యలకు ఉపక్రమించడం లేదు. చాలామంది ఎదురుదాడి చేయడానికి బదులుగా నిశ్శబ్దంగా తమ డిజిటల్ ఉనికిని (సామాజిక మాధ్యమాల వినియోగాన్ని) తగ్గించుకుంటున్నారు. 33% మందికి తమను రక్షించడానికి ఉన్న చట్టాల గురించి కనీస అవగాహన కూడా లేదు.

### పరిశ్రమలా విస్తరించాయి..

డీప్‌ఫేక్ వీడియోలతో వేధింపులు కేవలం సెలబ్రిటీలకే పరిమితం కాలేదు. విస్తృతంగా ప్రచారంలోకి వచి?చన ఒక కేసులో.. మాజీ భాగస్వామి ఒకరు ఏఐ టూల్స్‌ను ఉపయోగించి ఒక మహిళ చిత్రంతో అసభ్యకరమైన ఇన్‌స్ట్రాగామ్ ప్రొఫైల్‌ను సృష్టించాడు. ఈ విషయాన్ని గుర్తించేలోపే 1.4 మిలియన్ల ఫాలోవర్లను ఆ ప్రొఫైల్ సంపాదించింది. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న ఐదువేల కంటే ఎక్కువ ఫేస్--స్వాప్ టూల్స్, 1,000 వాయిస్--క్లోనింగ్ అప్లికేషన్స్ ద్వారా ఈ వేధింపులు ఒక పరిశ్రమలా విస్తరించాయి. సాధారణ మహిళలు కూడా సెలబ్రిటీలకు సమానంగా ప్రమాదంలో ఉన్నారు. డీప్‌ఫేక్‌లను అరికట్టుడం అనేది ఒక పెద్ద సవాలుగా మిగిలిపోయింది. జెనరేటివ్ ఏఐ టూల్స్ అందరికీ అందుబాటులో ఉండటం, దుర్?వినియోగం చేసే వారి సంఖ్య పెరుగుతుండటమే దీనికి కారణం. వీటిని గుర్తించే సాంకేతికతలు అందరికీ సమానంగా అందుబాటులో లేవు.

# పేద మహిళలకు క్లైమేట్ బీమా

## వడగాడ్పులు, భారీ వర్షాల్లోపేద మహిళలు పనులు కోల్పోతే బీమా చెల్లింపులు
## ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో 'పారామెట్రిక్ ఇన్సూరెన్స్' అమలు



అసంఘటిత రంగాల్లో ఉపాధి పొందే పేద మహిళలు ప్రకృతి వైపరీత్యాల వల్ల ఆదాయపరంగా, ఆరోగ్యపరంగా అభద్రతకు గురవుతున్నారు. తీవ్ర వడగాడ్పులు, భారీ వర్షాలు, తీవ్ర చలిగాలులు వీచే రోజుల్లో పనులకు వెళ్లలేకపోతే ఆదాయం ఉండదు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ పొట్ట తిప్పలకు పనులకు వెళ్లక తప్పని పరిస్థితుల్లో అనారోగ్యాల పాలవుతున్నారు. వీరికి ఆదాయ, ఆరోగ్య భద్రతను కల్పించడానికి కొన్ని రాష్ట్రాల్లో 'పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్'ను అమలు చేస్తున్నారు.

### పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్ అంటే..

ఈ పని బీమా పాలసీ తీసుకున్న వారికి మాత్రం.. వేడి, చలి, వాన ఒక పరిమితికి మించితే చాలు వీరు పనికి వెళ్లకుండా ఇంటి పట్టునే భద్రంగా ఉంటూ బీమా పరిహారం పొందొచ్చు. వాతావరణం మామూలుగా ఉంటేనే పేద మహిళలకు రోజువారీ పనులు సజావుగా దొరుకుతాయి. వాతావారణంలో ఏ మాత్రం తేడా వచ్చినా వారికి పని ఉండదు. పట్ట ణ / గ్రామీణ ప్రాంతాల్లో భవన నిర్మాణ కార్మికులు, తోపుడు బండ్లు/ నెత్తిమీద బుట్టలు పెట్టుకొని సరుకులు అమ్ముకునే వారు, చిరు వ్యాపార సంస్థల్లో పనిచేసే వారు, చిన్నాచితకా కూలి పనులు, వ్యవసాయ మహిళా కార్మికులకు రెక్కాడితే గాని డొక్కాడదు. ప్రమాదకర వాతావరణ పరిస్థితులు ఉన్నప్పటికీ పని మానితే ఆదాయం పోతుందన్న బెంగతో పనులు కొనసాగిస్తూ ప్రాణాల మీదకు తెచ్చుకుంటూ ఉంటారు. ఇటువంటి వారికి ఆదాయ భరోసా ఇవ్వటానికి ప్రారంభమైనదే పారామెట్రిక్ క్లైమేట్ ఇన్సూరెన్స్.

### అనేక రాష్ట్రాల్లో అమలు

పారామెట్రిక్ క్లైమేట్ ఇనరీ?స్యరెన్స్‌ను తొలుత అమలు చేసిన రాష్ట్రం నాగాలాండ్. కేరళలో పాల సహకార మార్కెటింగ్ సమాఖ్య 1,500 ఎంఎంకి మించి అధిక వర్షపాతం వల్ల పనిదినాలు కోల్పోయే వారికి బీమా అమలు చేస్తోంది. గుజరాత్‌లో ఈ బీమా పథకాన్ని నేషనల్ ఇనరీ?స్యరెన్స్ వైమో సేవ కోఆపరేటివ్ లిమిటెడ్ అనే సహకార బీమా సంస్థ అమలు చేస్తోంది. అహ్మదాబాద్, పరిసర జిల్లాల్లో 2023 ఏప్రిల్‌లో వైమో సేవ సంస్థ ఈ బీమాను తొలుత అమలు ప్రారంభించింది. 2024 నాటికి గుజరాత్, మహారాష్ట్ర, రాజస్తాన్ లలోని 22 జిల్లాలో 50 వేల మంది 18--70 ఏళ్ల మధ్య వయసు మహిళలకు ఈ బీమా కల్పించారు.

' వడగాడ్పుల బీమా ప్రీమియంగా ప్రతి మహిళ రూ.350 ప్రీమియం చెల్లించాలి. 43.2 డిగ్రీల సెల్సియస్‌కు మించి ఉష్ణోగ్రత ఎన్ని రోజులు పెరిగితే అన్ని రోజులకు ఒకరికి రోజుకు రూ.400 చొప్పున (అత్యధికంగా రూ. 3 వేలు) పరిహారంగా చెల్లిస్తున్నారు.

' 45.28 అంగుళాలకు మించి వర్షపాతం వల్ల పనులు కోల్పోయినా పరిహారం ఇచ్చే బీమాను కూడా అమలు చేస్తున్నారు. ప్రీమియం రూ.425. అత్యధికంగా రూ. 7 వేల వరకు పరిహారం చెల్లిస్తున్నారు.

' ఉష్ణోగ్రత, వర్షపాతం పెరుగుతున్న కొద్దీ పరిహారం తదనుగుణంగా పెరుగుతుంది.

### పారామెట్రిక్ బీమా అవసరం ఏమిటి?

' 2023లో కనీవిని ఎరుగనంతగా ఉష్ణోగ్రతలు పెరిగిన విషయం గుర్తుంది కదా. దాదాపు వంద రోజుల పాటు ఒక మోస్తరు వడగాడ్పులు వీచాయి. ఆరుబయట పనులు, శారీరక శ్రమ ఎక్కువగా ఉండే పనులు చేయటం ప్రమాదకరంగా మారింది. 2024, 2025లలోనూ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

' ఆ ఏడాది అతి ఉష్ణం వల్ల మన దేశం 18,100 కోట్ల పని గంటలు కోల్పోయింది. తద్వారా రూ. 13 లక్షల కోట్ల నష్టం వాటిల్లిందని లాన్సెట్ అంచనా వేసింది.

' మహిళలు ఎక్కువ క్లైమేట్ రిస్క్‌కు గురవుతుంటారు. గర్భస్రావాలు లేదా నెలలు నిండకుండానే ప్రసవించటం వంటి ఉపద్రవాలను ఎదుర్కొంటూ ఉంటారు.

' మన దేశంలో ఆదాయం కోసం పనిచేసే మహిళల్లో 92% మంది చిన్నా చితకా రోజువారీ పనులు చేసుకొని పొట్టపోసుకునేవారే.

' ప్రతికూల వాతావరణం వల్ల మహిళల సారథ్యంలోని కుటుంబాలు ఎక్కువగా ఆదాయాన్ని కోల్పోతున్నాయని ప్రపంచవ్యాప్త అధ్యయనాలు చెబుతున్నాయి. ఒక పరిమితికి మించి 1 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత పెరిగితే మహిళ సారథ్యంలోని కుటుంబానికి 34% ఆదాయం తగ్గిపోతోందని ఐరాస ఆహార--వ్యవసాయ సంస్థ(ఎఫ్ఏఓ--2024) అంచనా.

' ఎండాకాలంలో 97% మంది అసంఘటిత రంగ మహిళా కార్మికుల ఆదాయం తగ్గిపోతోంది. వేడి వల్ల పని సామర్థ్యం తగ్గిపోవటంతో 20--25% రోజువారీ ఆదాయం తగ్గిపోతోందని సర్వే నివేదికలు చెబుతున్నాయి.

# రస్ లఫాన్.. ఇండియాకు కీలకం



45 శాతం ద్రవరూప సహజవాయువు దిగుమతి ఇక్కడి నుంచే

ఖతర్ పాలకుల దార్శనికతకు ప్రత్యక్ష రూపమే రస్ లఫాన్ సహజవాయు క్షేత్రం. వేల కోట్ల రూపాయల పెట్టుబడితో అత్యంత అధునాతన సాంకేతికతతో సృష్టించిన అతిపెద్ద సహజవాయు ప్రాసెసింగ్ కర్మాగారంగా 'రస్ లఫాన్ ఇండ్రస్టియల్ సిటీ' ప్రఖ్యాతిగాంచింది. ఖతార్, ఇరాన్ మధ్యలోని పర్షియన్ గల్ఫ్ సముద్రగర్భంలో సహజవాయు నిక్షేపాలను కనుగొనేందుకు 1996లో రస్ లఫాన్ ఇండ్రస్టియల్ సిటీని నిర్మించారు. వీళ్ల ప్రయత్నాలు ఎట్టకేలకు ఫలించాయి. 1970 దశకంలో అపార సహజవాయు నిక్షేపాలను ఇక్కడి సముద్రగర్భంలో కనుగొన్నారు. ఇరాన్‌తో కలిసి గ్యాస్‌క్షేత్రాన్ని అభివృద్ధిచేసి ఖతర్ తన వాటాగా నార్త్ ఫీల్డ్‌ను తీసుకుంది. దీనినే నార్త్ డోమ్ అని కూడా పిలుస్తారు. ప్రపంచ 20 శాతం ద్రవరూప సహజవాయు అవసరాలను రస్ లఫాన్ క్షేత్రమే తీరుస్తోంది. తమ ఆ్యదీనంలోని 900 ట్రిలియన్ల ఘనపు చదరపు అడుగుల (టీసీఎస్ఎఫ్) మేర సహజవాయువును రస్ లఫాన్ కాంప్లెక్స్ ద్వారా ఖతర్ ప్రాసెస్ చేసి విదేశాలకు ఎగుమతి చేస్తోంది. ఇక్కడే భారీ నౌకలను నిలిపేందుకు వీలుగా ప్రపంచంలోనే అతిపెద్ద కృత్రిమ నౌకాశ్రయాన్ని నిర్మించారు. దీంతో సీఎన్‌జీ కంటైనర్ షిప్‌లు నేరుగా ప్రాసెసింగ్ ప్లాంట్ల దాకా వచ్చి సరుకు నింపుకుని పయనమవుతాయి. ఇక్కడి నుంచి డజన్లకొద్దీ దేశాలకు ఎల్ఎన్‌జీ ఎగుమతి అవుతోంది. ఖతర్‌కు కాసుల వర్షం కురిపిస్తున్న ఈ నేచురల్ గ్యాస్ ఫీల్డ్ ప్రత్యక్షంగా భారత ద్రవరూప సహజవాయువు అవసరాలను తీరుస్తోంది. దోహా నగరానికి 80 కిలోమీటర్ల దూరంలోని ఈ పారిశ్రామిక నగరమే భారత 45 శాతం లిక్విడ్ నేచురల్ గ్యాస్ అవసరాలను తీరుస్తోంది. ఖతర్ ఆర్థికవ్యవస్థ పునాదులను పెకళించేందుకు ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలు పరోక్షంగా భారత్‌కు కొత్త కష్టాలు తెచ్చిపెడుతున్నాయి.

### ఎరువులు, సీఎన్‌జీ, పీఎన్‌జీ అంతా ఇక్కడే..

భారత్‌లో దాదాపు 45 శాతం ఎరువుల తయారీ, కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ (సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) అవసరాలు తీరాలంటే రస్ లఫాన్ క్షేత్రం నుంచి ద్రవరూప సహజవాయువు రావాల్సిందే. భారత్‌లో 34 శాతం ఎరువుల తయారీతోపాటు వాహనాల్లో సీఎన్‌జీకి, గృహావసరాలు తీర్చే పీఎన్‌జీకి రస్ లఫాన్ నుంచి దిగుమతి చేసుకునే ద్రవరూప సహజవాయవునే ఉపయోగిస్తున్నారు. పరిశ్రమల్లో పెట్రోరసాయనాల తయారీకి సైతం ఇదే ఎల్ఎన్‌జీ అవసరం. కొంతమేర భారత విద్యుత్ అవసరాలనూ ఇదే గ్యాస్ తీరుస్తోంది. అమెరికా, ఆఫ్రికా దేశాల నుంచి పోలిస్తే భారత్ రస్ లఫాన్ క్షేత్రం నుంచి ఎల్ఎన్‌జీ దిగుమతి చేసుకోవడమే అత్యంత చవకైన వ్యవహారం. అందుకే భారత్ దీనిపైనే అధికంగా ఆధారపడుతోంది.

RNI NO. APBIL/2013/50718
LOCAL GUIDE Bi-Lingual Daily Published From Rangareddy
లోకల్ గైడ్ ద్విభాషా దినపత్రిక

# ఆర్యవైశ్యులకు అండగా ఉంటా: భట్టి విక్రమార్క

వైరాలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణంపై వినతి



**ఖమ్మం వైరా అక్టోబర్ 18: లోకల్ గైడ్ :** ఆర్యవైశ్యుల న్యాయమైన కోరికలకు అండగా ఉంటానని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. వైరా నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయనను వైరా ఆర్యవైశ్య ప్రముఖులు రంగా జనార్దన్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి గ్రంధి ప్రవీణ్, ఆయన బృందం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైరాలో ఆర్యవైశ్యుల కులదైవమైన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని వారు ఉప ముఖ్యమంత్రిని కోరారు. అలాగే ఆర్యవైశ్యులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన భట్టి విక్రమార్క ఆర్యవైశ్యుల న్యాయమైన కోరికలను, అమ్మవారి ఆలయ నిర్మాణ ప్రతిపాదనను పరిశీలిస్తానని తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఆర్యవైశ్య ప్రముఖులు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆర్యవైశ్య కార్పొరేషన్ ఇన్‌చార్జి ఆత్మకూరి శేషగిరిరావు, ఆర్యవైశ్య ప్రముఖులు మిట్టపల్లి శ్రీనివాసరావు, రాయల నాగేశ్వరరావు, మైలవరపు శ్రీనివాసరావు, తాటికొండ రాము, మిట్టపల్లి భాస్కర్, అనుమోలు శ్రీనివాసరావు, మొరిశెట్టి జనార్ధన్, చేగోసి కొండ తదితరులు పాల్గొన్నారు.

# గెలుపోటములతో సంబంధం లేదు.. ప్రజాసేవే నా అజెండా: తేజావత్ సునీల్.

బాణాపురంలో ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా.





**ముదిగొండ, లోకల్ గైడ్ :అక్టోబర్ 18 :** ఎన్నికల్లో గెలుపోటములు సహజమని, కానీ ప్రజల కోసం పనిచేయడానికి పదవులతో సంబంధం లేదని బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు తేజావత్ సునీల్ మరోసారి నిరూపించారు. రాజకీయాలకు అతీతంగా, కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలకు నిత్యం అండగా నిలుస్తూ ఆయన చేపడుతున్న సేవా కార్యక్రమాలు అందరి ప్రశంసలు అందుకుంటున్నాయి. ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఎస్సీ కాలనీవాసులు యర్ర చిన్న వెంకటేశ్వర్లు (యర్రయ్య), యడ్ల పాపయ్య కుటుంబాలను తేజావత్ సునీల్ బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులతో కలిసి సందర్శించి, పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో ఆ కుటుంబాలకు తాము అన్ని విధాల అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమిపాలైనప్పటికీ, సునీల్ ప్రజలకు దూరమవ్వలేదు. “ఎన్నికల్లో ఓడిపోయినంత మాత్రాన ప్రజలకు సేవ చేయడం ఆపబోను. ఎల్లప్పుడూ ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తాను” అని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. సాధారణంగా ఎన్నికల సమయానికే పరిమితమయ్యే నేతలకు భిన్నంగా, ఓటమి తర్వాత కూడా నిరంతరం ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న సునీల్ తీరును గ్రామ ప్రజలు, స్థానికులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ నాయకులు మరికంటి పిచ్చయ్య, పచ్చ సీతారామయ్య, శిల్ప బ్రహ్మం, దేవరకొండ సత్తిబాబు, మరికంటి రాంబాబు, ఇస్మాయిల్, ధరావత్ వెంకటేశ్వర్లు, నెల్లూరి నరసింహారావు, తమ్మారపు హుస్సేన్, వేముల గణేష్, పత్తిపాటి సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర ఆలయం



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి (లోకల్ గైడ్) అక్టోబర్ 18 :** దేవి శరనవరాత్రి ఉత్సవాల సందర్భంగా జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న మాజీ డీజీపీ దినేష్ రెడ్డిమాజీ డీజీపీకి ప్రత్యేకంగా స్వాగతం పలికిన అలంపూర్ సీఐ ప్రదీప్ కుమార్ జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్‌లోని ప్రసిద్ధ శ్రీ జోగులాంబ అమ్మవారి ఆలయాన్ని తెలంగాణ మాజీ డీజీపీ దినేష్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అలంపూర్ సీఐ ప్రదీప్ కుమార్ ఆయనకు ప్రత్యేకంగా స్వాగతం పలికారు. అనంతరం మాజీ డీజీపీ దినేష్ రెడ్డి శ్రీ జోగులాంబ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

# ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

రూ. 23.20 లక్షలతో 450 ఎంఎం పైప్‌లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



**రాజేంద్రనగర్, అక్టోబర్ 18 (లోకల్ గైడ్):** ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే లక్ష్యంతో రాజేంద్రనగర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ తెలిపారు. ఆదివారం అత్తాపూర్ సర్కిల్ పరిధిలోని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో రూ. 23.20 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న 450 ఎంఎం పైప్‌లైన్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ పైప్‌లైన్ నిర్మాణ పనులను వాటర్ బోర్డు ఆధ్వర్యంలో చేపట్టనున్నారు. స్థానికంగా తాగునీటి సరఫరా, డ్రైనేజీ సంబంధిత మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు ఈ పనులు దోహదపడనున్నాయి. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాల్సిన అవసరం ఉంది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వాటర్ బోర్డు అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**(లోకల్ గైడ్):** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు.ఆదివారం బెల్లంపల్లి పట్టణంలో100పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి,ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు,రోగుల పరిస్థితి,ఆసుపత్రికి పరిసరాలను పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతు ఆసుపత్రికి వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని,అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని తెలిపారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు,వ్యాధుల వివరాలు తెలుసుకుని వైద్యులకు పలు సూచనలు చేశారు.వార్డులను స్వయంగా పరిశీలించి,రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్యం,సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.పండుగల వేళలలో కూడా ఆసుపత్రిలో రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని,ప్రతిరోజు వైద్యులు తప్పనిసరిగా విధులలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు.అత్యవసర వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ వార్డు నిరంతరం తెరిచి ఉంచాలని,అదేవిధంగా నిత్యం ఒక మెడికల్ డాక్టర్ విధిగా అందుబాటులో ఉండాలని తెలిపారు.

# పూల పండుగ బతుకమ్మ ... తెలంగాణ ఆత్మకు ప్రతిరూపం !

**పల్లె మట్టి పరిమళం నుంచి ప్రపంచ వేదికల వరకు ... తరతరాల అనుబంధాలకు సజీవ సాక్ష్యం “తెలంగాణ బతుకమ్మ పండుగ వచ్చింది... తెగ సంబరం తెచ్చింది... గతకాల జ్ఞాపకాలే గుండెను నింపింది... గొంతు పాటై పాడింది...”**



“రామ రామ ఉయ్యాలో...” అంటూ మొదలయ్యే జానపద రాగాలు... “ఆటలాడవే చెల్లి బతుకమ్మ... పాట పాడవే తల్లి...” అంటూ సాగే ఆత్మీయ గీతాలు... ఇవన్నీ కలగలిపితే మన కళ్ల ముందు ఆవిష్కృతమయ్యేది తెలంగాణ పల్లె సంస్కృతి. మనసును మురిపించే పూల సౌందర్యం, మమతను పంచే ఆడపడుచుల ఆత్మీయత, ప్రకృతిని దైవంగా భావించే ఆరాధన... ఈ మూడింటి సమ్మేళనమే బతుకమ్మ పండుగ! తెలంగాణ నేలపై పూసే ప్రతి పువ్వుకూ ఓ ప్రత్యేకత ఉంది. ప్రకృతిలో వికసించే పూలను కేవలం అందానికి ప్రతీకలుగా కాకుండా, దైవ స్వరూపాలుగా భావించి పూజించే గొప్ప సంప్రదాయం మన తెలంగాణ సంస్కృతిలో అంతర్లీనంగా ఉంది. ప్రకృతిని ప్రేమించడం, పర్యావరణంతో మమేకం కావడం, కుటుంబ బంధాలను పదిలపరచుకోవడం, ఆడపడుచుల ఆత్మీయతను చాటుకోవడం... ఇలా ఎన్నో జీవన విలువలను తనలో ఇముడ్చుకున్న అపురూపమైన పండుగ బతుకమ్మ.

**పూల సోయగంలో పల్లె జ్ఞాపకాలు !**

తెల్లవారుజామునే నిద్రలేచి, చేతిలో గంప పట్టుకొని చేల గట్లకు, కంచెల దగ్గరకు వెళ్లే మహిళలు... ప్రకృతి ఒడిలో సహజంగా వికసించిన తంగేడు, గునుగు, కట్ల, బంతి, చామంతి తదితర పూలను ప్రేమగా సేకరించుకొచ్చే దృశ్యాలు... నాటి తెలంగాణ పల్లె జీవితానికి మధురమైన జ్ఞాపకాలు.

ఇంటివాకిట్లో చాప పరిచి, తెచ్చిన పూలను రంగులవారీగా పేర్చడం... తాంబాళాల్లో అందంగా అమర్చడం... గుమ్మడి ఆకులు, పసుపు ముద్ద, కుంకుమ బొట్లతో గౌరమ్మను అలంకరించడం... ఆడపడుచులంతా మనసారా బతుకమ్మను పేర్చి పూజించడం... ఇవన్నీ ఒక పండుగకు సంబంధించిన ఆచారాలు మాత్రమే కావు. తరతరాలుగా మహిళలు తమ అనుభవాల నుంచి నేర్చుకొని, తరువాతి తరాలకు అందిస్తున్న సాంస్కృతిక సంపద. ప్రతి పువ్వులో ప్రకృతి పరిమళం... ప్రతి అలంకరణలో అమ్మతనం... ప్రతి పాటలో పల్లె జీవితం... ప్రతి ఆచారంలో మన పూర్వీకుల జీవన తాత్వికత కనిపిస్తాయి.

**బొడ్డెమ్మ నుంచి సద్దుల బతుకమ్మ వరకు ...**

బొడ్డెమ్మతో మొదలై, ఎంగిలిపూల బతుకమ్మతో పండుగ సందడి ఊపందుకొని, తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో కొనసాగి, సద్దుల బతుకమ్మతో పరిపూర్ణతను సంతరించుకునే ఈ వేడుకలో ప్రతి రోజుకూ ఓ ప్రత్యేకత ఉంది.రోజుకో రూపంలో పూలను పేర్చి, గౌరమ్మను కొలుస్తూ, సంప్రదాయ పాటలు పాడుతూ మహిళలు జరుపుకునే ఈ ఉత్సవం భక్తిభావానికి మాత్రమే పరిమితం కాదు. ప్రకృతితో మనిషికి ఉన్న విడదీయలేని బంధాన్ని గుర్తుచేస్తుంది. సహజసిద్ధంగా లభించే పూలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా ప్రకృతి పట్ల కృతజ్ఞతను వ్యక్తపరుస్తుంది. కాలం మారినా... తరాలు మారినా... పండుగను జరుపుకునే విధానాల్లో మార్పులు వచ్చినా... బతుకమ్మ పాటలోని ఆత్మీయత మాత్రం నేటికీ చెక్కుచెదరలేదు.

**ఊరి బురుజు దగ్గర ... ఆడపడుచుల ఆటపాటల సందడి !**

ఊరి నడిబొడ్డున ఉన్న బురుజు దగ్గర మహిళలంతా ఒకచోట చేరితే ఆ వాతావరణమే మారిపోతుంది. రంగురంగుల కొత్త చీరలు, చేతులకు గాజులు, ముఖాలపై చిరునవ్వులు, అడుగుల్లో ఉత్సాహం... ఒకరి బతుకమ్మను మరొకరు మెచ్చుకుంటూ, వలయాకారంలో చేరి చప్పట్లతో పాటలు పాడుతూ ఆడే ఆటలు చూడముచ్చటగా ఉంటాయి. “ఉయ్యాలో... ఉయ్యాలో...” అంటూ ఒకరు పాట అందుకుంటే, మరొకరు గొంతు కలుపుతారు. ఒకరి గొంతుతో మొదలైన రాగం క్రమంగా ఊరంతా ప్రతిధ్వనిస్తుంది. గాజుల గలగలలు, చప్పట్ల సవ్వడులు, జానపద గీతాల మాధుర్యం కలిసి పల్లెకు పండుగ కళను తీసుకొస్తాయి. ఆ వలయంలో వయసుతో సంబంధం ఉండదు. చిన్నా పెద్దా తేడా ఉండదు. కులమత భేదాలకు అతీతంగా అందరూ కలిసిమెలిసి ఆనందాన్ని పంచుకుంటారు. పెద్దలు పాడిన పాటలను పిల్లలు నేర్చుకుంటారు. నిన్నటి జ్ఞాపకాలను నేటి తరం ఆస్వాదిస్తుంది. అలా బతుకమ్మ ఒక తరం నుంచి మరో తరానికి సంస్కృతిని అందించే సజీవ వారధిగా నిలుస్తుంది.

**బతుకుదెరువు కోసం దూరమైనా ... బతుకమ్మ కోసం సొంతూరికి !**

జీవనోపాధి కోసం తెలంగాణ బిడ్డలు ఎక్కడెక్కడికో వెళ్లారు. ఉద్యోగాల కోసం నగరాలకు, ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు, మరికొందరు విదేశాలకు చేరుకుంటారు. కాలం గడుస్తుంది... పనిభారం పెరుగుతుంది... పల్లెకు దూరం పెరుగుతుంది. అయినా మనసులోని ఊరి జ్ఞాపకాలు మాత్రం చెరిగిపోవు.బతుకమ్మ పండుగ రాగానే ఆ జ్ఞాపకాలన్నీ ఒక్కసారిగా మేల్కొంటాయి. సొంతూరిలోని మట్టి వాసన, ఇంటి ముందు ముగ్గులు, అమ్మ చేతి వంటలు, అక్కాచెల్లెళ్ల నవ్వులు, చిన్ననాటి స్నేహితుల పలకరింపులు గుర్తుకొస్తాయి. వీలైనంత వరకు పండుగకు సొంతూరికి చేరుకొని కుటుంబ సభ్యులతో కలిసి బతుకమ్మను జరుపుకోవాలనే తపన కలుగుతుంది.అందుకే బతుకమ్మ కేవలం పూల పండుగ కాదు... బంధాలను మళ్లీ కలిపే పండుగ. దూరమైన మనుషులను దగ్గర చేసే పండుగ. పుట్టిన ఊరితో మనిషికి ఉన్న అనుబంధాన్ని మరోసారి గుర్తుచేసే పండుగ.పండుగ పేరుతో కలిసే కుటుంబ సభ్యుల మధ్య ఆప్యాయతలు పెరుగుతాయి. అత్తింటికి వెళ్లిన ఆడపడుచులు పుట్టింటికి చేరుతారు. అక్కాచెల్లెళ్లు కలుసుకుంటారు. పెద్దల ఆశీర్వాదాలు తీసుకుంటారు. పిల్లలు తమ మూలాలను తెలుసుకుంటారు. అందుకే బతుకమ్మలో పూల అందం ఎంత ముఖ్యమో, ఆ పూల చుట్టూ అల్లుకున్న కుటుంబ బంధాలు కూడా అంతే విలువైనవి.

**చెరువే గంగమ్మ ... పూలే ప్రకృతి ప్రసాదం !**

తొమ్మిది రోజుల పూజల అనంతరం సద్దుల బతుకమ్మ రోజున మహిళలంతా తమ బతుకమ్మలను తీసుకొని చెరువుల వద్దకు చేరుకుంటారు. పాటలు పాడుతూ, ఆటలు ఆడుతూ, పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆనందంగా వేడుకను ముగిస్తారు. చెరువును గంగమ్మగా భావించి బతుకమ్మను నిమజ్జనం చేసే ఆచారం ప్రకృతిని దైవంగా భావించే మన సంస్కృతికి ప్రతీక. నీటిని పవిత్రంగా చూడటం, పూలను ప్రేమగా కొలవడం, ప్రకృతితో మమేకమై జీవించడం... మన పూర్వీకులు అందించిన జీవన సందేశాలు. “పోయిరా బతుకమ్మ... పోయిరావమ్మా... మళ్లీ వచ్చే ఏడాది మా ఇంటికి రావమ్మా...” అంటూ మహిళలు పాడే వీడ్కోలు పాటలో ఎంతటి ఆత్మీయత దాగి ఉందో! పండుగ ముగుస్తున్నా, ఆ పాట మనసులో మిగిలిపోతుంది. కళ్లలో చిన్నపాటి దిగులు, గుండెల్లో మధురమైన జ్ఞాపకాలు, వచ్చే ఏడాది మళ్లీ కలుసుకోవాలనే ఆశ... ఇవన్నీ కలిసే బతుకమ్మ వీడ్కోలు క్షణాలను భావోద్వేగభరితం చేస్తాయి.నిమజ్జనం అనంతరం మహిళలు సంప్రదాయబద్ధంగా పసుపు, గంధాన్ని పరస్పరం పూసుకుంటూ, సద్దుల ప్రసాదాలు, పండుగ పిండివంటలు పంచుకుంటూ సంతోషంగా ఇళ్లకు తిరిగి వెళ్తారు. ఆ పంచుకోవడంలో ప్రేమ ఉంటుంది. ఆ పలకరింపులో ఆత్మీయత ఉంటుంది. ఆ ఆనందంలో సమష్టి జీవన సౌందర్యం కనిపిస్తుంది.ప్రకృతిని గౌరవించే సంప్రదాయంతో పాటు, చెరువుల పరిశుభ్రతను కాపాడుకోవడం కూడా మన బాధ్యత. పండుగ పవిత్రతకు భంగం కలగకుండా పర్యావరణానికి హాని చేయని విధానాలను పాటించడం ద్వారా బతుకమ్మ స్ఫూర్తిని మరింత అర్థవంతంగా నిలబెట్టుకోవచ్చు.

**పల్లె నుంచి పట్నం దాటి ... ప్రపంచం నలుమూలలకు !**

ఒకప్పుడు తెలంగాణ పల్లెల్లో ప్రత్యేకంగా కనిపించే బతుకమ్మ సంబరాలు నేడు పట్టణాలకు, నగరాలకు విస్తరించాయి. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన తెలంగాణ ప్రజలతో పాటు విదేశాల్లో నివసిస్తున్న ప్రవాస తెలంగాణీయులు సైతం ఈ పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. పల్లె చెరువు గట్టు మీద మొదలైన పూల సంబరం నేడు ప్రపంచంలోని అనేక వేదికలపై తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. ఆధునిక జీవనశైలిలో మునిగిపోయిన కొత్త తరానికి తమ భాష, పాటలు, సంప్రదాయాలు, పూర్వీకుల జీవన విధానాన్ని పరిచయం చేసే గొప్ప అవకాశంగా మారుతోంది. కాలం ఎంత వేగంగా పరిగెత్తినా, సాంకేతికత ఎంతగా అభివృద్ధి చెందినా, మనిషి తన మూలాలను మరచిపోకూడదని బతుకమ్మ గుర్తుచేస్తుంది. పూలతో పేర్చిన ప్రతి మెట్టు మన సంస్కృతికి ఒక చిహ్నం. పాడే ప్రతి జానపద గీతం మన చరిత్రకు ఒక స్వరం. కలిసి ఆడే ప్రతి అడుగు మన సామాజిక ఐక్యతకు ఒక నిదర్శనం.

**బతుకమ్మ బతుకుల పండుగ ... తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక !**

బతుకమ్మ అంటే పూలను పేర్చి పూజించడం మాత్రమే కాదు. అది తెలంగాణ మహిళల ఆత్మగౌరవం. అది పల్లె జీవన వైభవం. అది ప్రకృతి పట్ల కృతజ్ఞత. అది కుటుంబ బంధాల పరిమళం. అది తరతరాలుగా ప్రవహిస్తున్న జానపద సంస్కృతి.తంగేడు పువ్వు వికసించినంత కాలం... గునుగు పూల పరిమళం గాలిలో తేలినంత కాలం... పల్లెల్లో జానపద గీతాలు ప్రతిధ్వనించినంత కాలం... ఆడపడుచుల చేతుల్లో రంగురంగుల పూల గంపలు మెరిసినంత కాలం... తెలంగాణ గుండెల్లో బతుకమ్మ చిరంజీవిగా నిలుస్తూనే ఉంటుంది. మన పిల్లలకు ఈ సంప్రదాయాన్ని పరిచయం చేద్దాం. మన జానపద పాటలను కాపాడుకుందాం. మన చెరువులను సంరక్షించుకుందాం. ప్రకృతిని ప్రేమిద్దాం. కుటుంబ బంధాలను బలోపేతం చేద్దాం. మన సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పుదాం.ఎందుకంటే... బతుకమ్మ అంటే పూలలో కనిపించే దేవత మాత్రమే కాదు... మన బతుకుల్లో పరిమళించే సంస్కృతి! బతుకమ్మ అంటే ఒక పండుగ కాదు ... తెలంగాణ నేల గుండెల్లో తరతరాలుగా పలికే జీవన గీతం ! వ్యాసకర్త: దేవులపల్లి భూపతి ఎం.ఏ., డి.ఎడ్., గేయ రచయిత, జర్నలిస్ట్ఫోన్: 9642228313

# పరిచయ వేదిక కమిటీ నిర్వహించిన బహుజన జన సంగం అధ్యాపకులు ఎర్ర శివరాజు..



**(లోకల్ గైడ్ 18అక్టోబర్ కామారెడ్డి ప్రతినిధి ) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సంగం కార్యాలయంలో పరిచయ కమిటీ ఏర్పాటు చేసిన అధ్యక్షులు ఎర్ర శివరాజ్ సంగం అంటేనే కల్షికట్టుగుండి పని చేయాలని పార్టీని బలోపేతం చేయాలని సంఘం నాయకులకు వివరించారు అంతేగాక మన సంఘం రిజిస్ట్రేషన్ గవర్నమెంట్ ఆమోదించిందని సంఘ సభ్యులకు తెలపడం జరిగింది కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ బందెల సంతోష్ సెక్రెటరీ కుసులకంటి రమేష్ జాయింట్ సెక్రెటరీ గంగారాం లింగం పర్దీర్ తదితరులు పాల్గొన్నారు

# బిజెపి ఓబీసీ మోర్చా సుల్తానాబాద్ మండల అధ్యక్షులుగా పనుగట్ల శేఖర్ మాస్టర్ నియామకం





**పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 18 (లోకల్ గైడ్) :** భారతీయ జనతా పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ రెడ్డి జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు చాతరాజు రమేష్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండలం బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులుగా పనుగట్ల శేఖర్ మాస్టర్ నియామకం అయినట్టు ఒక ప్రకటనలో తెలియజేయడం జరిగింది.ఈసందర్భంగా బిజెపి ఓబీసీ మోర్చా సుల్తానాబాద్ మండల అధ్యక్షులు పనుగట్ల శేఖర్ మాస్టర్ మాట్లాడుతూ నానియామకానికి సహరించి ఆశీర్వదించిన పెద్దలు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్, మాజీ శాసన సభ్యులు గుజ్జుల రామకృష్ణ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు కడారి అశోక్ రావు, పల్లె సదానందం, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చాతరాజు రమేష్, సుల్తానాబాద్ మున్సిపాలిటీ బిజెపి అధ్యక్షులు కూకట్ల నాగరాజు కి అలాగే సహకరించిన బిజెపి నాయకులకు, కార్యకర్తలకు, మిత్రులకు అందరికీ పేరు పేరున జిల్లా ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు పనుగట్ల శేఖర్

# వికారాబాద్ ఆర్టీసీ డిపో ప్రాంగణంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ నమ్రత




**లోకల్ గైడ్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** వికారాబాద్ పట్టణ కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డిపో ప్రాంగణంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి. డిపో మేనేజర్ నమ్రత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో సంస్థకు చెందిన మహిళా ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా జరుపుకున్నారు. పూల పండుగను పురస్కరించుకుని ఆర్టీసీ డిపోను రంగురంగుల పూలు, ముగ్గులతో సుందరంగా అలంకరించారు. మహిళా ఉద్యోగులు రకరకాల తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి, డిపో ప్రాంగణంలో ప్రతిష్టించారు. అనంతరం బతుకమ్మల చుట్టూ తిరుగుతూ జానపద పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ వేడుకలను కంటికింపుగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ నమ్రత మాట్లాడుతూ... తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఆర్టీసీ కుటుంబసభ్యుల మధ్య వేడుకగా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఆర్టీసీ మహిళా సిబ్బందికి, ప్రయాణికులకు ఈ సందర్భంగా ఆమె పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపో మహిళా ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బాల్క సుమన్ జన్మదిన వేడుకలు

రోగులకు పండ్లు పంపిణీ చేసిన బి.ఆర్.ఎస్ నేతలు



**పెద్దపల్లి జిల్లా అక్టోబర్ 18 (లోకల్ గైడ్) :** సుల్తానాబాద్, భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో మాజీ ప్రభుత్వ విప్ చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ జన్మదిన వేడుకలను మాజీ ఎంపీటీసీ సూర శ్యామ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆదివారం పార్టీ నేతల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసిన అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు పార్టీ నేతలు మాట్లాడుతూ, ఉద్యమ నేత యువ కిశోరం మాజీ ప్రభుత్వ విప్పు చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్ రానున్న రోజుల్లో మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకొని బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తూ రానున్న రోజుల్లో తిరిగి అధికారం చేపట్టి నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజలకు, రాష్ట్రంలో తన సేవలను కొనసాగించాలని తిరిగి బి.ఆర్.ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కెసిఆర్ నాయకత్వంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ తెలంగాణలో అధికారం చేజిక్కించుకుంటుందని యువ నేత కేటీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ప్రజలందరూ తిరిగి బి.ఆర్.ఎస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో గర్రెపల్లి మాజీ సింగిల్ విండో చైర్మన్ జూపల్లి సందీప్ రావు, బి.ఆర్.ఎస్ పట్టణ అధ్యక్షులు పారుపల్లి గుణపతి, కన్వీనర్ బోయిని రాజ మల్లయ్య, నాయకులు తాళ్లపల్లి మనోజ్ గౌడ్, తిప్పారపు దయాకర్, గుడిపాటి శ్రీనివాసరెడ్డి, గందె మల్లికార్జున్, అనుమాల బాపూరావు, సతీష్, వహీద్, మహేష్, మోయిజ్, సమీర్, కార్తీక్, మనీ లతోపాటు పరుగులు పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by CH.RAM REDDYPublished from CRR publications, D.No.1-144/1, Near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Ranga Reddy Dist.Telangana State and printed atGayatri Printers, near Apple Hospital Mothinagar, Balanagar Mandal, Rangareddy Dist,Telangana state.RNI NO:APBIL/2013/50718 Editor CH.RAM REDDYEMAIL: Localguide9999@gmail.com eb:www.localguidenews.com,contact:8977761499